PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 218 | విజయవాడ, బుధవారం 13 మార్చి 2024 | 8+8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Wednesday 13 March 2024 | Rs

పారిశ్రామిక ఉత్పత్తి నేలచూపులు

- 3.8కి పడిపోయిన ఐఐపి

2



పెర్రీ దెబ్బకు ముంబయి ధమాల్ 8

ఎట్టకేలకు...



- సుప్రీం ఆదేశాలతో ఇసికి ఎన్నికల బాండ్ల వివరాలు అందజేసిన ఎస్‌బిఐ

ప్రజాశక్తి- న్యూఢిల్లీ బ్యూరో

సుప్రీం కోర్టు రెండోసారి నిర్దేశించిన గడువు ముగిసిన కొద్దిసేపటికి ఎస్‌బిఐ ఎన్నికల బాండ్ల వివరాలను ఎన్నికల కమిషన్‌కు మంగళవారం అందజేసింది. ఈ విషయాన్ని భారత ఎన్నికల కమిషన్ ఎక్స్ వేదికగా ధ్రువీకరించింది. 'ఎలక్టోరల్ బాండ్ల విషయంలో ఫిబ్రవరి 15న ఒకసారి, మార్చి 11న మరోసారి సుప్రీంకోర్టు జారీ చేసిన ఆదేశాల ప్రకారం... ఎస్‌బిఐ నుంచి ఎలక్టోరల్ బాండ్స్ సమాచారం మంగళవారం అందింది' అని ఇసిఐ వెల్లడించింది. మార్చి 12వ తేదీ వ్యాపార వేళలు ముగిసేలోగా ఎన్నికల బాండ్ల వివరాలను ఇసికి పంపాలంటూ సుప్రీం కోర్టు ఎస్‌బిఐని ఆదేశించింది. ఈ వివరాలన్నింటినీ మార్చి 15వ తేదీ సాయంత్రం 5గంటల కల్లా ఎన్నికల కమిషన్ తన అధికార వెబ్‌సైట్‌లో ప్రచురించాల్సి వుంది. 2018లో ఎన్నికల బాండ్ల పథకాన్ని ప్రవేశపెట్టినప్పటి నుండి 30 విడతల్లో రూ.16,518 కోట్ల విలువ చేసే బాండ్లను ఎస్‌బిఐ జారీ చేసింది.

ఆ ఇద్దరు ఎమ్మెల్సీలపై వేటు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన ఇద్దరు ఎమ్మెల్సీలపై శాసనమండలి ఛైర్మన్ మోషేన్‌రాజు అనర్హత వేటు వేశారు. వైసిపి నుంచి ఎన్నికైన ఎమ్మెల్సీలు వంశీకృష్ణ యాదవ్, సి రామచంద్రయ్య పార్టీ ఫిరాయించారు. వంశీకృష్ణ యాదవ్ జనసేనలో చేరగా, రామచంద్రయ్య టిడిపిలో చేరారు. వీరిపై చర్యలు తీసుకోవాలని వైసిపి శాసనమండలి విప్‌లు మురళీధర్, లేళ్ల అప్పిరెడ్డి మండలి కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శాసనమండలి ఛైర్మన్ మోషేన్‌రాజు ఇటీవలే వారికి నోటీసులిచ్చి వ్యక్తిగతంగా విచారణ జరిపారు. అనంతరం మంగళవారం పార్టీ ఫిరాయింపుల చట్టం ఆధారంగా వారిని అనర్హులుగా ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల టిడిపిలో చేరిన నలుగురు వైసిపి ఎమ్మెల్యేలను, వైసిపిలో చేరిన నలుగురు టిడిపి ఎమ్మెల్యేలను కలిపి మొత్తంగా ఎనిమిది మంది ఎమ్మెల్యేలను శాసనసభ స్పీకరు తమ్మినేని సీతారాం అనర్హులుగా ప్రకటించిన విషయం తెలిసిందే.



శాకాహారం సెగలు

- ప్లేట్ భోజనంపై 7శాతం భారం
- పప్పులు, టమాట ధరల ఎఫెక్ట్
- క్రిసిల్ రిపోర్ట్

3

వెల్లువెత్తిన నిరసనలు

సిఎఎపై అస్సాం, బెంగాల్‌ల్లో ఆందోళనలు • పోరాటం కొనసాగిస్తామన్న ప్రతిపక్షాలు

- న్యాయ పరిధిలో వుంటే ఎలా అమలు చేస్తారని ప్రశ్న
- ఓట్ల కోసమే ఈ చర్యలంటూ విమర్శలు
- అస్సాంలో సంపూర్ణ బంద్‌కు పిలుపు

న్యూఢిల్లీ : పార్లమెంట్‌లో బిల్లును ఆమోదించిన నాలుగేళ్ల తర్వాత పౌరసత్వ సవరణ చట్టం-సిఎఎ నిబంధనలను సోమవారం రాత్రి మోడీ ప్రభుత్వం ప్రకటించడంతోనే అస్సాంలో విస్తృతంగా నిరసనలు వెల్లువెత్తాయి. దేశవ్యాప్తంగా ఆందోళనలు, నిరసనలు సోమవారం కొనసాగాయి. ఢిల్లీలోని ఢిల్లీ యూనివర్శిటీ ఆర్ట్స్ ఫ్యాకల్టీ వద్ద విద్యార్థులు నిరసన తెలిపారు. సిఎఎను వ్యతిరేకిస్తూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. సుమారు 70 మంది విద్యార్థులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిర్బంధించిన విద్యార్థులు బురారీ పోలీస్ స్టేషన్‌కు తరలించామని, తరువాత విడిచిపెట్టామని డిసిపి (నార్త్) మనోజ్ మీనా తెలిపారు. షహీన్‌బాగ్, జామియానగర్, ఈశాన్యప్రాంతం, జామియా మిలియా క్యాంపస్‌లలో భారీగా పోలీసులను మోహరించారు.అయినప్పటికీ సోమవారం రాత్రి జామియా మిలియా క్యాంపస్‌లో కొద్దిమంది విద్యార్థులు నిరసన తెలిపారు.

అస్సాంలో ప్రతిపక్ష పార్టీలు, ఆల్ అస్సాం స్టూడెంట్స్ యూనియన్ (అసు) వంటి వివిధ సంస్థలు తీవ్ర నిరసన వ్యక్తం చేశాయి. రాష్ట్రవ్యాప్తంగా సిఎఎ కాపీలను అసు కార్యకర్తలు దగ్ధం చేశారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా భద్రతను కట్టుదిట్టం చేశారు. నిరసనలకు, ఆందోళనలకు దిగితే అణచివేస్తామని డిజిపి హుకుం జారీ చేశారు.

యునైటెడ్ అపోజిషన్ ఫోరమ్-అస్సాం (యుఓఎఫ్ఎ) బ్యానర్ కింద మొత్తంగా 16 ప్రతిపక్ష పార్టీలు మంగళవారం నాడు సంపూర్ణ బంద్‌కు పిలుపునిచ్చాయి. సిఎఎకు వ్యతిరేకంగా శివసాగర్‌లో మంగళవారం నిరసనలు చేస్తున్న కృషక్ ముక్తి సంగ్రామ్ సమితి, ఛత్ర ముక్తి సంగ్రామ్ సమితి, రాజోర్ దళ్‌లకు చెందిన కార్యకర్తలను అస్సాం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

అస్సాం ఒప్పందం అమలును తాము స్వాగతిస్తామని యుఓఎఫ్ఎ ఒక ప్రకటనలో తెలిపింది. అక్రమ విదేశీయుల భారాన్ని అస్సాం ఎంత మాత్రమూ ఆమోదించలేదని పేర్కొంది. 1971 మార్చి 25న లేదా ఆ తర్వాత రాష్ట్రానికి వచ్చిన విదేశీయులందరినీ ఎన్నికల జాబితాల నుండి తొలగిస్తామని, వారిని తరలించేందుకు చర్యలు తీసుకుంటామని అస్సాం ఒప్పందం పేర్కొంటోంది.

'సిఎఎను మేం ఎంత మాత్రమూ ఆమోదించబోం. దీనివల్ల అస్సామీ కమ్యూనిటీ నాశనమవుతుంది. మా భాష, సంస్కృతి, సాహిత్యం, గుర్తింపు అన్నీ నిర్మూలించబడతాయి." అని యుఓఎఫ్ఎ ఒక ప్రకటనలో పేర్కొంది.

పార్లమెంట్ లోపల, వెలుపల తాము సిఎఎపై పోరాడతామని ఆసు ప్రకటించింది. అహింసా పద్ధతిలో, శాంతియుతంగా, ప్రజాస్వామ్యయుతంగా సిఎఎ వ్యతిరేక ఉద్యమాన్ని నిర్వహిస్తామని ఆసు సలహాదారు సముజ్జల్ భట్టాచార్య మీడియాకు తెలిపారు. దీంతో పాటూ చట్టపరమైన పోరాటాన్ని కూడా కొనసాగిస్తామన్నారు.

రాజోర్ దళ్ అధ్యక్షుడు అఖిల్ గొగి మాట్లాడుతూ.. సిఎఎను అమలు చేసినట్లైతే, తమ జీవనోపాధికి, గుర్తింపునకు ప్రమాదమని ఒక వర్గం ప్రజలు భయపడుతున్నారని అన్నారు. ఈ ఒక్క చర్యతో, ఇన్నేళ్ళుగా అక్రమ ఇమ్మిగ్రేషన్‌కు వ్యతిరేకంగా అస్సాం సాగిస్తూ వచ్చిన పోరాటం మిగతా 2లో



సిఎఎను వ్యతిరేకిస్తూ అస్సాంలో ప్రతిపక్షాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆందోళన చేస్తున్న ప్రజలు

సిఎఎ నిబంధనలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం

- సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో

న్యూఢిల్లీ : పౌరసత్వ చట్ట సవరణ (సిఎఎ) నిబంధనలను ప్రకటించడాన్ని సిపిఐ(ఎం) తీవ్రంగా వ్యతిరేకించింది. పార్టీ పొలిట్‌బ్యూరో మంగళవారం నాడు ఈ మేరకు ఒక ప్రకటన విడుదలజేసింది. పౌరసత్వాన్ని మతపరమైన గుర్తింపుతో ముడిపెట్టడం ద్వారా ఈ సిఎఎ రాజ్యాంగంలో పొందుపరిచిన పౌరసత్వ లౌకిక సూత్రాన్ని ఉల్లంఘిస్తోందని పొలిట్‌బ్యూరో విమర్శించింది.

ఈ చట్టం కింద నోటిఫై చేసిన నిబంధనలు ఆచరణలో పొరుగు దేశాల నుండి వచ్చిన ముస్లింల పట్ల వివక్షాపూరిత వైఖరిని అనుసరించనున్నాయి. పైగా ఈ చట్టం అమలును జాతీయ పౌర పట్టిక (ఎన్ఆర్‌సి) ఏర్పాటుతో ముడిపెట్టడాన్ని బట్టి చూస్తే ఈ నిబంధనలు ముస్లిం సంతతికి చెందిన పౌరులను లక్ష్యంగా చేసుకుంటారనే భయాందోళనలు రేకెత్తించేవిగా ఉన్నాయని పొలిట్‌బ్యూరో పేర్కొంది.

తమ రాష్ట్రాల్లో పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకునే వ్యక్తులను గుర్తించడం, వారి పేర్లను నమోదు చేసుకోవడం వంటి ప్రక్రియ నుండి రాష్ట్ర ప్రభుత్వాలను పూర్తిగా మినహాయించేలా ఈ నిబంధనలను రూపొందించారని, సిఎఎను తీవ్రంగా వ్యతిరేకించిన రాష్ట్ర ప్రభుత్వాలను మినహాయించేందుకే ఇదంతా చేస్తున్నారని పొలిట్‌బ్యూరో విమర్శించింది.

సిఎఎను ఆమోదించి నాలుగేళ్ళకు పైగా గడిచిన తర్వాత, అందునా లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడడానికి కొద్ది రోజులు ముందుగా ఈ నిబంధనలను ప్రకటించడం చూస్తుంటే సిఎఎ అమలును విచ్ఛిన్నకర, మతపరమైన పోలరైజేషన్ (చీలిక) కోసం ఉపయోగించుకోవాలన్నదే బిజెపి ఎత్తుగడగా ఉందని స్పష్టమవుతోందని పొలిట్‌బ్యూరో పేర్కొంది. ఈ రీత్యా సిఎఎను, దాని అమలును తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, ఈ వినాశకర సిఎఎను రద్దు చేసేదాకా తమ యత్నాలు కొనసాగుతాయని పొలిట్‌బ్యూరో పునరుద్ఘాటించింది.

పతనమైన మిర్చి ధర

- 20 రోజుల కిందట రూ.60 వేలు.. ఇప్పుడు రూ.20 వేలు
- కర్ణాటకలో రైతుల ఆందోళన



ప్రజాశక్తి- అనంతపురం ప్రతినిధి

బ్యాడిగి డబ్బిరం రకం ఎండు మిర్చి ధర అమాంతంగా పడిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. 20 రోజుల వ్యవధిలోనే క్వింటాలు ధర రూ.60 వేల నుంచి రూ.20 వేలకు పడిపోయింది. దీంతో, కర్ణాటకలోని బ్యాడిగి, హావరి ప్రాంతాల్లో మన రాష్ట్రం, కర్ణాటక రాష్ట్రాల రైతులు ఆందోళన బాటపడ్డారు. హావరి మార్కెట్ యార్డులో సోమవారం నాడు నిరసనకు దిగారు. కార్యాలయాన్ని, వాహనాలను తగులబెట్టారు. మంగళవారం కూడా నిరసన కొనసాగించారు.

బ్యాడిగి డబ్బిరం మార్కెట్ అక్కడే!

అనంతపురం జిల్లా ఉరవకొండ, వజ్రకరూరు, విడపనకల్లు బెళుగుప్ప తదితర మండలాల్లో మిర్చిని అధికంగా సాగు చేస్తున్నారు. అధిక డిమాండ్, ధర ఉండే బ్యాడిగి డబ్బిరం రకం మిర్చిని పైమండలాల్లో తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ, గుంతకల్లు బ్రాంచ్ కెనాల్ కింద సుమారు 60 వేల ఎకరాల్లో వేశారు. వర్షాభావంతో కాలువలకు సక్రమంగా నీరు రాకపోయినా ట్యాంకర్ల ద్వారా నీటిని అందించారు. ఎకరానికి 25 క్వింటాళ్ల వరకు దిగుబడి రావాలి. వర్షాభావం, నీటి కొరతతో 15 నుంచి 20 క్వింటాళ్లలోపే వచ్చింది. ఈ పంటను ఇక్కడ అమ్ముకోవడానికి మార్కెట్ సౌకర్యం లేదు. దీంతో, కర్ణాటక రాష్ట్రం హావరి, బ్యాడిగి ప్రాంతాల్లోని మిర్చి మార్కెట్లలో విక్రయిస్తున్నారు. కర్ణాటకలోని రైతులు కూడా ఆ మార్కెట్లకే మిర్చిని ఎక్కువగా తెస్తుంటారు. ఈ రకం మిర్చికి 20 రోజుల క్రితం వరకూ క్వింటాలుకు రూ.60 వేల ధర పలికేది. ప్రస్తుతం రూ.20 వేలు ధర పడిపోయింది. వ్యాపారులు కుమ్మక్కై ధరను భారీగా తగ్గించేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ కర్ణాటక, ఆంధ్రా రైతులు ఆందోళన బాట పట్టారు. బ్యాడిగి మార్కెట్ యార్డులో నిరసనకు దిగారు.

ఒకేసారి ధర అంతలా పడిపోతే ఎలా?

ఐదు ఎకరాల్లో మిర్చి సాగు చేశాను. ఎకరానికి ఒకటిన్నర లక్షల రూపాయల వరకూ పెట్టుబడి అయింది. వర్షాభావం, తెగుళ్ల వల్ల ఎకరానికి 15 క్వింటాళ్లలోపే పంట దిగుబడి వచ్చింది. 20 రోజుల వ్యవధిలో ధర రూ.60 వేల నుంచి రూ.20 వేలకు పడిపోయింది. ప్రకృతి అనుకూలించక, మార్కెట్‌లో ధర లేక రెండు రకాలుగా నష్టపోయే పరిస్థితి వచ్చింది.

-విజయ్, శిర్పికొట్టాల గ్రామం, బెళుగుప్ప మండలం

రైతుకు మద్దతుగా నిలవాలి

మార్కెట్‌లో ధర నిలకడ లేకుండా ఉంటోంది. వ్యాపారులు అమాంతంగా ధరను తగ్గించేస్తున్నారు. దీంతో, రోజుల వ్యవధిలోనే ధరలు భారీగా పడిపోతున్నాయి. మిర్చి మార్కెట్ అనంతపురం జిల్లా ప్రాంతాల్లో ఎక్కడా లేదు. దీంతో, ఈ ప్రాంత రైతులు కర్ణాటకకు వెళ్లాల్సి వస్తోంది. అక్కడ వ్యాపారాలు అడిగిన ధరకే అమ్ముకోవాల్సి వస్తోంది. ఈ ప్రాంతంలో మిర్చి కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకొని రైతులకు మద్దతుగా నిలవాలి.

-మధుసూదన్, ఎపి కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు



కృష్ణా రివర్ వ్యూ పార్క్‌ను ప్రారంభిస్తున్న సిఎం జగన్‌మోహన్‌రెడ్డి

అభివృద్ధిని చేతల్లో చూపాం

- 'కృష్ణా' రిటైనింగ్ వాల్ ప్రారంభోత్సవంలో సిఎం జగన్

ప్రజాశక్తి- విజయవాడ

రాష్ట్రంలో అభివృద్ధిని చేతల్లో చూపామని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. గత 58 నెలల్లో ఎన్నో అభివృద్ధి పనులు చేశామని పేర్కొన్నారు. విజయవాడలో రూ.620.93 కోట్లతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు మంగళవారం ఆయన ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేశారు. విజయవాడ కృష్ణలంక వాసులు కృష్ణా వరద ముంపు బారిన పడకుండా నది వెంబడి రూ.369.89 కోట్లతో నిర్మించిన రిటైనింగ్ వాల్‌ను, నదీ తీరంలో రూ.12.4 కోట్లతో నిర్మించిన రివర్ వ్యూ పార్క్‌ను ప్రారంభించారు. నగరంలోని మిగతా 2లో

ఆధార్ గడువు పొడిగింపు

న్యూఢిల్లీ : ఆధార్‌లో వివరాలు ఉచితంగా అప్‌డేట్ చేసుకునేందుకు విధించిన గడువు తేదీని మరో మూడు నెలలు పొడిగిస్తున్నట్లు ఉడాయ్ తెలిపింది. కేంద్రం ఇచ్చిన గడువు మార్చి 14తో ముగియనుండడంతో జూన్ 14 వరకు గడువు పెంచినట్లు భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ' (యుఐడిఎఐ) ఎక్స్‌లో పోస్ట్ చేసింది. తొలుత 2023 మార్చి15 వరకు ఉన్న గడువును డిసెంబరు 14 వరకు పొడిగించింది. తర్వాత 2024 మార్చి 14 వరకు అప్‌డేట్ చేసుకునేందుకు అవకాశం కల్పించింది. తాజాగా మరోసారి గడువు తేదీని పొడిగించింది. ఆధార్ అప్‌డేట్ కోసం ప్రజల నుంచి విశేష స్పందన వస్తుండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఉడాయ్ ఓ ప్రకటనలో పేర్కొంది. ఆధార్ తీసుకుని పదేళ్ల పూర్తయిన వారు తమ డెమోగ్రఫిక్ వివరాలు అప్‌డేట్ చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం ఉడాయ్ వెబ్‌సైట్‌లోకి లాగిన్ అయ్యి లేటెస్ట్ గుర్తింపు కార్డు, అడ్రస్ వివరాలను ఇవ్వాలి. రేషన్ కార్డు, ఓటర్ ఐడీ, కిసాన్ ఫొటో పాస్‌బుక్, పాస్‌పోర్ట్ వంటివి గుర్తింపు, చిరునామా రెండింటికీ ధ్రువీకరణ పత్రాలుగా వినియోగించుకోవచ్చు.

ముఖ్యమంత్రి జగన్ నుంచి ప్రాణహాని

- రక్షణ కల్పించాలని సిబిఐ కోర్టులో దస్తగిరి పిటిషన్

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో అప్రూవర్‌గా మారిన దస్తగిరి మంగళవారం హైదరాబాద్‌లోని సిబిఐ కేసుల ప్రత్యేక న్యాయస్థానంలో ప్రొటెక్షన్ పిటిషన్ దాఖలు చేశారు. ఆంధ్రప్రదేశ్ సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన సతీమణి భారతి, జగన్ సమీప బంధువులు అవినాష్ రెడ్డి, దేవిరెడ్డి శివశంకర్ రెడ్డి, ఆయన కుమారుడు చైతన్య రెడ్డి నుంచి తనకు, తన కుటుంబానికి ప్రాణ హాని ఉందని ఈ పిటిషన్‌లో పేర్కొన్నారు. రక్షణ కల్పించేలా తగిన ఆదేశాలు ఇవ్వాలని న్యాయస్థానాన్ని కోరారు. ఎంపి అవినాష్ బెయిల్ రద్దు చేయాలని కూడా హైకోర్టులో దస్తగిరి పిటిషన్ వేశారు. కాగా, దస్తగిరి అప్రూవర్ పిటిషన్‌పై సిబిఐ కోర్టులో వాదనలు ముగిశాయి. తనను ఈ కేసులో ముద్దాయిగా కాకుండా సాక్షిగా పరిగణించాలని ఆయన పిటిషన్ వేశారు. దీనిపై తీర్పును సిబిఐ కోర్టు రిజర్వ్ చేసింది.

కేరళకు వన్‌టైమ్ ప్యాకేజి

- 31లోగా ప్రత్యేక పథకాన్ని రూపొందించాలి
- కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో



కేరళకు వన్‌టైమ్ ప్యాకేజి అందించాలని కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు సూచించింది. కేరళ పరిస్థితులను పరిశీలించి ఈ నెల 31లోగా వారికి సాయం చేసేందుకు ప్రణాళిక రూపొందించాలని పేర్కొంది. రుణాలపై ఆంక్షలను తొలగించాలని, ఫెడరలిజాన్ని దెబ్బతీసే కేంద్ర జోక్యాలను నిలిపేయాలని డిమాండ్ చేస్తూ కేరళ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కెవి విశ్వనాథన్‌తో కూడిన ధర్మాసనం మంగళవారం విచారించింది. కేరళ ఈ ఏడాది తీసుకున్న రుణాన్ని వచ్చే ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో మాఫీ చేసేలా నిబంధనలు రూపొందించాలని సూచించింది. నిపుణులతో చర్చించి ఏం చేయొచ్చో కోర్టుకు తెలియజేయాలని, బుధవారం సమాధానం ఇవ్వాలని కేంద్రాన్ని ధర్మాసనం ఆదేశించింది.

కేరళ తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపిస్తూ రూ.13,608 కోట్లు రుణం తీసుకోవాలన్న కేంద్రం ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిందని, అదనంగా రూ.19 వేల కోట్లు ఇవ్వాలన్న కేరళ అభ్యర్థనను తోసిపుచ్చినట్లు కపిల్ సిబల్ తెలిపారు. అదే సమయంలో కేరళ తరహాలో ఆర్థిక సంక్షోభంలో ఉన్న తొమ్మిది రాష్ట్రాలు ప్రత్యేక సాయం కోసం 14 సార్లు దరఖాస్తు చేసుకున్నాయని, వాటిని కూడా తిరస్కరించామని కేంద్ర ప్రభుత్వం తరపున అటార్నీ జనరల్ (ఎజి) ఆర్ వెంకటరమణి, అదనపు సొలిసిటర్ జనరల్ (ఎఎస్‌జి) ఎన్ వెంకట్రామన్ పేర్కొన్నారు. ఏప్రిల్ 1న మరో రూ.5 వేల కోట్లు రుణం తీసుకోవడానికి అనుమతించాలని కేంద్రం ప్రతిపాదించిందని పేర్కొన్నారు. దీనికి స్పందించిన మిగతా 2లో

కార్పొరేట్ల గుప్పెట్లోకి అడవులు

రంపచోడవరం నియోజకవర్గ అభివృద్ధి సిపిఎంతోనే సాధ్యం : వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి- రంపచోడవరం (అల్లూరి సీతారామరాజు జిల్లా)

ఆదివాసీల విలువైన భూములను, అడవులను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. మరలా వారే గెలిస్తే ఆదివాసీలకు తీవ్ర ముప్పు వాటిల్లనుందని తెలిపారు. రంపచోడవరం నియోజకవర్గ అభివృద్ధి సిపిఎంతోనే సాధ్యమన్నారు. ఇక్కడి నుంచి సిపిఐ, కాంగ్రెస్, వామపక్షాలు, ఆదివాసీ, కార్మిక, ప్రజా సంఘాలు బలపరిచిన సిపిఎం అభ్యర్థిని గెలిపించాలని కోరారు. మంగళవారం రంపచోడవరంలో సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ అధ్యక్షతన విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీనివాసరావు మాట్లాడుతూ సిపిఎం అభ్యర్థి గెలిస్తే పోలవరం నిర్వాసితుల సమస్యలపై గళం విప్పి పరిష్కరిస్తారన్నారు. అభ్యర్థిని త్వరలో ప్రకటిస్తామన్నారు. ఈ నియోజకవర్గం సిపిఎంకు బలమైనదని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా ఉన్నప్పుడు సున్నం రాజయ్య, కుంజా బొజ్జిలను ఎమ్మెల్యేలుగా, డాక్టర్ మిడియం బాబూరావును ఎంపీగా ప్రజలు గెలిపించుకున్న విషయాన్ని గుర్తు చేశారు. ఈ ఎన్నికల్లో ఆ ఒరవడిని పునరావృతం చేయాలని కోరారు. ప్రస్తుత తరుణంలో గిరిజనుల సమస్యలపై గళమెత్తేవారు అసెంబ్లీలో ఉండాల్సిన అవసరముందన్నారు. ఉపాధి హామీ చట్టం, కొండపోడు పట్టాలు వంటివి సిపిఎం పోరాటాల ఫలితంగానే వచ్చాయని గుర్తు చేశారు. గడిచిన పదేళ్లలో రంపచోడవరం నియోజకవర్గాన్ని టిడిపి, వైసిపి పట్టించుకోలేదని, పోలవరం నిర్వాసితులకు తీవ్ర అన్యాయం చేశాయని తెలిపారు. పరిహారం, పునరావాసం వంటివి అమలు చేయకుండా డ్యాం నిర్మాణంపై మాత్రమే దృష్టి పెట్టి గిరిజనులు, ప్రజలు గ్రామాలను ఖాళీ చేసి పారిపోయేలా చేశాయన్నారు. అటవీ హక్కుల సవరణ చట్టం తీసుకొచ్చి గిరిజనులను అటవీ ప్రాంతం నుంచి తరిమేసే కుట్రలు జరుగుతున్నాయని తెలిపారు. బిజెపి పాలనలో దేశం అన్నింటా వెనుకబడిపోయిందన్నారు. చేసిన అభివృద్ధి లేకపోవడంతో అయోధ్యలో రామాలయం నిర్మించామని చెప్పుకుంటోందని, ప్రపంచంలోనే అభివృద్ధి చెందిన దేశంగా భారతదేశాన్ని తీర్చిదిద్దాలి తప్ప, పెద్ద పెద్ద దేవాలయాలు నిర్మించడం వల్ల లాభం ఏంటని ప్రశ్నించారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ మిగతా 2లో



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

'బ్లూ ఎకానమీ' పై కాగ్ ఆరా!

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి
సముద్ర తీర ప్రాంతాల్లో అభివృద్ధికి అమలు చేస్తున్న బ్లూ ఎకానమీపై కాగ్ ఆరా తీస్తోంది. ఏయే పథకాలకు ఎంత వ్యయం చేశారు అన్న కోణంలో వివరాలు ఇవ్వాలని కోరింది. దీనిలో భాగంగా 39 అంశాలకు సంబంధించిన ప్రొఫార్మాను రాష్ట్రానికి పంపించారు. 11 కీలక రంగాల్లోని 39 అంశాల్లో వివరాలు కావాలని రాష్ట్ర ప్రభుత్వానికి కాగ్ కోరింది. మత్స్యశాఖ, రొయ్యల పెంపకం, మెరైన్ బయో టెక్నాలజీ, సముద్ర పర్యాటకం, సముద్ర ఖనిజాలువంటి పారిశ్రామిక అభివృద్ధి, పోర్టుల ద్వారా సరుకు రవాణా, సాంప్రదాయేతర విద్యుత్ ఉత్పత్తి, వ్యర్థాల నిర్వహణ, సముద్ర తీరంలో భద్రత, కార్బన్ నియంత్రణ, మొత్తం అంశాలకు ఆర్థిక సహకారం వంటి అంశాలు వీటిలో ఉన్నాయి. దీంతో వీటిపై దృష్టి సారించి అధికారులు వివరాలు సేకరిస్తున్నారు.

శాసనమండలి విప్‌గా వరుదు కల్యాణి

- జంగా కృష్ణమూర్తి తొలగింపు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
శాసనమండలిలో వైసిపి పక్ష విప్‌గా శాసనమండలి సభ్యులు వరుదు కల్యాణి నియామకమయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి మంళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకూ విప్‌గా ఉన్న శాసనమండలి సభ్యులు జంగా కృష్ణమూర్తి గురజాల సీటు విషయంలో వైసిపి అధిష్టానంపై ఆగ్రహంతో ఉన్నారు. టిడిపిలో చేరతారనే ప్రచారమూ జరుగుతోంది. ఈ నేపథ్యంలో అతన్ని తొలగించి కల్యాణిని నియమించారు.

వచ్చే ఐదేళ్లలో ఇంటింటికి సురక్షిత మంచినీరు

- కేంద్ర హోంమంత్రి అమిత్ షా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో
వచ్చే ఐదేళ్లలో దేశంలోని ఇంటింటికి నల్లా ద్వారా సురక్షిత మంచినీరు అందిస్తామని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా హామీ ఇచ్చారు. సికింద్రాబాద్‌లోని ఇంపీరియల్ గార్డెన్‌లో నిర్వహించిన బిజెపి సోషల్ మీడియా ఇన్‌ఛార్జ్‌ల సమావేశం, ఎల్‌బి స్టేడియంలో నిర్వహించిన బూత్ స్థాయి అధ్యక్షుల విజయ సంకల్ప సమ్మేళనంలోనూ ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 12 కంటే ఎక్కువ సీట్లు దక్కించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. సోషల్ మీడియా ద్వారా ప్రతి ఇంటికీ బిజెపిని తీసుకెళ్లాలని సూచించారు. అవినీతి రహిత భారత్ నిర్మాణమే బిజెపి లక్ష్యమన్నారు. కాంగ్రెస్, బిఆర్‌ఎస్ ఎంఐఎం మూడూ అవినీతి పార్టీలేననీ, మజ్లిస్ అజెండాతోనే కాంగ్రెస్, బిఆర్‌ఎస్ పనిచేస్తాయని విమర్శించారు. పదేళ్ల యుపిఎ పాలనలో తెలంగాణకు రూ.1.17 లక్షల కోట్లు మాత్రమే వచ్చాయనీ, మోడీ హయాంలో ఇప్పటికే రాష్ట్రానికి రూ. ఐదు లక్షల కోట్లు నిధులు వచ్చాయని వివరించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఎంపిలు బండి సంజయ్, లక్ష్మణ్, సీనియర్ నేతలు ఈటల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

సిఎఎపై వైఖరి ప్రకటించండి

- టిడిపి, వైసిపిలకు వామపక్షాల డిమాండ్



విజయవాడ లెనిన్‌సెంటర్‌లో సిఎఎపై నిరసన తెలుపుతున్న వామపక్షాల నాయకులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
దేశంలో మతపరమైన విభజనను సృష్టించి రాజకీయ లబ్ధి పొందేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన వివాదాస్పద పౌరసత్వ సవరణ చట్టం(సిఎఎ)పై వైసిపి, టిడిపిలు తమ వైఖరిని ప్రకటించాలని వామపక్షాలు డిమాండ్ చేశాయి. మతం ఆధారంగా పౌరసత్వం ఇచ్చే ఈ ప్రక్రియను ప్రజలంతా ప్రతిఘటించాలని కోరాయి. మంగళవారం విజయవాడలోని లెనిన్ సెంటర్‌లో కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన సిఎఎ నోటిఫికేషన్‌ను నిరసిస్తూ సిపిఐ, సిపిఎంల ఆధ్వర్యంలో నిరసన జరిగింది. ఈ నిరసన కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రానున్న ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు సిఎఎ నోటిఫికేషన్‌ను ఇచ్చిందన్నారు. దేశంలో చాలా రాష్ట్రాలు ఈ ప్రమాదకరమైన సిఎఎ చట్టాన్ని తమ రాష్ట్రాల్లో అమలు చేయబోమని ప్రకటించాయని తెలిపారు. దేశంలో ఈ పదేళ్ల కాలంలో పెరిగిన నిరుద్యోగం, పేదరికం, రైతాంగం సమస్యలు లాంటి వాటికి సమాధానం చెప్పుకోలేక మతోన్మాదాన్ని రెచ్చగొట్టి ఓట్లుకొల్లగొట్టాలని కేంద్రంలోని నరేంద్రమోడి ప్రభుత్వం కుట్రలను చేస్తోందని విమర్శించారు. బిజెపి ప్రభుత్వం రాజ్యాంగ విలువలను నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తోందని అన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబురావు మాట్లాడుతూ దేశంలో ప్రజలను మతాలపేరుతో చీలికలు తెచ్చి తమ రాజకీయ పబ్బం గడుపుకోవడానికి బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. సిఎఎ అనేది ముస్లిమ్‌ల సమస్య ఒక్కటే కాదని ఇది దేశ రాజ్యాంగ సమస్య అని అన్నారు. ఈ రోజు ముస్లిమ్‌లను లక్ష్యంగా పెట్టుకొన్న బిజెపి రేపు క్రైస్తవులు, దళితులు, గిరిజనులపై కూడా సిఎఎ పేరుతో దాడి చేసే ప్రమాదం వుందని ఆందోళన వ్యక్తం చేశారు. సిఎఎ చట్టం చేసినపుడే దేశవ్యాప్తంగా ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారని తెలిపారు. ప్రజాందోళనలకు జడిసి నాడు వెనక్కు తగ్గిన బిజెపి ఇపుడు ఎన్నికల వస్తున్నాయని అమలుకు పూనుకుంటోందని చెప్పారుప ఈ ప్రమాదకరమైన సిఎఎపై రాష్ట్రంలోని టిడిపి, వైసిపి తమ వైఖరిలను ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి డి కాశిపతి, సిపిఐ నగర కార్యదర్శి జి కోటేశ్వరరావు, ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక ఉత్పత్తి నేలచూపులు

- 3.8కి పడిపోయిన ఐఐపి

న్యూఢిల్లీ : దేశ పారిశ్రామిక ఉత్పత్తి సూచీ (ఐఐపి) నేల చూపులు చూస్తోంది. భారత ఆర్థిక వ్యవస్థ దూసుకుపోతోందని.. ప్రపంచంలోనే టాప్ 3 స్థానంలోకి రానుందని ప్రధాని మోడీ చేస్తోన్న ప్రకటనలకు భిన్నంగా గణంకాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రస్తుత ఏడాది జనవరిలో ఐఐపి 3.8 శాతానికి మందగించింది. ఇంతక్రితం డిసెంబర్‌లో ఇది 4.24 శాతం పెరుగుదలను కనబర్చింది. 2023 జనవరిలో 5.8 శాతం వృద్ధి చోటు చేసుకుంది. గడిచిన జనవరిలో ముఖ్యంగా తయారీ రంగం పేలవ ప్రదర్శన కనబర్చింది. ఆ రంగం ఉత్పత్తి 3.2 శాతానికి పడిపోయింది. డిసెంబర్‌లో 4.5 శాతం పెరిగింది. మరోవైపు మైనింగ్, విద్యుత్ ఉత్పత్తి రంగాలు మాత్రం వరుసగా 5.9 శాతం, 5.6 శాతం చొప్పున వృద్ధిని నమోదు చేశాయి. ఈ రంగాలు డిసెంబర్‌లో 5.2 శాతం, 1.2 శాతం చొప్పున పెరిగాయి.

మేక్ ఇన్ ఇండియా వైఫల్యం : ఏచూరి
పారిశ్రామిక ఉత్పత్తి గణంకాలను పరిశీలిస్తే ప్రధాని మోడీ పదే పదే చెబుతోన్న మేక్ ఇన్ ఇండియా ఘోరంగా విఫలమైందన్న వాస్తవం స్పష్టమవుతోందని సిపిఎం ప్రధానకార్యదర్శి సీతారాం ఏచూరి విమర్శించారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. గడిచిన జనవరిలో పారిశ్రామిక ఉత్పత్తి సూచీ 5.8 శాతం నుంచి 3.8 శాతానికి పడిపోవడమే ఇందుకు నిదర్శనమన్నారు. ఆర్థిక వ్యవస్థను వాస్తవం కంటే ఎక్కువ చేసి మోడీ సర్కార్ అభూతకల్పనలు సృష్టిస్తోందన్నారు.

రైల్వే ఉద్యోగులకు బహుమతులు ప్రదానం

తిరుపతి టౌన్ : ఆలిండియా రైల్వే మన్స్ ఫెడరేషన్ శతాబ్ది ఉత్సవాల సందర్భముగా సౌత్, సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్, గుంతకల్ డివిజన్‌లోని అన్ని బ్రాంచులలో క్రికెట్ టోర్నమెంట్లు మార్చి 8, 9 తేదీల్లో అగ్రికల్చరల్ కాలేజీ గ్రౌండ్ నందు క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. సదరు మ్యాచ్‌కు సంబంధించిన విన్నర్స్, రన్నర్స్ ట్రోఫీలను మంగళవారం తిరుపతి రైల్వే స్టేషన్ డైరెక్టర్ కొప్పాల సత్యనారాయణ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మజ్దూర్ యూనియన్ గుంతకల్ డివిజనల్ ప్రెసిడెంట్ కె సుదర్శన్ రాజు, టెక్నికల్ బ్రాంచ్ సెక్రటరీ ఎస్ రవీంద్ర నాయక్, చైర్మన్ నారాయణస్వామి పాల్గొన్నారు.


గుడివాడ అమర్‌నాథ్‌కు గాజువాక

- చిలకలూరిపేటలో మనోహర్ నాయుడు
- కర్నూలు మేయరుగా సత్యనారాయణమ్మ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
పరిశ్రమలశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు ఎట్టకేలకు సీటు దక్కింది. ఇప్పటికే సమన్వయకర్తలను ప్రకటించిన గాజువాక, చిలకలూరిపేట అసెంబ్లీ నియోజకవర్గాలకు మళ్లీ సమన్వయకర్తలను మారుస్తూ మంగళవారం వైసిపి ప్రకటన విడుదల చేసింది. గుడివాడ అమరనాథ్ ప్రస్తుతం ప్రాతినిధ్యం వహిస్తున్న అనకాపల్లి సీటును మలసాల భరత్‌కుమార్‌కు కేటాయించడంతో అమర్‌నాథ్‌కు టికెట్ లేదని విపరీతంగా ట్రోల్ అయ్యారు. ఇప్పటికే వరికూటి రామచంద్రారావును గాజువాక అసెంబ్లీకి సమన్వయకర్తగా నియమించారు. ఇపుడు ఆయన్ను మార్చి గుడివాడ అమర్‌నాథ్‌కు కేటాయించారు. అలాగే వైద్యారోగ్యశాఖ మంత్రి విడదల రజిని ప్రాతినిధ్యం వహిస్తున్న చిలకలూరిపేట నుంచి మొదట మల్లెల రాజేష్‌నాయుడును సమన్వయకర్తగా నియమించారు. ఇపుడు ఆయనను తప్పించి గుంటూరు మేయర్ కావటి మనోహర్‌నాయుడును చిలకలూరిపేట సమన్వయకర్తగా ప్రకటించారు. అలాగే కర్నూలు మేయర్ బివై రామయ్యను కర్నూలు పార్లమెంటు అభ్యర్థిగా ప్రకటించడంతో ఆయన స్థానంలో నగరంలోని 25వ వార్డుకు చెందిన కె సత్యనారాయణమ్మ పేరును ప్రతిపాదించారు.

టిడిపి, జనసేనలో సిఎఎ కలవరం

- మైనార్టీలు దూరమవుతారన్న ఆందోళన



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
బిజెపితో పొత్తు ఖారారవటంతో ముస్లిం మైనార్టీ వర్గాలు దూరమవుతాయనే ఆందోళన టిడిపి, జనసేన నేతల్లో నెలకొంది. 2019లో నిలిపివేసిన సిటిజన్ అమెండ్‌మెంట్ యాక్ట్ (సిఎఎ)ను అమల్లోకి తీసుకొస్తూ, బిజెపి ఆధర్యంలో కేంద్ర ప్రభుత్వం సోమవారం ఉత్వర్వులు జారీచేయటంతో టిడిపి, జనసేన వర్గాల్లో ప్రస్తుతం అంతర్మథనం మొదలైంది. ఇప్పటికే తమకు ఇష్టం లేకపోయినా, అధినేత చంద్రబాబు మాటకు కట్టుబడి బిజెపితో పొత్తుకు కట్టుబడి ఉన్న తెలుగుదేశం వర్గాల్లో తాజా పరిణామం కలకలం రేపింది. బిజెపితో పొత్తు ఖారారైన మరుసటి రోజే వివాదస్పద సిఎఎను బిజెపి అమల్లోకి తేవడం తీవ్ర చర్చకు దారి తీసింది. సిఎఎ వల్ల తమకు ఎంతోకొంత అండగా ఉన్న మైనార్టీలు దూరమైపోతారని అభిప్రాయాన్ని ఆ వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి. రాష్ట్రంలో కనీసం 30 నియోజకవర్గాల్లో మైనార్టీలు గెలుపోటములను ప్రభావితం చేసే స్థితిలో ఉన్నారని ఆ వర్గాలు లెక్కలు వేస్తున్నాయి. విజయవాడ పశ్చిమ, గుంటూరు ఈస్ట్, నెల్లూరు సిటీ, రూరల్, కర్నూలు, కడప, అనంతపురం అర్బన్, నంధ్యాల, ఆదోని, మదనపల్లి, ప్రొద్దుటూరు, చిత్తూరు, తెనాలి, పొన్నూరు, మచిలీపట్నం, ఒంగోలు, హిందూపురం, గుంతకల్లు, కదిరి, రాయచోటి, నరసరావుపేట, కావలి, చిలకలూరిపేట, ధర్మవరం, ఆళ్లగడ్డ, బనగానపల్లి, ఆత్మకూరు, నందికొట్కూరు, శ్రీశైలం నియోజకవర్గాలు ఈ జాబితాలో ఉన్నాయి. ఇవిగాక మరికొన్ని నియోజకవర్గాల్లోనూ కనీసం పది వేల నుండి 20 వేల దాకా మైనార్టీల ఓట్ల సంఖ్య ఉంది. పోటాపోటీ పరిస్థితి నెలకొన్నప్పుడు ప్రతి ఓటు కీలకంగా మారే విషయం తెలిసిందే. దీంతో బిజెపితో పొత్తు ఏ పరిణామానికి దారి తీస్తుందోనన్న ఆందోళన వీరిలో వ్యక్తమవుతోంది. ఐదేళ్ల క్రితం సిఎఎ చట్టాన్ని తీసుకొచ్చిన సమయంలో ప్రజానీకంలో వ్యతిరేకత వ్యక్తమైన సంగతి తెలిసిందే. దీంతో బిజెపి సిఏఏ అమలును పక్కనబెట్టింది. తెలుగుదేశం పార్టీ కూడా వేర్వేరు కారణాలతో ఎన్‌డిఎ కూటమి నుండి బయటకు వచ్చింది. అప్పటి నుండి దూరంగా ఉన్న టిడిపి, జనసేనతో కలిసి ఇటీవల బిజెపితో పొత్తు పెట్టుకుంది. పొత్తు ప్రకటించిన రోజే బిజెపి సిఏఏను అమలు చేస్తూ నోటిఫికేషన్ ఇచ్చేసింది. దీంతో టిడిపి, జనసేన నేతల్లో గందరగోళం నెలకొంది. సమైక్య రాష్ట్ర విభజన అనంతరం రాష్ట్రంలో 2011 జనాభా లెక్కల ప్రకారం 36,17,713 మంది ముస్లిములు ఉన్నారు.

ఉమ్మడి జిల్లాల్లో ముస్లిముల జనాభా(2011 లెక్కల ప్రకారం)

శ్రీకాకుళం	9025
విజయనగరం	16,423
విశాఖపట్నం	86330
ఈస్ట్‌గోదావరి	77,777
పశ్చిమగోదావరి	86,142
కృష్ణా	3,07,043
గుంటూరు	5,59,770
ప్రకాశం	2,20,654
ఎస్‌పిఎస్‌నెల్లూరు	2,88,378
వైఎస్‌ఆర్	4,54,108
కర్నూలు	6,70,737
అనంతపురం	4,43,456
చిత్తూరు	3,97,870
మొత్తం	**36,17,713**



సిఎఎను వ్యతిరేకిస్తూ కేరళలో ఆందోళన చేస్తున్న ఎల్‌డిఎఫ్ నాయకులు



సిఎఎను వ్యతిరేకిస్తూ ఢిల్లీలోని జామియా ఇస్లామియా విశ్వవిద్యాలయంలో ఆందోళన చేస్తున్న విద్యార్థులు

వెల్లువెత్తిన నిరసనలు !

(మొదటిపేజీ తరువాయి)
పనికి రాకుండా పోయిందన్నారు. బంగ్లాదేశ్‌లో నివసిస్తున్న 1.7కోట్ల మంది హిందువులు అస్సాంలోకి రావడానికి కూడా ఈ చర్య ద్వారాలు తెరుస్తుందన్నారు.

ఎఐయుడిఎఫ్ ఎంఎల్‌ఎ అష్రఫుల్లా హుస్సేన్ మాట్లాడుతూ, బంగ్లాదేశీ హిందువుల ఓట్లను ఆశించే ఎన్నికల ముందు బిజెపి ఈ చర్య అమలు చేస్తోందని విమర్శించారు. 1971 మార్చి 25కి ముందు వచ్చిన ఎవరికైనా భారత పౌరసత్వం ఇవ్వడానికి తాము అనుకూలమేనని, కానీ దాన్ని ఏ మతంతో లేదా కమ్యూనిటీతో ముడిపెట్టరాదని అన్నారు.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి సుప్రకాష్ తాలుక్‌దర్ మాట్లాడుతూ, సిఎఎ జ్యుడీషియల్ పరిధిలో వున్నందున దీన్ని అమలు చేసే ఉద్దేశ్యం లేదని అన్న ప్రభుత్వం ఇప్పుడు ఎలా తీసుకువచ్చిందో చెప్పాలని ప్రశ్నించారు.

అస్సాం ఆప్ అధ్యక్షుడు బాబెన్ చౌదరి మాట్లాడుతూ, అస్సాం చరిత్రలో ఇదొక దుర్దినమని వ్యాఖ్యానించారు. ఈ చర్య తీసుకున్న బిజెపి ఒక దేశద్రోహిగా గుర్తుండిపోతుందని అన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా జరపతలపెట్టిన హర్తాళ్‌ను ఉపసంహరించాలంటూ అస్సాం పోలీసులు ప్రతిపక్షాలకు నోటీసులు ఇచ్చాయి. తమ ఆదేశాలను అమలు చేయడంలో విఫలమైతే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పశ్చిమ బెంగాల్‌లో నిరసనలు
సిఎఎ అమలు చేస్తూ కేంద్రం తీసుకున్న చర్యలతో ఉత్తర బెంగాల్‌లో ముఖ్యంగా రాజవంశి కమ్యూనిటీలో తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి. తమకు సిఎఎ వద్దని, ఎన్‌ఆర్‌సి కావాలని రాజవంశీ కమ్యూనిటీ నేత వంశి బదాన్ బర్మన్ వ్యాఖ్యానించారు. సిఎఎను బలవంతంగా అమలు చేయాలని భావిస్తే, ముందు ప్రజలతో చర్చలు జరపాలని, ఆ తర్వాత చర్యలు తీసుకోవాలని అన్నారు.

బెంగాల్‌ను మరోసారి విభజించేందుకు ఇదొక ఎత్తుగడ చర్య అని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మంగళవారం విమర్శించారు. మరోసారి ఎవరూ శరణార్థులు కావడానికి అనుమతించేది లేదన్నారు. సిఎఎను, ఎన్‌ఆర్‌సిని అనుమతించేది లేదని స్పష్టం చేశారు. ఉత్తర 24 పరగణాలోని హబ్రాలో ర్యాలీలో ఆమె ప్రసంగించారు.

బిజెపి చర్యలను ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఆడిన డ్రామాగా సిపిఎం నాయకులు విమర్శించారు. ప్రజల్లో అయోమయం, గందరగోళం సృష్టించడమే వారి ఉద్దేశ్యమన్నారు. కాగా మరోవైపు ఉత్తర 24 పరగణాలు, నడియాల్లో ప్రధానంగా వున్న మతువా కమ్యూనిటీ ఈ చర్య పట్ల హర్షం వ్యక్తం చేసింది.

ఆమోదయోగ్యం కాదు : తమిళ సూపర్‌స్టార్ విజయ్
కేంద్రం తీసుకువచ్చిన చర్య తమకు ఎంత మాత్రమూ ఆమోదయోగ్యం కాదని తమిళ్ సూపర్‌స్టార్ విజయ్ వ్యాఖ్యానించారు. విచ్ఛిన్నకర రాజకీయాలే లక్ష్యంగా దీన్ని అమల్లోకి తెస్తున్నారన్నారు. ప్రజలు సామాజిక సామరస్యతతో జీవించే ఈ దేశంలో ఇటువంటి చర్యలు ఎంత మాత్రమూ అనుమతించలేమన్నారు.



టవర్ క్లాక్ వద్ద నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

ప్రజల మధ్య ఐక్యతకు విఘాతం

- సిఎఎను వ్యతిరేకిస్తూ అనంతపురంలో నిరసన

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్
ప్రజల మధ్య ఐక్యతను దెబ్బతీసేలా పౌరసత్వ సవరణ చట్టం(సిఎఎ)ను తీసుకురావడాన్ని వ్యతిరేకిస్తూ అనంతపురం టవర్ క్లాక్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం ఒకటవ నగర కార్యదర్శి వి.రామిరెడ్డి మాట్లాడుతూ.. వివక్ష పూరిత చట్టం అమలుకు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ నోటిఫికేషన్ జారీ చేసిందని, ఇది ప్రజల మధ్య ఐక్యతను దెబ్బతీస్తుందని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో లబ్ధి పొందాలనే దురుద్దేశంతోనే కేంద్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని అమల్లోకి తెచ్చిందన్నారు. సిఎఎను అమలు చేయబోమని కేరళ ప్రభుత్వం తేల్చిచెప్పడం హర్షించదగ్గ విషయమన్నారు. ప్రజల ఐక్యతను దెబ్బతీసే ఈ చట్టాన్ని దేశ ప్రజలంతా ఐక్యంగా తిప్పి కొట్టాలన్నారు. ముస్లిం మైనార్టీలను ద్వితీయ శ్రేణి పౌరులుగా పరిగణించే ఈ చట్టాన్ని అన్ని రాష్ట్రాల్లోనూ అమలు చేయకుండా ఆయా ప్రభుత్వాలు నిర్ణయం తీసుకోవాలని కోరారు. బలవంతంగా సిఎఎను అమలు చేయాలని చూస్తే ప్రజల మద్దతుతో రానున్న ఎన్నికల్లో బిజెపి, ఆ పార్టీని బలపరుస్తున్న మిత్ర పక్షాలను ఓడించాలని కోరారు.


ప్రారంభమైన విశాఖపట్నం - భువనేశ్వర్ వందేభారత్ రైలు

రైల్వేలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం

- వర్చువల్‌గా ప్రధాని ప్రారంభం

ప్రజాశక్తి - యంత్రాంగం



దేశంలోని పలు రైల్వే ప్రాజెక్టులను ప్రధాని మోడీ మంగళవారం గుజరాత్‌లోని అహ్మదాబాద్ నుంచి వర్చువల్ విధానంలో ప్రారంభించారు. కొత్త ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండియన్ రైల్వేను మరింత ఆధునికీకరించనున్నామని తెలిపారు. విశాఖ - భువనేశ్వర్, సికింద్రాబాద్ - విశాఖ మధ్య ఏర్పాటు చేసిన వందే భారత్ రైళ్లను ఆయన ప్రారంభించారు. ఈ సదర్భంగా వాల్తేరు రైల్వే డిఆర్ఎం సౌరభ్ ప్రసాద్ మాట్లాడుతూ.. వందే భారత్ రైలు ఒక ఎగ్జిక్యూటివ్ కోచ్, ఏడు చైర్ కార్ కోచ్‌లతో 530 మంది ప్రయాణికుల సామర్థ్యంతో నడవ నుందని తెలిపారు. ఏలూరు రైల్వే స్టేషన్‌లోని గూడ్స్ షెడ్ ఆధునికీకరణ పనులకు శంకుస్థాపన చేశారు. గుంటూరు డివిజన్‌లో రెండు గతి శక్తి టెర్మినల్స్, 21 స్టేషన్లలో ఉత్పత్తి స్టాల్స్, ట్రాలీలు, నాలుగు డబ్లింగ్ ప్రాజెక్టులు, ఒక కోచ్ రెస్టారెంట్‌ను మోడీ ప్రారంభించారు. రైల్వే స్టేషన్‌లో రైల్ కోచ్ రెస్టారెంట్, వివిధ ఉత్పత్తుల స్టాల్స్‌ను గుంటూరు జడ్‌పి చైర్‌పర్సన్ క్రిస్టినా, రైల్వే డివిజన్ మేనేజరు ఎం.రామకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాచేపల్లి మండలం పెదగార్లపాడు వద్ద చెట్టినాడు సిమెంట్స్ కోచ్, దాచేపల్లి మండలం తుమ్మలచెరువు, సాయి బాలాజీ వేర్ హౌసింగ్ లాజిస్టిక్స్, పలు స్టేషన్లలో వివిధ రకాల సంప్రదాయ ఉత్పత్తుల తయారీ యూనిట్ల రూపకల్పన, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్టు తెలిపారు. గుంటూరు వద్ద ఒక రైలు కోచ్ రెస్టారెంటు, గుంటూరు- గుంతకల్ సెక్షన్ మధ్య 4 డబ్లింగ్ ప్రాజెక్టులు కూడా వీటిల్లో ఉన్నాయన్నారు. రూ.64.51 లక్షలతో 10 స్టేషన్లలో 13 స్టాల్స్ ఎనిమిది స్టేషన్లలో ఎనిమిది ట్రాలీలు ఏర్పాటు చేశామన్నారు. 16 కిలో మీటర్ల దూరంలో సాతులూరు -మునుమాక మధ్య డబ్లింగ్, శావల్యాపురం-చీకటేగలపాలెం మధ్య డబ్లింగ్ 17 కిలో మీటర్ల మేరకు పనులు పూర్తయ్యాయని తెలిపారు.

కేరళకు వన్‌టైమ్ ప్యాకేజి

(మొదటిపేజీ తరువాయి)
కపిల్ సిబల్ ఇది కేరళకు దక్కాల్సిన మొత్తమేనని అన్నారు. అయితే ఇది శుభపరిణామమని ధర్మాసనం పేర్కొంది. ప్రత్యేక పరిస్థితుల్లో సడలింపు ఇవ్వడంలో తప్పేంటని కేంద్రాన్ని కోర్టు ప్రశ్నించింది. కేరళ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వన్‌టైమ్ ఎయిడ్ ప్యాకేజీ ఇవ్వాలని కూడా సుప్రీంకోర్టు సూచించింది. అయితే వారు కాస్త ఓపెన్ మైండెడ్‌గా ఉండాలని సుప్రీంకోర్టు పేర్కొంది. 'మేము నిపుణులు కాదు. మేము మీకు మార్గాన్ని చెప్పలేము కానీ బహుశా మీ నిపుణులు చేయగలరు... మీ నిపుణులను అవకాశాన్ని అన్వేషించనివ్వండి. మీ నిబంధనలను సడలించడంలో మీరు కొంచెం ఉదారంగా వ్యవహరించాలి. వచ్చే ఆర్థిక సంవత్సరంలో షరతులకు లోబడి మార్చి 31 లోపు వన్‌టైమ్ ప్యాకేజీని ఇవ్వగలరో లేదో చూడండి' ధర్మాసనం పేర్కొంది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కేరళ విషయంలో ఏం చేయాలనే దానిపై చర్చిస్తామని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఈ కేసు బుధవారం మరోసారి విచారణకు రానుంది.

కార్పొరేట్ల గుప్పిట్లోకి అడవులు

(మొదటిపేజీ తరువాయి)
ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ హక్కుల కోసం ఎన్నో పోరాటాలు చేసిన చరిత్ర ఈ ప్రాంతానికి ఉందని గుర్తు చేశారు. పోలవరంలో ఏర్పాటు చేసిన సభలో 2019 ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ తమ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిర్వాసితులకు రూ.10 లక్షలు ఇస్తామని, భూమి కోల్పోయిన వారికి భూమి ఇస్తామని హామీ ఇచ్చారని, నేటికీ అవి నెరవేరలేదని తెలిపారు. ప్రజలను మోసగించిన బిజెపి, టిడిపి, వైసిపిలకు ఓట్లు అడిగే హక్కు లేదన్నారు. ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు మాట్లాడుతూ ఐదేళ్లలో పార్టీ చేసిన పోరాటాలను వివరించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు, మంతెన సీతారాం, రాష్ట్ర కమిటీ సభ్యులు టి.అరుణ్, సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మట్ల వాణిశ్రీ, పల్లపు వెంకట్, ప్రజా సంఘాల నాయకులు సిరిమల్లె రెడ్డి, శాంతిరాజు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చేతల్లో చూపాం


(మొదటిపేజీ తరువాయి)
వివిధ ప్రాంతాల్లో రూ.239 కోట్లతో చేపట్టిన సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. నగరంలో అర్హులైన 31,866 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలపై సంపూర్ణ హక్కులు కల్పిస్తూ పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కనకదుర్గ వారథి వద్ద జరిగిన కార్యక్రమంలో జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ 2.26 కిలోమీటర్ల మేర రిటైనింగ్ వాల్ నిర్మాణంతో ప్రకాశం బ్యారేజీకి దిగువన కృష్ణా నదిని ఆనుకొని ఉన్న కృష్ణలంక రణదీర్‌నగర్, కోటినగర్, తారకరామ నగర్, భూపేష్ గుప్తా నగర్, పోలీస్ కాలనీ, రామలింగేశ్వర నగర్ ప్రాంతాల్లోని సుమారు 80 వేల మంది నివాసితులకు కృష్ణా వరద ముంపు బారి నుంచి విముక్తి లభిస్తుందన్నారు. కృష్ణా నదికి 12 లక్షల క్యూసెక్కుల వరద నీరు వచ్చినా ప్రజలు భయపడాల్సిన అవసరం ఉండదని తెలిపారు. రివర్ వ్యూ పార్క్‌కు కృష్ణమ్మ జలవిహార్‌గా నామకరణం చేస్తున్నట్లు ప్రకటించారు. మోడ్రన్ ఎంట్రీ ప్లాజా, వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, చిన్నారులకు ఆట స్థలం, గ్రీనరీతో సుందరంగా, ఆహ్లాదకర వాతావరణంతో ఏర్పాటు చేసిన ఈ పార్క్ నగర వాసులకు కొత్త అనుభూతిని కలిగిస్తుందన్నారు. నగరంలో సుమారు రూ.400 కోట్లతో అంబేద్కర్ విగ్రహం, స్మృతివనం ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయానికి త్వరగా వెళ్లేందుకు ఫ్లైఓవర్లు నిర్మించామన్నారు. విమానాశ్రయానికి వెళ్లేందుకు గతంలో ఒక ఫ్లైఓవర్ కూడా ఉండేది కాదని, గత ఐదేళ్లలో రెండు ఫ్లైఓవర్లు నిర్మించామని, కనక దుర్గమ్మ ఫ్లైఓవర్‌ను కూడా అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. మరో రెండు నెలల్లో అవుటర్ రింగ్ రోడ్ కూడా ప్రారంభం కాబోతోందన్నారు. మంత్రి అంబటి రాంబాబు, ఎంపిలు కేశినేని నాని, మార్గాని భరత్, మున్సిపల్ శాఖ స్పెషల్ సిఎస్ వై.శ్రీలక్ష్మి, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు, పలువురు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

మత్స్యకారులకు అండగా ఉంటాం

- సిఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి-అమరావతిబ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారులకు అండగా ఉంటుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. కాకినాడలో ఓఎన్జీసి పైపు లైను కారణంగా ఉపాధి కోల్పోయిన 23,459 మత్స్యకార కుటుంబాలకు అయిదవ విడత నగదు సహాయాన్ని క్యాంపు కార్యాలయంలో బటన్ నొక్కడం ద్వారా మంగళవారం నుండి వారి ఖాతాల్లో ఆయన జమ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు ఐదు విడతల్లో బాధిత కుటుంబాలకు రూ. 647.44 కోట్లను అందించినట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ చొరవతో ఒఎన్‌జిసి కూడా మత్సకారులను ఆదుకునేందుకు ముందుకు వచ్చిందన్నారు. గత ప్రభుత్వం ఇవ్వాల్సిన రూ. 78 కోట్ల జిఎస్‌పిసిని కూడా 16,554 మత్స్యకార కుటుంబాలకు చెల్లించినట్లు ఆయన తెలిపారు. ఏప్రిల్ 15 నుంచి జూన్ 15 మధ్యలో వేట నిషేధ సమయంలో వారికి సహాయం అందించినట్లు తెలిపారు. ' గతంలో రూ. 4వేలుగా ఉన్న ఈ భరోసాను రూ. 10 వేలకు పెంచి ఒక్కో కుటుంబానికి అందిస్తున్నాం. లీటర్ డీజిల్‌పై రూ. 9 సబ్సిడి ఇస్తున్నాం. ప్రతి మత్స్యకారునికి ఒక గుర్తింపు కార్డు ఇచ్చి, వారికి సబ్సిడి అందజేస్తున్నాం. దాదాపు 20వేల బోట్లకు రూ. 130 కోట్లకు పైగా డీజిల్ సబ్సిడి ఇచ్చాం. వేటకు వెళ్లే మత్స్యకారులు పొరపాటున మరణిస్తే నష్టపరిహారం కింద రూ. 10 లక్షలు అందజేస్తున్నాం'. అని వివరించారు. ఇవేకాక ప్రతి మత్స్యకారుడు తమ కాళ్లమీద నిలబడాలనే ఉద్దేశంతో ప్రతి యాభై కిలోమీటర్లకు ఒక పోర్టుగానీ, ఫిషింగ్ హార్బర్ గానీ లేదా ల్యాండింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత 10 ఫిషింగ్ హార్బర్లు, ఆరు ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు, నాలుగు పోర్టులను వాయువేగంతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. దాదాపు రూ. 20 వేల కోట్లతో వీటి అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు తెలిపారు. ఈ పనులన్నీ శరవేగంగా జరుగుతున్నట్లు తెలిపారు.



మత్స్యకారుల అభివృద్ధికి సంబంధించిన నిధులు విడుదల చేస్తూ నమూనా చెక్కును ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి జగన్, మంత్రులు, ఉన్నతాధికారులు

మైనార్టీలను వేధించడానికే సిఎఎ

- ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

ప్రజాశక్తి-వేటపాలెం (బాపట్ల జిల్లా)

మైనార్టీలను వేధించడానికే సిఎఎ చట్టం తీసుకువచ్చారని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి విమర్శించారు. ఐద్వా ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర వ్యాప్తంగా సంఘం బలోపేతానికి సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. బాపట్ల జిల్లా వేటపాలెం మండలం, దేశాయిపేట పంచాయతీ సిలోన్ కాలనీలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో రమాదేవి మాట్లాడుతూ... పేదలు, మహిళల పట్ల కేంద్ర ప్రభుత్వం వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందన్నారు. పౌరసత్వ సవరణ చట్టం వల్ల మైనార్టీలు తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. దేశంలో ఉపాధి సమస్య ప్రధానంగా ఉందని, ఫలితంగా మహిళలు నామమాత్రపు వేతనాలకు పని చేయాల్సి వస్తోందని చెప్పారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకులు సుభాషిణి పాల్గొన్నారు.

ఘనంగా వైసిపి ఆవిర్భావ ఉత్సవాలు

- మళ్లీ ప్రమాణస్వీకార కౌంట్‌డౌన్ బోర్డు ఏర్పాటు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైసిపి 14వ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, మండలి చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రధానకార్యదర్శి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, ఎంపి నందిగం సురేష్ తదితరులు కేక్ కట్ చేశారు. అనంతరం మాట్లాడుతూ . ప్రజల అవసరాలే తన ఎజెండా అని చెప్పిన ఏకైక నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అని చెప్పారు. కార్యాలయం వద్ద జగన్ అనే నేను పేరుతో ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సిఎంగా ప్రమాణస్వీకారం చేసే రోజును తెలియచేస్తూ కౌంట్ డౌన్ డిజిటల్ బోర్డు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తనకు రక్షణగా నిలిచిన ప్రజల కోసం ప్రారంభమైన పార్టీగా వైసిపిని ముఖ్యమంత్రి జగన్ అభివర్ణించారు. ఈ మేరకు ట్వీట్ చేశారు.

భీమవరం నుంచి పోటీ !

- జనసేన అధినేత పవన్ కల్యాణ్
- జనసేనలో చేరిన భీమవరం మాజీ ఎమ్మెల్యే అంజిబాబు

ప్రజాశక్తి - భీమవరం

భీమవరం నుంచి పోటీపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఎట్టకేలకు స్పష్టత ఇచ్చారు. భీమవరాన్ని వదులుకోను.. నాదేనని ఆయన చేసిన వ్యాఖ్యలు పోటీకి బలాన్ని చేకూర్చాయి. భీమవరం మాజీ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, ఆయన కుమారుడు ప్రశాంత్ మంగళవారం భీమవరం నుంచి భారీ ర్యాలీగా మంగళగిరికి చేరుకున్నారు. వారికి కండువా కప్పి పార్టీలోకి పవన్ కల్యాణ్ ఆహ్వానించారు. ఈ సందర్భంగా భీమవరం నియోజకవర్గ ముఖ్య నేతలతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పవన్ కల్యాణ్ మాట్లాడారు. రామాంజనేయులు చేరిక పార్టీకి కీలకమన్నారు. గత ఎన్నికల్లో తాను గెలిచి ఉంటే పరిస్థితి వేరేలా ఉండేదని చెప్పారు. 2019 ఎన్నికల్లో ఓడినా జనం గుండెల్లో స్థానం మరింత బలాన్ని ఇచ్చిందన్నారు. కుబేరులు ఉండే భీమవరం ఒక రౌడీ చేతిలో బందీ అయిందని విమర్శించారు. 'భీమవరాన్ని వదలను అది నాదే' అని వ్యాఖ్యానించారు. మూడు పార్టీల పొత్తుతో 2024లో విజయాన్ని మరోసారి అందుకుంటామని భీమవరం మాజీ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. జనసేన కండువా కప్పుకున్న అనంతరం ఆయన పై వ్యాఖ్యలు చేశారు.

ప్రభుత్వాలను కూల్చే కసాయి బిజెపి

- సిపిఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ
- రాష్ట్రంలో 5 పార్లమెంటు, 15 అసెంబ్లీ స్థానాల్లో పోటీ
- కాంగ్రెస్ పార్టీ విశాఖ ఉక్కు సభకు సిపిఐ మద్దతు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలను కూల్చే కసాయి బిజెపి అని సిపిఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ అన్నారు. విజయవాడ సిపిఐ రాష్ట్ర కార్యాలయం దాసరిభవన్లో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో సిపిఐ 5 లోక్‌సభ, 15 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. ఒక్కో రాష్ట్రానికి బలాబలాలు వేర్వేరుగా ఉంటాయని, సామర్ధ్యాన్ని బట్టి పోటీ చేస్తామన్నారు. మరో వారం రోజుల్లో ఎన్ని సీట్లలో పోటీ చేస్తాం, ఎవరు పోటీ చేస్తారు అనే స్పష్టత వస్తుందని వివరించారు. విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, అనంతపురం, కర్నూలు లోక్‌సభలో పోటీచేసే ఆలోచన ఉందని విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత దానికి వ్యతిరేకంగా ఉన్న ప్రభుత్వాలను, పార్టీలను అడ్డగోలుగా పడేస్తుందని విమర్శించారు. గోవా, మణిపూర్‌లో ప్రభుత్వాలను పడేసిందని, కర్ణాటకలో ప్రయత్నించిందన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ ఇంకా లొంగని కారణంగా కేజ్రీవాల్‌పై కేసులు పెట్టిందని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలను ఎస్‌బిఐ తోసిపుచ్చటం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయటమే అన్నారు. బిజెపి చేసిన పనులు చెప్పుకుని ప్రజలను ఓట్లు అడగలేకపోతున్నదన్నారు. ఉత్తర భారతదేశంలో సీట్లు తగ్గుతాయని తెలిసి దక్షిణ భారతదేశంలో బిజెపి ప్రచారాన్ని ముమ్మరం చేసిందన్నారు. తమిళనాడు, కేరళలో మోడీ ఎక్కువ సార్లు పర్యటిస్తున్నారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో టిడిపి ఒంటరిగా పోటీ చేస్తే గెలిచే అవకాశాలు ఉన్నాయన్నారు. టిడిపిని నాశనం చేయడానికే బిజెపి పొత్తు పెట్టుకుందన్నారు. పొత్తు పెట్టుకుంటారా? జైలుకు వెళతారా? అని చంద్రబాబును భయపెట్టిందన్నారు. తెలుగు ప్రజలకు ద్రోహం చేసిన బిజెపిని, తెలుగువారి ఆత్మగౌరవాన్ని తాకట్టుపెట్టిన టిడిపి, వైసిపిని కాకుండా ప్రత్యామ్నాయంగా ఉన్న ఇండియా ఫోరంను ప్రజలు ఆదరించాలని కోరారు. వామపక్షాలు, కాంగ్రెస్ వేదికతో ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. సిఎం జగన్ పర్యటన సందర్భంగా ఆయన రక్షణను సాకుగా చూపి చెట్లు నరికేయడమేమిటని ప్రశ్నించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 15న కాంగ్రెస్ పార్టీ విశాఖలో నిర్వహించనున్న బహిరంగ సభకు సిపిఐ మద్దతిస్తున్నట్లు రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ తెలిపారు.

మూతపడిన గ్రానైట్ పరిశ్రమల్లో విజిలెన్స్ దాడులు

ప్రజాశక్తి - మార్టూరు రూరల్ (బాపట్ల జిల్లా)

మూతవేసిన గ్రానైట్ పరిశ్రమల్లో మైనింగ్ విజిలెన్స్ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. కృష్ణా జిల్లా మైనింగ్ అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్.ప్రతాప్‌రెడ్డి, నెల్లూరు జిల్లా విజిలెన్స్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం బాలాజీనాయక్‌తో పాటు 14 మంది సిబ్బంది రెండు బృందాలుగా ఏర్పడి పోలీస్ బందోబస్తు నడుమ తనిఖీలు చేపట్టారు. బాపట్ల జిల్లా మార్టూరు సమీపంలోని జొన్నతాళి వద్ద పలు గ్రానైట్ పరిశ్రమల్లో సోదాలు నిర్వహించారు. ముందుగా కామేపల్లి గ్రానైట్ పరిశ్రమ యజమాని అనుమతితో ఫ్యాక్టరీలో తనిఖీలు నిర్వహించారు.

ఈ ఏడాది జనవరిలో మైనింగ్ అధికారులు ప్రయివేట్ వ్యక్తులతో తనిఖీలు నిర్వహించిన తీరు తీవ్ర వివాదాస్పదమైన విషయం తెలిసిందే. మార్టూరులోని బల్లికురవ, వేమవరం, మార్టూరు పరిసర ప్రాంతాల గ్రానైట్ పరిశ్రమలలో అవకతవకలు జరుగుతున్నాయనే సమాచారంతోనే ఈ తనిఖీలు చేపట్టినట్లు ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు మైన్స్ అండ్ జియాలజీ రాష్ట్ర డైరెక్టర్ విజి వెంకటరెడ్డి నుంచి ఆదేశాలొచ్చాయని తెలిపారు. పరిశ్రమలు మూసివేసినా.. సంబంధిత యజమానుల అంగీకారంతోనే తనిఖీలు చేస్తున్నామన్నారు. మార్టూరు గ్రానైట్ వెల్ఫేర్ అసోసియేషన్ పిలుపు మేరకు ఈ నెల 10 నుంచి దాదాపు 250 గ్రానైట్ పరిశ్రమలను యజమానులు మూసివేశారు. దీంతో జీవనోపాధి లేక కార్మికులు తమ సొంత రాష్ట్రాలకు వెళు తున్నారు.

గీతాంజలి మృతి పట్ల సిఎం విచారం

- కుటుంబానికి రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గుంటూరు జిల్లా తెనాలిలో గీతాంజలి ఆత్మహత్య పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు. గీతాంజలి కుటుంబాన్ని ఆదుకునేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను మంగళవారం ఆదేశించారు. ఈ మేరకు రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియాను గీతాంజలి కుటుంబ సభ్యులకు అందజేయాలని సిఎం ఆదేశించారు. రాష్ట్రంలో ఆడబిడ్డల ఆత్మగౌరవానికి, మర్యాదలకు భంగం కలిగించే వారిపట్ల చట్టం కఠినంగా వ్యవహరిస్తుందని సిఎం పేర్కొన్నారు.

ఉగ్రవాద సంస్థలా ఐటిడిపి : వరుదు కళ్యాణి

ఒక మహిళ ప్రభుత్వం నుంచి తనకు అందిన సంక్షేమాన్ని మీడియాలో చెబితే ఓర్చుకోలేక ఐటిడిపి ఒక ఉగ్రవాద సంస్థలా మారి ఆత్మహత్య చేసుకునేదాకా వేటాడిందని వైసిపి మహిళా విభాగం అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి విమర్శించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. తెనాలిలో గీతాంజలి ఆత్మహత్యకు టిడిపి, జనసేన సోషల్ మీడియానే కారణమని అన్నారు. కోట్లు ఖర్చు చేసి సోషల్ మీడియా ద్వారా టిడిపి చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలే తిప్పికొడతారని ఎమ్మెల్సీ పోతుల సునీత అన్నారు.

రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - మాచర్ల (పల్నాడు జిల్లా)

అప్పులబాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన పల్నాడు జిల్లాలో చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వెల్దుర్తి మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన కుర్ర చిన వెంకయ్య (60) తన రెండు ఎకరాల సొంత పొలంతో పాటు మరో రెండున్నర ఎకరాలు కౌలుకు తీసుకుని పత్తి, మిర్చి పంటలు సాగు చేస్తున్నారు. ఇందు కోసం దాదాపు రూ.14.5 లక్షలు అప్పులు చేశారు. గత మూడేళ్లుగా వరుస నష్టాలు రావడంతో అప్పులకు వడ్డీ భారం అధికమైంది. రుణదాతల ఒత్తిడి తాళలేక, అప్పులు తీరే దారిలేకపోవడంతో తన పొలంలోనే పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. ఆయనకు భార్య, నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలిపై అఘాయిత్యం

ప్రజాశక్తి - పెదనందిపాడు (గుంటూరు జిల్లా)

గుంటూరు జిల్లా పెదనందిపాడు మండల కేంద్రంలో దారుణం చోటుచేసుకుంది. 80 ఏళ్ల వృద్ధురాలిపై గుర్తు తెలియని దుండగులు సోమవారం అర్ధరాత్రి దాడి, అత్యాచారానికి పాల్పడ్డారు. ఘటనాస్థలిని ఎస్ఐ టి.రాజకుమార్ పరిశీలించి కేసు నమోదు చేశారు. వైద్య పరీక్షల నిమిత్తం బాధితురాలిని బాపట్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. దుండగులను కఠినంగా శిక్షించాలని స్థానికులు డిమాండ్ చేశారు. గతంలో ఇలాంటి ఘటనలూ అనేకం జరిగాయని, ఆ కేసుల్లో నిందితులే ఈ దురాగతానికి పాల్పడి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు.

బేవరేజెస్ డిపో హమాలీల కూలి రేటు పెంచాలి

- హమాలీ యూనియన్ అధ్యక్షులు ఎన్‌వి సుబ్బారెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పెరిగిన నిత్యవసర సరకుల ధరలకు అనుగుణంగా మద్యం డిపోల్లో పనిచేస్తున్న హమాలీలకు ఎగుమతి కూలి రేటును పెంచి ఇవ్వాలని ఎపిబిసిఎల్, ఐఎంఎఫ్‌ఎల్ డిపోస్ హమాలీ యూనియన్ అధ్యక్షులు ఎన్‌వి సుబ్బారెడ్డి కోరారు. మంగళవారం విజయవాడలోని బేవరేజెస్ కార్పొరేషన్ ఎమ్‌డి డి దేవానందరెడ్డితో హమాలీ యూనియన్ అధ్యక్షులు ఎన్‌వి సుబ్బారెడ్డి, గౌరవాధ్యక్షులు కె ఉమామహేశ్వరరావుతో కలిసి సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. హమాలీల ఇన్సూరెన్స్ పథకం, యూనిఫామ్, షూస్, తదితర సమస్యలను బోర్డు మీటింగ్‌లో చర్చించి, పరిష్కరించేందుకు కృషి చేస్తానని దేవానందరెడ్డి హామీ ఇచ్చినట్లు తెలిపారు. అలాగే పాత కూలి రేట్ల ఒప్పందం అక్టోబరు 2023తో ముగియటంతో, కొత్త కూలి రేట్ల కోసం ఈ నెల 18లోపు కాంట్రాక్టర్లతో జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినట్లు ఆయన వెల్లడించారు.

సి2ప్లస్50 ప్రకారం మద్దతు ధర కోరుతూ

రేపు మండల కేంద్రాల్లో నిరసనలు

- రైతు సంఘాల సమన్వయ సమితి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సి2ప్లస్50 శాతం కలిపి మద్దతు ధరల చట్టం తేవాలని, దేశవ్యాప్తంగా రైతుల పంట రుణాలు రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 14న అన్ని మండల కేంద్రాల్లో నిరసనలు, ప్రదర్శనలు నిర్వహించాలని రైతు సంఘాల సమన్వయ సమితి కోరింది. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో రైతు సంఘం సీనియర్ నాయకులు వై కేశవరావు మాట్లాడుతూ.. రైతాంగానికి కేంద్రం రాతపూర్వకంగా ఇచ్చిన హామీని అమలు చేయడం లేదని అన్నారు. వ్యవసాయ రంగం మొత్తాన్ని అదానీ, అంబానీలకు కట్టబెడుతోందని పేర్కొన్నారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ప్రకారం అన్ని పంటలకూ సి2ప్లస్ 50 ఇస్తూ చట్టం చేయాలని కోరారు. ఎఐటియుసి నాయకులు ఓబులేసు మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లు పోరాడి సాధించుకున్న కార్మిక సంక్షేమ చట్టాలను రద్దుచేసి, నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి కార్మిక హక్కులను కేంద్రం హరిస్తోందని, లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని కోరారు. కనీస వేతనం నెలకు రూ.26 వేలు అమలు చేయాలన్నారు. విశాఖ ఉక్కును ప్రైవేటీకరించడాన్ని నిలుపుదల చేయాలని, కడపలో ఉక్కు పరిశ్రమను ప్రభుత్వమే నిర్మించాలని డిమాండు చేశారు. కార్మిక వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్న బిజెపితో టిడిపి, జనసేన పొత్తు పెట్టుకోవడం సిగ్గుచేటని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి ఈశ్వరయ్య మాట్లాడుతూ.. రైతుల రుణమాఫీ చేస్తూ కేరళ తరహాలో ఉపశమన చట్టం చేయాలని కోరారు. ఎరువులపై సబ్సిడీ కోత విధించడం ఆహార భద్రత చట్టం అమలుకు నిధులు తగ్గించి కార్పొరేట్ కంపెనీలకు రాయితీలు ఇవ్వడం దుర్మార్గమని అన్నారు. పోలవరం ప్రాజెక్టు నిధులు, నిర్వాసితులకు పూర్తిగా నష్టపరిహారం చెల్లించాలన్నారు. అటవీ హక్కుల చట్టాన్ని ఉపసంహరించాలని కోరారు.

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అధ్యక్షులు వి కృష్ణయ్య మాట్లాడుతూ.. విద్యుత్ చట్టసవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని, స్మార్ట్‌మీటర్ల బిగింపు నిలుపుదల చేయాలని కోరారు. మద్దతు ధర వల్ల భారం పడుతుందని కట్టుకథలు చెప్పడం మానుకోవాలని అన్నారు. అది నిజం కాదని ఆర్థికవేత్తలు చెబుతున్నారని పేర్కొన్నారు. జాగృతి రైతు సంఘం ప్రధాన కార్యదర్శి మరీదు ప్రసాద్‌బాబు మాట్లాడుతూ.. ఆహార భద్రత చట్టాన్ని పటిష్టపరచాలని, 60 ఏళ్లు నిండిన పేద రైతులు, వ్యవసాయ కార్మికులకు నెలకు రూ.ఆరు వేలు పెన్షన్ ఇవ్వాలని కోరారు. 540 రైతు సంఘాలతో కూడిన సంయుక్త కిసాన్ మోర్చా ఈ నెల 14న ఢిల్లీలో రామ్‌లీలా మైదానంలో నిర్వహిస్తున్న భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. విలేకరుల సమావేశంలో పి జమలయ్య తదితరులు పాల్గొన్నారు.

శాకాహారం సెగలు

- ప్లేట్ భోజనం 7% భారం
- పప్పులు, టమాట ధరల ఎఫెక్ట్
- క్రిసిల్ రిపోర్ట్



న్యూఢిల్లీ : శాఖహారం వ్యయం పెరిగిపోయింది. ప్రస్తుత ఏడాది ఫిబ్రవరిలో కుటుంబాల శాఖహారం ప్లేట్ వ్యయం 7 శాతం పెరిగిందని క్రిసిల్ ఓ రిపోర్ట్‌లో తెలిపింది. మరోవైపు చికెన్ ధరలు తగ్గడంతో చికెన్ ప్లేట్ వ్యయంలో 9 శాతం తగ్గుదల చోటు చేసుకుందని వెల్లడించింది. ముఖ్యంగా గడిచిన నెలలో పప్పులు, టమాటా, ఉల్లి ధరలు భారీగా పెరగడంతో శాఖహారం భోజనం ప్రియమయ్యిందని రేటింగ్ ఏజెన్సీ క్రిసిల్ విశ్లేషించింది. ఉత్తర, దక్షిణ, తూర్పు, పశ్చిమ ప్రాంతాల్లోని అహారోత్పత్తుల ధరలను విశ్లేషించి భోజనం ప్లేట్ వ్యయాన్ని లెక్కగడుతుంది. ఇది సగటు ప్రజల ఖర్చుల్లో మార్పులను సూచిస్తుంది. ఇందులో ప్రధానంగా తృణ ధాన్యాలు, పప్పులు, కూరగాయలు, మసాలలు, వంట నూనె, గ్యాస్ ధరలను పరిగణలోకి తీసుకుంటుంది. మాంసహారంలో పప్పులకు బదులు బాయిలర్ చికెన్ ధరలను తీసుకుంటుంది.

ఏడాదికేడాదితో పోల్చితే గడిచిన నెలలో ఉల్లి, టమాట ధరల్లో వరుసగా 29 శాతం, 38 శాతం పెరుగుదల చోటు చేసుకుంది. శాఖహార ప్లేట్ భోజనంలో 12 శాతం వాటా వీటిదే. ఏడాదికేడాదితో పోల్చితే పప్పుల ధరలు 14 శాతం ఎగిశాయి. శాఖహార భోజనంలో పప్పుల వాటా ఇది వరకు 9 శాతంగా ఉంటే.. ఇప్పుడు 20 శాతానికి చేరింది. పప్పులు, ఉల్లి, టమాటా ధరల పెరుగుదల అనేక కుటుంబాల ఆదాయాలను దెబ్బతీస్తున్నాయి. హెచ్చు ధరలు ప్రజల జేబులకు చిల్లులు పెట్టడంతో పొదుపు శక్తి తగ్గుతోంది.

5.09 శాతంగా రిటైల్ ద్రవ్యోల్బణం..

ప్రస్తుత ఏడాది ఫిబ్రవరిలో రిటైల్ ద్రవ్యోల్బణం సూచీ (సిపిఐ) 5.09 శాతంగా చోటు చేసుకుందని మంగళవారం కేంద్ర గణాంకాల శాఖ వెల్లడించింది. ఇంతక్రితం నెలలో ఇది 5.09 శాతంగా ఉంది. ఫిబ్రవరిలోనూ ఆహార ద్రవ్యోల్బణం 8.30 శాతం నుంచి 8.66 శాతానికి పెరిగింది. గ్రామీణ ద్రవ్యోల్బణం యధాతథంగా 5.34 శాతంగా చోటు చేసుకుంది. పట్టణ ద్రవ్యోల్బణం 4.92 నుంచి 4.78 శాతానికి తగ్గింది. కూరగాయల ధరలు 27.03 శాతం నుంచి 30.25 శాతానికి ఎగిశాయి.



కడప కలెక్టరేట్ వద్ద ధర్నాలో మాట్లాడుతున్న రాజేంద్రప్రసాద్

16 డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలి

- కడప కలెక్టరేట్ ఎదుట సర్పంచుల ధర్నా
- నిధులను దారిమళ్లించే అధికారం ఎవరిచ్చారు : రాజేంద్రప్రసాద్

ప్రజాశక్తి - కడప అర్బన్

న్యాయబద్ధమైన 16 డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ కడప కలెక్టరేట్ ఎదుట ఉమ్మడి జిల్లాల సర్పంచులు మంగళవారం ధర్నా నిర్వహించారు. గ్రామ పంచాయతీలకు చట్టబద్ధంగా, న్యాయబద్ధంగా, రాజ్యాంగబద్ధంగా రావాల్సిన నిధులను దారి మళ్లించి, గ్రామాల అభివృద్ధిని ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎపి పంచాయతీరాజ్ ఛాంబర్, సర్పంచుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీలకు నిధులు ఇవ్వకపోగా, స్థానిక ఆదాయ వనరుల ద్వారా వచ్చే సొంత నిధులను, 14, 15వ ఆర్థిక సంఘం నిధులను దారిమళ్లించే హక్కు రాష్ట్ర ప్రభుత్వానికి ఎవరిచ్చారని ప్రశ్నించారు. వలంటీర్లకు తాము వ్యతిరేకం కాదని, సర్పంచుల ఆధ్వర్యంలో వారు విధులు నిర్వహించాలన్నారు. జగన్‌ను ఇంటికి పంపితేనే గ్రామాల అభివృద్ధి సాధ్యపడుతుందని తెలిపారు. సర్పంచులను ఉత్సవ విగ్రహాల్లా మార్చిన సిఎం జగన్‌మోహన్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో ఓటమి అంటే ఏమిటో చూపిస్తామని హెచ్చరించారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మునిరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తున్నా వైసిపి ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదన్నారు. గ్రామ వలంటీర్లను, గ్రామ సచివాలయాలను పంచాయతీల్లో విలీనం చేసి, సర్పంచుల ఆధ్వర్యంలో అన్ని రకాల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ సింగంశెట్టి సుబ్బరామయ్య, ఉమ్మడి జిల్లా పంచాయతీ సర్పంచులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో 1.03 మిలియన్ కిలోల పొగాకు అమ్మకాలు

- టుబాకో బోర్డు చైర్మన్

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్రంలో ఈ ఏడాది 1.03 మిలియన్ కిలోల పొగాకు అమ్మకాలు జరిగాయని టుబాకో బోర్డు చైర్మన్ సిహెచ్ యశ్వంత్‌కుమార్ తెలిపారు. గుంటూరులోని టుబాకో బోర్డులో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎపిలో ఈ ఏడాది 142 మిలియన్ కిలోలు అనుమతి ఇవ్వగా, సుమారు 201 మిలియన్ కిలోలు పొగాకు సాగు అయినట్లు అంచనా వేశామని తెలిపారు. అందువల్ల ఈసారి కర్ణాటకలో వేలం ముగియక ముందే ఎపిలోనూ ఫిబ్రవరి 29న ప్రారంభించడంతో ఇప్పటి వరకూ 1.03 మిలియన్ కిలోలు అమ్మకాలు జరిగినట్లు చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలోని 16 వేలం కేంద్రాల్లోనూ కొనుగోలు జరుపుతున్నట్లు చెప్పారు. మిచౌంగ్ తుపాను ప్రభావంతో నష్టపోయిన పొగాకు రైతులు విషయమై కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పియూష్ గోయల్‌తో సమావేశమయ్యామని, ఈ ఏడాది కూడా అదనపు పంటపై విధించే పన్నును రద్దు చేసేందుకు కేంద్రం సానుకూలంగా ఉన్నట్లు మంత్రి తెలిపారన్నారు. పూర్తిగా కానీ, పాక్షికంగా కానీ పెనాల్టీ రద్దు చేసే అవకాశం ఉందన్నారు. బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇంతవరకూ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా పొగాకు బోర్డు ద్వారా విదేశీ మారకద్రవ్యం రూ. పది వేల కోట్లకు సమకూరిందన్నారు. గత సంవత్సరం రూ. తొమ్మిది వేల కోట్లుగా ఉందన్నారు. ప్రస్తుతం ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి రూ.11 వేల కోట్లకు చేరుతుందని అంచనా వేశామని తెలిపారు.

చిన్న సూచీల విలవిల



ముంబయి : చిన్న, మధ్యస్థాయి కంపెనీల షేర్ల ధరలు బుడగల్లా పెరుగుతున్నాయని.. అప్రమత్తంగా ఉండాలని సెబీ ఛైర్‌పర్సన్ మాధబి పురి బచ్ పేర్కొనడంతో స్మాల్, మిడ్‌క్యాప్ స్టాక్స్ తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. మంగళవారం బిఎస్ఇలో మిడ్ క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 1.31 శాతం, 2.11 శాతం చొప్పున నష్టపోయాయి. మార్చిలో ఇప్పటి వరకు స్మాల్ క్యాప్ సూచీ ఏకంగా 5 శాతం ప్రతికూలతను ఎదుర్కొంది. చిన్న, మధ్య స్థాయి కంపెనీ (ఎస్‌ఎమ్ఈ)ల విభాగంలో ధరల్లో అవకతవకలు సంకేతాలు కనిపిస్తున్నాయనీ బచ్ సోమవారం హెచ్చరించారు. నష్టభయం అధికంగా ఉండే ఈ విభాగంలో పెట్టుబడులు పెట్టే ముందు మదుపర్లు అత్యంత అప్రమత్తతతో వ్యవహరించాలని సూచించారు. దీంతో ఆ రంగం సూచీలపై ఒత్తిడి నెలకొంది. కాగా బిఎస్ఇ సెన్సెక్స్ 165 పాయింట్ల లాభంతో 73,668కి చేరింది. ఇంట్రాడేలో 73,342 – 74,4004 మధ్య కదలాడింది. నిఫ్టీ 3 పాయింట్ల లాభంతో 22,334 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 30లో హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, టిసిఎస్, మారుతీ సుజుకీ, ఇన్ఫోసిస్, రిలయన్స్ షేర్లు అధికంగా లాభపడగా.. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, జెఎస్‌డబ్ల్యు స్టీల్, ఐటిసి, టాటా మోటార్స్, నెస్లే ఇండియా షేర్లు అధికంగా నష్టపోయిన వాటిలో ముందు వరసలో ఉన్నాయి.

హిలియోస్ ఎంఎఫ్ నుంచి కొత్త ఫండ్

- బ్యాలెన్స్డ్ అడ్వాంటేజ్ ఫండ్ ఆవిష్కరణ



హైదరాబాద్ : హిలియోస్ మ్యూచువల్ ఫండ్ కొత్తగా హిలియోస్ బ్యాలెన్స్డ్ అడ్వాంటేజ్ ఫండ్ (బిఎఎఫ్)ను ఆవిష్కరించింది. ఈ కొత్త ఎన్ఎఫ్ఒ మార్చి 11న తెరువబడిందని.. 20న మూసివేయనున్నామని.. మార్చి 28 తర్వాత తిరిగి మళ్లీ అందుబాటులోకి వస్తుందని హిలియోస్ ఎంఎఫ్ సిఇఒ దిన్‌షా ఇరానీ అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఇది తమకు రెండో ఎన్ఎఫ్ఒ అని తెలిపారు. ఈ నిధులను ఈక్విటీ మార్కెట్లు సహా రుణ, డెరివేటివ్స్, మనీ మార్కెట్ ఇన్‌స్ట్రుమెంట్స్‌లో పెట్టుబడులుగా పెట్టనున్నామన్నారు. కొత్త బిఎఎఫ్‌లో కనీసం రూ.5వేల నుంచి పెట్టుబడిగా పెట్టొచ్చన్నారు. నెల వారిగా అయితే ప్రతీ నెల కనీసం రూ.1,000 చొప్పున.. ఆ పైన ఎన్ని రెట్ల పెట్టుబడి అయినా పెట్టొచ్చని తెలిపారు. కనీసం 12 మాసాల వాయిదాలను చెల్లించాల్సి ఉంటుంది. 2024 జనవరి నాటికి హైదరాబాద్‌లో తమ ఎయుఎం రూ.5,348 కోట్లుగా ఉందన్నారు. ఇటీవల బడ్జెట్ సమావేశాలు, ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సాధారణంగానే మార్కెట్లు, ఎంఎఫ్ విభాగం కొంత స్తబ్దుగానే ఉండొచ్చని దిన్షా పేర్కొన్నారు. త్వరలో బ్యాంకింగ్, ఫైనాన్సీయల్ ఫండ్‌ను ఆవిష్కరించే యోచనలో ఉన్నామన్నారు. ఈ సమావేశంలో హిలియోస్ డిప్యూటీ వైస్ ప్రెసిడెంట్ – సేల్స్ అండ్ డిస్ట్రిబ్యూషన్ జగదీష్ ప్రగాడ పాల్గొన్నారు.

వ్యాపారాలకు డిజిటలైజేషన్ కీలకం

- గోడాడి సర్వేలో మహిళా ఔత్సాహికవేత్తలు

న్యూఢిల్లీ : తమ వ్యాపార విజయానికి డిజిటలైజేషన్ కీలకమని 90 శాతం మహిళా ఔత్సాహికవేత్తలు పేర్కొన్నట్లు గోడాడి తెలిపింది. డిజిటలైజేషన్‌తోనే సరైన అవకాశాలు పొందగలరని తమ గోడాడి 2024 గ్లోబల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌లో వెల్లడయ్యిందని పేర్కొంది. 51 శాతం మహిళా వ్యవస్థాపకులు మిలీనియల్స్ డైనమిక్, ఫార్వర్డ్ థింకింగ్ స్వభావాన్ని కలిగి ఉన్నారని తెలిపింది. విస్తరిస్తున్న మార్కెట్‌ను చేరడానికి కొత్త మార్గాలను ఎంచుకోవాలని, భవిష్యత్తు వ్యాపారాల్లో ఎఐ కీలక పాత్ర పోశించనుందని మహిళ వ్యాపారవేత్తలు భావిస్తున్నారని పేర్కొన్నారు.

మిడ్‌క్యాప్ ఫండ్‌తో రూ.8,490 కోట్ల ఎయుఎం

- మోతీలాల్ ఓస్వాల్ వెల్లడి

ముంబయి : మోతీలాల్ ఓస్వాల్ మిడ్‌క్యాప్ ఫండ్ 10 ఏళ్లను పూర్తి చేసుకుందని తెలిపింది. తమ ఎఎంసి ఫండ్ దాదాపు రూ.8,490 కోట్ల ఎయుఎంను చేరిందని వెల్లడించింది. 2024 జనవరి 31 నాటికి 2,126 ప్రత్యేక పిన్ కోడ్‌లో 5.3 లక్షల మంది రిటైల్ పెట్టుబడిదారులు తమతో భాగస్వామ్యం అయ్యారని తెలిపింది. ఇందులో టాప్ రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ కూడా ఒక్కటని పేర్కొంది. స్థిరమైన వృద్ధిని సాధించామని మోతీలాల్ ఓస్వాల్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ అఖిల్ చతుర్వేది తెలిపారు. మిడ్‌క్యాప్ ఒక కేటగిరీగా 2004 నుండి మెరుగైన పనితీరును కనబరుస్తోందని ఫండ్ మేనేజర్ నికేత్ షా పేర్కొన్నారు.

సంపాదకీయం

మంటలు రాజేసేందుకే!

భిన్నత్వంలో ఏకత్వం కలిగిన లౌకిక భారతాన్ని విచ్ఛిన్నం చేసేందుకు వినాశకర పౌరసత్వ చట్ట సవరణ -2019ని ఎన్నికల ముంగిట మోడీ ప్రభుత్వం మళ్లీ ముందుకు తెచ్చింది. మతపరమైన ఉద్రిక్తతలు రెచ్చగొట్టడం దేశ సమగ్రత, సమైక్యతకు గొడ్డలిపెట్టు. ఎన్నికల్లో లబ్ధిపొందాలన్న యావతో వివాదాస్పద సిఎఎ అమలుకు అది తెగబడింది. ఈ చట్టానికి వ్యతిరేకంగా 2019-20లో దేశవ్యాప్తంగా ఆందోళనలు మిన్నంటాయి. ప్రభుత్వ రాక్షసత్వానికి దాదాపు వంద మంది బలయ్యారు. అప్పట్లో తాత్కాలికంగా వెనక్కితగ్గి... ఇన్నాళ్లూ కోల్డ్ స్టోరేజిలో పెట్టిన ఈ చట్టాన్ని ఎన్నికల ముంగిట అందునా రంజాన్ ఉపవాసాలు ప్రారంభమైన ముందురోజున నోటిఫై చేయడం దాని దుష్ట ఎజెండాలో భాగమే. విచ్ఛిన్నం చేసే మత విభజనను తెచ్చి రోజురోజుకూ పెరిగిపోతున్న ధరలు, నిరుద్యోగం, కుంగిపోతున్న ఆర్థిక వ్యవస్థ లాంటి అంశాలన్నీ పక్కనపెట్టి భావోద్వేగ అంశాలను, మతపరమైన అంశాలను రెచ్చగొట్టడం వల్లే ప్రయోజనం పొందాలనేది బిజెపి కుతంత్రం. 2019లో ఎన్నికల ముందు పుల్వామా, సర్జికల్ స్ట్రైక్స్, దేశభక్తి లాంటి అంశాలను ముందుకుతెచ్చినట్టే... ఇప్పుడూ సిఎఎ లాంటి అంశాలతో లబ్ధిపొందాలని ఆ పార్టీ చూస్తోంది.

పౌరసత్వ సవరణ చట్టాన్ని 2019 డిసెంబర్ 11న పార్లమెంట్‌లో ప్రతిపక్షాల బహిష్కరణ మధ్య అత్యంత అప్రజాస్వామిక రీతిలో ఆమోదింపజేసుకుంది. ఎన్‌డిఎ భాగస్వాములతోపాటు వైఎస్‌ఆర్ కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీల ఎంపిలు ఆనాడు దీనికి అనుకూలంగా ఓటు వేశారు.

ఈ చట్టం ప్రకారం 2014 డిసెంబరు 31కి ముందు పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్, బంగ్లాదేశ్‌ల నుండి మనదేశానికి వలస వచ్చిన హిందువులు, బౌద్ధులు, జైనులు, సిక్కులు, క్రైస్తవులు, పార్శీలకు భారత పౌరసత్వం ఇస్తారు. ఈ చట్టం అమలును జాతీయ పౌర పట్టిక ఏర్పాటుతో ముడిపెట్టడం ముస్లిం పౌరులను లక్ష్యంగా చేసుకునేందుకే. రాష్ట్రాల్లో పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకునే వారి గుర్తింపు, పేర్ల నమోదు క్రమం నుండి రాష్ట్ర ప్రభుత్వాల పాత్ర లేకుండా చేయడం చట్టాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన రాష్ట్ర ప్రభుత్వాలను మినహాయించింది. ఇది భారత ఫెడరల్ వ్యవస్థ స్ఫూర్తికే విరుద్ధం.

ఈ చట్టాన్ని మూడు దేశాలకే పరిమితం చేయడం, మతం ఆధారంగా తీసుకురావడం 1955లో తీసుకొచ్చిన సిఎఎ చట్టానికి, రాజ్యాంగ మౌలిక స్వరూపానికి వ్యతిరేకం. రాజ్యాంగంలోని 19వ అధికరణం మతపరమైన స్వేచ్ఛ ఇస్తున్నప్పుడు ముస్లిములకు తప్ప ఇతరులకే పౌరసత్వం ఇస్తామని చెప్పడం రాజ్యాంగ ఉల్లంఘన కాదా? శ్రీలంకలో దశాబ్దాలుగా మతపరమైన హింసను ఎదుర్కొంటున్న శ్రీలంక హిందువులను ఎందుకు మినహాయించారు? తమిళుల పట్ల వివక్షా? ఇప్పుడు ముస్లిములను మినహాయించిన వారు తరువాత క్రైస్తవులను, ఇతర మైనార్టీలను మినహాయించరా? వంటి ప్రశ్నలనేకం.

రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 ప్రకారం కులం, మతం, రంగు, జాతి, ప్రాంతం, భాష ఆధారంగా ఎవరిపట్ల వివక్ష ఉండకూడదు. కాని సిఎఎ మత ప్రాతిపదికన వివక్ష పాటిస్తుంది కనుక ఇది రాజ్యాంగ విరుద్ధం. రాజ్యాంగ మౌలిక సూత్రాలను (బేసిక్ స్ట్రక్చర్‌ను) మార్చే అధికారం పార్లమెంట్‌కు కూడా లేదని కేశవానంద భారతి కేసు తీర్పులో సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

ఇవేవీ పట్టని మన పాలకులు మతాన్ని అడ్డగోలుగా రాజకీయ ప్రయోజనాలకు వినియోగిస్తున్నారు. కర్ణాటక ఎన్నికల సమయంలో 'జై భజరంగి' అంటూ ఓట్లు వేయాలని ప్రధాని స్వయంగా పిలుపునిచ్చారు. 'పాకిస్తాన్‌కు వెళ్లండి.. లేదా కబరిస్థాన్‌కు వెళ్లండి...' అంటూ వీరంగం వేయడం, బుల్డోజర్లతో నివాసాలను కూల్చివేయడం.. కమలం పార్టీకి, ఆ పార్టీ నాయకత్వంలోని ప్రభుత్వాలకు నిత్యకృత్యమే. 400 సీట్లు ఇవ్వండి... రాజ్యాంగాన్నే మార్చేస్తాం.. సెక్యులర్ దేశంగా భారత్‌ను ఉంచం అని బిజెపి ఎంపి అనంత హెగ్డే అన్నారు. సిఎఎను అమలు చేయబోమని ఇప్పటికే కేరళ, తమిళనాడు ప్రభుత్వాలు ప్రకటించగా, మరికొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు కూడా అదే బాటలో నడుస్తున్నాయి. భిన్న మతాలు, ఆచారాలు, సంప్రదాయాలు, సంస్కృతులకు నియమైన మన దేశానికి ఈ చట్టం ఏమాత్రం శ్రేయస్కరం కాదు. మత మారణహోమాన్ని రగిలించే మతోన్మాద శక్తుల ఆట కట్టించేందుకు యావద్భారత జాతి ఐక్యంగా ముందుకు ఉరకాలి. సిఎఎను తిప్పికొట్టాలి.

మంచి మాట




మహిళలను అంధకారం లోను, తెర చాటున ఉంచేసి...మీరు మాత్రం ముందుకు నడవాలనుకోవడం వృధా ప్రయాసే. అదెప్పటికీ జరగదు.

- సిస్టర్ నివేదిత,
బ్రిటన్‌లో పుట్టి భారత్‌లో మహిళా విద్యాభివృద్ధికి కృషి చేసిన సంస్కర్త.

సందర్భం

వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవాలంటే బిజెపిని ఓడించాల్సిందే





వై. కేశవరావు

గత పది సంవత్సరాల అనుభవం మన ముందున్నది. 2014, 2019 ఎన్నికలలో రైతాంగానికి ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా చేసిన చట్టాలన్నీ రైతాంగానికి హాని కలిగించాయి. రైతాంగాన్ని రుణగ్రస్తం చేశాయి. ఆత్మహత్యలను నిరోధించలేకపోయాయి. సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎమ్) విస్తృతంగా చర్చించి రూపొందించిన పంటల మద్దతు ధరల చట్టం, రుణ విమోచన చట్టం మాత్రమే రైతులకు ఉపశమనాన్ని కలిగిస్తాయి. కానీ బిజెపి ప్రభుత్వం మొత్తం వ్యవసాయ రంగాన్నే కార్పొరేట్ కంపెనీలకు అప్పగించేందుకు కంకణం కట్టుకుంది. కావున... రాబోయే ఎన్నికల్లో మోడీ నాయకత్వాన ఉన్న బిజెపి ప్రభుత్వాన్ని, దాని మద్దతుదారులను ఓడించడం ద్వారానే అవసరమైన చట్టాలను సాధించుకోగలం. వ్యవసాయ రంగాన్ని, రైతాంగాన్ని కాపాడుకోగలం.

ఫిబ్రవరి 13 నుండి హర్యానా లోని శంభు బోర్డర్ దగ్గర ఆందోళన చేస్తున్న రైతాంగం మీద హర్యానా బిజెపి ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం దమనకాండ సాగిస్తున్నది. పోలీసు కాల్పులలో శుభకరణ్ సింగ్ అనే యువ రైతు మృతి చెందగా, మరొక నలుగురు రైతులు గుండె ఆగి చనిపోయారు. ఈ దాడిలో అనేక మంది రైతులు చూపు, వినికిడి కోల్పోయారు. 200 ట్రాక్టర్లు ధ్వంసం అయ్యాయి. ఈ వార్తలు బయటకు తెలియకుండా 171 యూ ట్యూబ్ చానళ్లపై ప్రభుత్వం నిషేధం విధించింది. పైగా రైతు ఉద్యమంపై ప్రభుత్వం అనేక దుష్ప్రచారాలు సాగిస్తున్నది. ఈ నేపథ్యంలో గత పది సంవత్సరాలలో రైతాంగం పట్ల, వ్యవసాయ రంగం పట్ల బిజెపి ప్రభుత్వం అనుసరించిన విధానాలను పరిశీలించుకోవడం అవసరం.

ఎన్నికల వాగ్దానాల అమలు తీరు!

బిజెపి 2014 ఎన్నికలలో 1. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని 2. స్వామినాథన్ కమిషన్ సూచనల ప్రకారం సి2+50 మద్దతు ధరలు అమలు పరుస్తామని 3. రైతులను రుణ విముక్తులను చేస్తామని వాగ్దానం చేసింది. స్వయాన ప్రధాని మోడీ అనేక బహిరంగ సభల్లో ప్రకటించారు. ఎన్నికల అనంతరం ఈ వాగ్దానాలన్నింటికీ తిలోదకాలు ఇచ్చారు.

స్వామినాథన్ కమిషన్ సూచన ప్రకారం సి2+50 మద్దతు ధరలు ఇవ్వడం సాధ్యం కాదని సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. ప్రత్యామ్నాయంగా ధరల వ్యత్యాస పథకం తెచ్చింది. ఈ పథకం విఫలం కావడంతో ప్రైవేటు ప్రొక్యూర్మెంట్, స్టోరేజ్ పథకం ప్రకటించారు. ఈ పథకం వల్ల కూడా కంపెనీలకే ప్రయోజనం కలిగింది తప్ప రైతులకు ఎలాంటి ఉపయోగం లేకపోయింది. ఇదీ విఫలం కావడంతో ఈనామ్ మార్కెట్ విధానం తెచ్చారు. ఈ విధానం వల్ల పోటీ పెరిగి రైతులకు మంచి ధరలు వస్తాయని ఊరించారు. ఆచరణలో ఏ ఒక్క మార్కెట్‌లో ఏ ఒక్క పంటకు ధర రాలేదు. పప్పుధాన్యాలపై స్వయంగా ప్రధాని మోడీ నియమించిన అరవింద సుబ్రమణ్యం కమిటీ సిఫారసులను కూడా చెత్తబుట్టలో వేసింది.

రైతుల ప్రయోజనాల కోసం అంటూ మూడు నల్ల చట్టాలు తెచ్చింది. ఆ చట్టాల వల్ల ప్రమాదాన్ని గుర్తించిన రైతు సంఘాలన్నీ ఏకమై 13 మాసాలు పోరాడటంతో ఆ చట్టాలను వెనక్కి తీసుకుంది. నాడు రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను అమలుపర్చకుండా, దొడ్డిదారిలో ఆ విధానాలనే అమలు పర్చాలనుకుంటున్నది.

కనీస మద్దతు ధర చట్టాలు

వ్యవసాయ ధరల కమిషన్ (సిఎసిపి) పంట పండించడానికి అయ్యే ఖర్చులను లెక్కవేసి కనీస మద్దతు ధరను నిర్ణయిస్తుంది. దీని ప్రకారం రైతు పెట్టిన పెట్టుబడులు మాత్రమే వస్తాయి. రైతు సంఘాలు స్వామినాథన్ సూచించిన సి2+50 ప్రకారం మద్దతు ధరల చట్టం చేయాలని ఆందోళనలు చేస్తున్నాయి. ఈ ఫార్ములాను అమలు పరచడం ద్వారా మాత్రమే ... ప్రస్తుతం రైతాంగం ఎదుర్కొంటున్న సంక్షోభం నుండి బయట పడగలుగుతారని... స్వామినాథన్ కడవరకు నొక్కి చెప్తూ వచ్చారు. ఈ ఫార్ములా అమలుకు గ్యారంటీ ఇస్తూ చట్టం చేయాలని రైతుసంఘాలు కోరుతున్నాయి.

రైతుల ఆదాయం రెట్టింపు

బిజెపి ప్రభుత్వం రైతుల ఆదాయం రెట్టింపు చేయడం కోసం మూడు సూత్రాలు రూపొందించింది. 1.దిగుబడులు పెంచడం 2. ఉత్పత్తి ఖర్చులు తగ్గించడం 3.నూర్పిళ్ళ అనంతరం నష్టాలు తగ్గించడం. పెట్టుబడులను తగ్గించడంలో భాగంగా రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని, ప్రకృతి వ్యవసాయం అమలుపరచడం వల్ల పెట్టుబడులు భారీగా తగ్గిపోతాయని చెప్పింది. గత రాష్ట్ర ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయం గురించి, ఆవు పేడ సిద్ధాంతం గురించి హడావిడి చేసింది. 10 వేల ఎఫ్‌సిఓల ద్వారా 10 లక్షల ఎకరాలు కార్పొరేట్ కంపెనీలకు అప్పగించేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది.

ఈ పది సంవత్సరాల కాలంలో ఎప్పుడూ రైతుకు కనీస మద్దతు ధరలు కూడా రాలేదు. పది సంవత్సరాల వ్యవసాయ మార్కెట్ల తీరు పరిశీలించిన వ్యవసాయ ఆర్థికవేత్తలు కనీస మద్దతు ధరలకు కూడా అమ్ముకోలేనందున రైతాంగం ఏటా రూ.2 లక్షల కోట్లు కోల్పోతున్నారని, ఆ మేరకు అప్పులు పెరిగిపోతున్నాయని తేల్చి చెప్పారు. రుణ భారాలను తాళలేక రైతాంగం ఆత్మహత్యలు ఈ కాలంలో 26 శాతంగా పెరిగాయని లెక్కలు చెబుతున్నాయి. పెట్టుబడులు తగ్గించాలని సలహా ఇచ్చిన ప్రభుత్వం ఎరువులపై సబ్సిడీలు తగ్గించింది. ఎరువుల ధరలు పెరిగిపోయాయి. డీజిల్ ధరలు పెంచింది. ఫలితంగా వ్యవసాయ పెట్టుబడులు రెట్టింపు అయ్యాయి. ఈ కాలంలో ట్రాక్టర్లు, స్ప్రేయర్లు, తదితర పరికరాలపై 28 శాతం జిఎస్‌టి విధించింది. గత ఏడాది నుంచి కేంద్ర ప్రభుత్వం మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీము నిలిపివేసింది. ఆహార భద్రతా చట్టానికి నిధుల్లో కోత విధించింది. ఆహార ధాన్యాల సేకరణ రాష్ట్ర ప్రభుత్వాలపై నెట్టివేసింది.

సమగ్ర పంటల బీమా

దిగుబడి ఆధారిత పంటల బీమాను, వాతావరణ పంటల బీమాను కలిపి ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన బిల్లు తెచ్చింది. రెండు ప్రభుత్వ బీమా కంపెనీలతోపాటు పది ప్రైవేట్ బీమా కంపెనీలకు అప్పగించింది. ఈ కంపెనీలు మన వ్యవసాయ, రెవెన్యూ శాఖలు తీసిన శాంపిల్ సర్వే తిరస్కరించి రైతులకు బీమా ఇవ్వడానికి నిరాకరించాయి. ఈ బీమా పథకం ప్రైవేటు బీమా కంపెనీలకు ఆదాయ వనరుగా మారింది. వ్యవసాయ ప్రధానమైన 9 రాష్ట్రాలు ఈ పథకం నుండి వైదొలిగాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పరచిన బీమా కంపెనీలకు గుర్తింపు నిరాకరించింది.

విద్యుత్ సవరణ చట్టం

కేంద్ర ప్రభుత్వం తెచ్చిన విద్యుత్ చట్ట సవరణను రైతు సంఘాలతో చర్చించి బిల్లు సవరిస్తామని ఇచ్చిన హామీకి భిన్నంగా పార్లమెంటులో ప్రవేశపెట్టింది. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ముందుకే సాగుతున్నది. విద్యుత్ ఉత్పత్తి కంపెనీలు, విద్యుత్ ట్రాన్స్‌కో, విద్యుత్ డిస్ట్రిబ్యూషన్ సంస్థలన్నీ ప్రయివేటు కంపెనీలకు అప్పగించడానికి చట్టం చేస్తున్నది.

సహకార రంగం

రైతులకు పరపతి సేవలు, ఎరువులు తదితర వస్తు సేవలు అందిస్తున్న సహకార సంఘాలను కేంద్ర అధీనంలోకి తీసుకొంటున్నది. సహకార రంగంలోకి కార్పొరేట్ కంపెనీల ప్రవేశానికి వీలు కల్పిస్తూ జీవోలు ఇచ్చింది.

సలహా కమిటీలు

ప్రభుత్వం ఏకపక్షంగా ఏర్పరచిన వ్యవసాయ కమిటీలోని వారందరూ మూడు వ్యవసాయ నల్ల చట్టాల రూపకర్తలు, వాటిని బలపరిచిన వారే. అంతేకాకుండా ప్రతి ప్రభుత్వ శాఖలోను అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ కంపెనీల ఉన్నతాధికారులను సలహా దారులుగా పెడుతున్నారు. వ్యవసాయానికి సంబంధించిన అన్ని శాఖలు ఇకనుండి కార్పొరేట్ కంపెనీల ఉన్నతాధికారులు కనుసన్నలలోనే నడుస్తాయి. ఇటీవలే నీతి ఆయోగ్ డైరెక్షన్‌లో తెచ్చిన భూమి హక్కుల చట్టం కూడా కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాల కోసమే.

గత పది సంవత్సరాల అనుభవం మన ముందున్నది. 2014, 2019 ఎన్నికలలో రైతాంగానికి ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా చేసిన చట్టాలన్నీ రైతాంగానికి హాని కలిగించాయి. రైతాంగాన్ని రుణగ్రస్తం చేశాయి. ఆత్మహత్యలను నిరోధించలేకపోయాయి.

సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎమ్) విస్తృతంగా చర్చించి రూపొందించిన పంటల మద్దతు ధరల చట్టం, రుణ విమోచన చట్టం మాత్రమే రైతులకు ఉపశమనాన్ని కలిగిస్తాయి. కానీ బిజెపి ప్రభుత్వం మొత్తం వ్యవసాయ రంగాన్నే కార్పొరేట్ కంపెనీలకు అప్పగించేందుకు కంకణం కట్టుకుంది. కావున రాబోయే ఎన్నికల్లో మోడీ నాయకత్వాన ఉన్న బిజెపి ప్రభుత్వాన్ని, దాని మద్దతుదారులను ఓడించడం ద్వారానే అవసరమైన చట్టాలను సాధించుకోగలం. వ్యవసాయ రంగాన్ని, రైతాంగాన్ని కాపాడుకోగలం.

/ ఎస్‌కెఎమ్ ఆధ్వర్యంలో మార్చి 14న ఢిల్లీ రామ్‌లీలా మైదానంలో రైతుల భారీ బహిరంగ సభ /

/ వ్యాసకర్త రైతుసంఘం సీనియర్ నాయకులు/

వ్యాఖ్య

కమలంతో వుంటే కేసు లేదు!

కేంద్రంలో నరేంద్ర మోడీ నేతృత్వంలో బిజెపి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి...విపక్షాలపై వేటు వేయడానికి కేంద్ర దర్యాప్తు సంస్థలు సిద్ధంగా వుంటున్నాయి. అయితే, బిజెపితో పాటు బిజెపికి సన్నిహితంగా ఉండేవారు చేసిన నేరాలను, అవినీతిని ఏ దర్యాప్తు సంస్థా గుర్తించదు! ఇతర పార్టీలలో వున్నవారు కమలంవైపు వచ్చినా కేసులు మాయమైపోతాయి!!

అజిత్ పవార్

మహారాష్ట్ర సంకీర్ణ ప్రభుత్వాన్ని కూల్చివేసిన, ప్రస్తుతం ఎన్‌డిఎ ప్రభుత్వంలో ఉన్న తొమ్మిది మంది ఎన్‌సిపి మంత్రుల్లో ముగ్గురు ఇ.డి విచారణలు ఎదుర్కొన్నవారు. ఉప ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టిన అజిత్ పవార్, మంత్రులు ఛగన్ భుజబల్, హసన్ ముష్రిఫ్‌లు ఇ.డి కి భయపడి ఏకంగా రూటే మార్చేశారు.

అజిత్ పవార్ గతంలో విదర్భ నీటిపారుదల అభివృద్ధి పథకం ఛైర్మన్‌గా ఉన్నప్పుడు మహారాష్ట్ర స్టేట్ కో-ఆపరేటివ్ బ్యాంక్ మంజూరు చేసిన రుణాలలో అవకతవకలు, నీటిపారుదల పథకాలలో అవకతవకల ఆరోపణలపై 'ఆర్థిక నేరాల విభాగం' విచారణను ఎదుర్కొన్నారు. దీని ఆధారంగా మనీ లాండరింగ్‌కి సంబంధించి దర్యాప్తు చేసేందుకు ఇ.డి కూడా కేసు నమోదు చేసింది. ఇ.డి ఛార్జిషీట్‌లో అజిత్ పాత్రను వివరంగా ప్రస్తావించారు. అయితే అజిత్ బిజెపి ప్రభుత్వంలో భాగమైన తర్వాత, కేసు గురించి అంతటా మౌనమే.

బిఎస్ ఎడియూరప్ప

కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి, బిజెపి నేత బిఎస్ ఎడియూరప్పపై భూ, మైనింగ్ అవినీతి కేసులు ఉన్నాయి. అవినీతిని రుజువు చేసే డైరీలను స్వాధీనం చేసుకున్నారు. బిజెపి నేతలు, న్యాయమూర్తులు, లాయర్లకు ముడుపులు ముట్టజెప్పినట్లు వెల్లడైనప్పటికీ చెప్పుకోదగ్గ విచారణ జరగలేదు. మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత అవసరమైన ఆధారాలు సేకరించకుండానే కేసు నుంచి తప్పించేందుకు సిబిఐ ప్రయత్నించింది.

జ్యోతిరాదిత్య సింధియా

జ్యోతిరాదిత్య సింధియా కాంగ్రెస్ నాయకుడిగా ఉన్న సమయంలో భూమి విక్రయం సందర్భంగా నకిలీ పత్రాలను సృష్టించారని మధ్యప్రదేశ్ ఆర్థిక నేరాల విభాగం కేసు నమోదు చేసింది. ఇ.డి కూడా ప్రాథమిక దర్యాప్తు ప్రారంభించింది. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టి బిజెపిలో చేరడంతో సింధియా కేసు మూతపడింది.

సువేందు అధికారి

పశ్చిమ బెంగాల్‌ను కుదిపేసిన శారదా చిట్‌ఫండ్ కుంభకోణం కేసులో నిందితుడు సువేందు. శారద చిట్టీ మోసం కేసు తృణమూల్ కాంగ్రెస్‌పై బిజెపి ప్రధాన అస్త్రంగా వుంది. అయితే సువేందు బిజెపిలో చేరడంతో విచారణ ఆగిపోయింది. ప్రస్తుతం సువేందు అధికారి ఆ రాష్ట్రంలో ప్రతిపక్ష బిజెపి నేతగా వున్నారు.

హిమంత బిశ్వ శర్మ

అసోంలో అగ్రగామి కాంగ్రెస్ నేతగా ఉన్న హిమంత బిశ్వ శర్మపై 'నీటి కుంభకోణం' ఆరోపణలు చేస్తూ బిజెపి పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించింది. కేంద్ర ఏజెన్సీలు విచారణ ప్రారంభించాయి. శర్మ అవినీతిపై బిజెపి ఓ పుస్తకాన్ని కూడా ప్రచురించింది. అయితే బిజెపిలో చేరాక ఆ అవినీతి అంతా మాయమైపోయింది.

ముకుల్ రాయ్

శారద చిట్‌ఫండ్ కుంభకోణంలో తృణమూల్ కాంగ్రెస్ మాజీ నేత ముకుల్ రాయ్ నిందితుడు. బెంగాల్‌లో రాయ్ అతి పెద్ద అవినీతిపరుడని బిజెపి పేర్కొంది. శారద చిట్‌ఫండ్ స్కామ్, నారద స్టింగ్ ఆపరేషన్ కేసులో ప్రమేయం ఉందంది. డబ్బును తీసుకుంటున్న వీడియోను సిబిఐ సంపాదించింది. అయితే, 2017 నవంబర్‌లో ఆయన బిజెపిలో చేరిన తర్వాత కేసు దర్యాప్తు అంతా ఆగిపోయింది.

నారాయణ్ రాణే

రాణే తన రాజకీయ జీవితాన్ని శివసేనలో ప్రారంభించి, కాంగ్రెస్ ప్రతినిధిగా మహారాష్ట్ర ముఖ్యమంత్రి అయ్యారు. అవినీతి, మనీలాండరింగ్ సహా నాలుగు కేసుల్లో ఇ.డి, సిబిఐ దర్యాప్తు ప్రారంభించాయి. 2019లో అరెస్ట్ దిశగా పనులు జరుగుతున్నాయని తెలియగానే రాణే బిజెపిలో చేరారు. ఆ తర్వాత కేసు విచారణ ముగిసింది.

పెమా ఖండూ

బిజెపిలో చేరక ముందు అరుణాచల్ ముఖ్యమంత్రి పెమా ఖండూపై అవినీతి ఆరోపణలు, నేరపూరిత కుట్ర కేసులు నిరంతరం వెల్లువెత్తాయి. అయితే బిజెపిలో చేరిన తర్వాత అదంతా రద్దయింది. ప్రస్తుతం ఆయన బిజెపి నాయకుడు, అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి.

ప్రఫుల్ పటేల్

ప్రఫుల్ పటేల్ ఎన్‌సిపి నాయకుడు. శరద్ పవార్‌కు అత్యంత నమ్మకస్తుడు. మన్మోహన్ సింగ్ ప్రభుత్వంలో విమానయాన శాఖ మంత్రిగా ఉన్న సమయంలో ఎయిరిండియాకు విమానాల కొనుగోలుకు సంబంధించి జరిగిన అవినీతి కేసును సిబిఐ చేపట్టింది. రాజ్యసభ సభ్యుడిగా ఉన్న పటేల్...బిజెపికి సన్నిహితుడైన ఎన్‌సిపి అజిత్ పవార్ వైపు చేరడంతో కేసు దర్యాప్తు ఆగిపోయింది.

శివరాజ్ సింగ్ చౌహాన్

మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, బిజెపి నేత చౌహాన్ దేశం ఇంత వరకు చూడని అతి పెద్ద ప్రవేశ పరీక్షల కుంభకోణం వ్యాపమ్ స్కాంలో ఇరుక్కున్నారు. అయితే విచారణలో అవినీతిని బయటపెట్టిన వారు, సాక్షులు మిస్టరీగా మరణించారు. ఆ తర్వాత ఆధారాలు లేకపోవడంతో 2017లో సిబిఐ క్లీన్‌చిట్ ఇచ్చింది.

రమేష్ పోఖ్రియాల్

ఉత్తరాఖండ్ బిజెపి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆయన రెండు భారీ అవినీతి కేసుల్లో ఇరుక్కున్నారు. ఒకటి భూమికి సంబంధించినది. మరొకటి హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టులకు సంబంధించినది. వివిధ అవినీతి కేసులతో కొట్టుమిట్టాడుతున్న ఆయన పాలన ప్రతిష్ట ఎంత దారుణంగా వుందంటే...2011లో బిజెపి ఆయనను బలవంతంగా రాజీనామా చేయించింది. అయితే సిబిఐ కానీ, రాష్ట్ర ప్రభుత్వం కానీ కేసు పెట్టేందుకు సిద్ధంగా లేవు. ప్రస్తుతం ఆయన కేంద్రంలో మానవ వనరుల అభివృద్ధి మంత్రిగా ఉన్నారు.

- ఫీచర్స్ అండ్ పాలిటిక్స్

కవిత్వం

పౌరసత్వం

పౌరుషత్వమే- నా
పౌరసత్వము
పోరు తత్వమే- నా
వారసత్వము!
ఉరికంబం ముద్దాడిన
భగత్ సింగునడిగావా?
జలియన్వాలాబాగ్‌లో
గోడల తడినడిగావా?
గాడ్సే కాల్చిన తుపాకీ
గాలినైనా చూశావా?
గాంధేయ పరిభాషలో
వీలునామా రాశావా?
పౌరుషత్వమే- నా
పౌరసత్వము!
అత్తరా! నెత్తురా!?
అది కుంకుమ కాశ్మీరా!
కలలో నుంచి జారుతున్న
మా వెన్నెల కన్నీరా?
బ్రహ్మపుత్రులం మేమని
ఏ అమ్మని అడగాలి?
తేయాకు నీళ్లతో
ఏ కాళ్లను కడగాలి?
పౌరుషత్వమే
నా పౌరసత్వము!
ఎవరు నా మంత్రసాని?
ఎవ్వరు నా పురిటి జ్ఞాని?
ఏదీ నా గర్భ ఘోష?
ఏది నా కంటి భాష?
వినిపించ లేదా నా
రక్తపు ప్రసవ శ్వాస?
గుండె చీల్చి మువ్వన్నెల
జండా చూపించాలా!?

- నల్లి ధర్మారావు,
సెల్ : 7660967313

నివాళి

జీవితాంతం ప్రజా పక్షమే

డి. గోవిందరావు



నేడు మామిడిపల్లిలో...శ్రీకాకుళం జిల్లా తొలి తరం కమ్యూనిస్టు నేత కామ్రేడ్ గానుగుల తరుణాచారి వర్ధంతి సభ, స్థూప ఆవిష్కరణ

కామ్రేడ్ గానుగుల తరుణాచారి శ్రీకాకుళం జిల్లా తొలి తరం కమ్యూనిస్టు నేత. తన యావత్ జీవితాన్ని ప్రజలకు అంకితం చేసిన పోరాట యోధుడు. తరుణాచారి 1899లో ఇచ్ఛాపురం దగ్గర కుగ్రామంలో జన్మించారు. చిన్నతనంలో అల్లరి చిల్లరగా తిరిగేవాడిని వాళ్ళ మేనమామ చిత్రాడ మల్లయ్య స్వర్ణకార పని నేర్పడం కోసం సోంపేట మండలం మామిడిపల్లి తీసుకువచ్చారు. మార్పు పద్మనాభం, బెందాళం గవరయ్యతో పాటుగా తరుణాచారి స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారు. 1927లో గాంధీజీ ఇచ్ఛాపురం వచ్చినప్పుడు పుల్లేల శ్యామ్ సుందర్‌రావు ఇంటి వద్ద ఉన్నారని తెలుసుకొని వారు ముగ్గురూ ఇచ్ఛాపురం వెళ్లి గాంధీని చూశారు. స్వాతంత్ర్యోద్యమ పిలుపులో భాగంగా ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నారు. గంజాం జిల్లా రైతు సంఘం అధ్యక్షులుగా మార్పు పద్మనాభం, కార్యదర్శిగా తరుణాచారి పనిచేశారు. 1934లో జమిందారీ వ్యతిరేక పోరాటంలో భాగంగా ఏజెన్సీ మైదాన ప్రాంతం ఉద్దానం గ్రామాల్లో పద్మనాభంతో కలిసి అనేక సభలు, సమావేశాలు నిర్వహించారు. 1936లో అఖిల భారత కిసాన్ సభ ఏర్పడింది. 1937లో ఇచ్ఛాపురంలో ప్రారంభమైన రైతు రక్షణ యాత్ర నడపడంలో తరుణాచారి క్రియాశీలక పాత్ర పోషించారు. 1940లో ఏప్రిల్ 1న మందస జమీందారీ వ్యతిరేక పోరాటంలో వీర గున్నమ్మతో పాటు ఆరుగురు అశువులు బాసిన తర్వాత, ఆ గ్రామాల్లో నిర్బంధాన్ని ప్రయోగించినప్పుడు రైతు ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లడంలో తరుణాచారి ముఖ్య పాత్ర పోషించారు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమం సందర్భంగా పద్మనాభం, గవరయ్య, తరుణాచారితో పాటుగా మామిడిపల్లి గ్రామస్తులు రాంబుడ్డి సారథి, కప్పల సారథి, కర్నేని రామదాసు కడలూరు జైలుకు వెళ్లారు. కర్నేని రామదాసు అనారోగ్యంతో మృతి చెందారు. కడలూరు జైల్లో ఎ.కె.గోపాలన్ పరిచయంతో కలిగిన సైద్ధాంతిక అవగాహనతో కారాగారంలోనే కమ్యూనిస్టులుగా మారి శ్రీకాకుళం జిల్లాలో తొలి తరం కమ్యూనిస్టులుగా ఆవిర్భవించారు. మామిడిపల్లిలో రైతు సంఘం ఏర్పాటు చేసి అనేక ఉద్యమాలు చేపట్టారు. మామిడిపల్లి అంటేనే కమ్యూనిస్టు గ్రామం. మామిడిపల్లిలో పాతినప్పల స్వామి, గోరకల వెంకయ్య, తులుకుల, కురియాల గంగయ్య, గురుమూర్తి, సింహాద్రి వంటి అనేకమంది కామ్రేడ్లు తరుణాచారి స్ఫూర్తితో బొడ్డపాడు, నీలావతి, మాకనపల్లి మొదలగు గ్రామాల్లో ప్రచారాలు నిర్వహించేవారు. మామిడిపల్లి గ్రామ మొదటి ప్రెసిడెంట్‌గా ఏకగ్రీవంగా ఎన్నికై 15 ఏళ్ల పాటు పని చేసిన ఘనత తరుణాచారిదే. మామిడిపల్లి గ్రామంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఒకరోజు తరుణాచారిని అరెస్ట్ చేయడానికి పోలీసులు మామిడిపల్లి వస్తే ఆయన ఆచూకీ ఎవరూ చెప్పలేదు. దీంతో పోలీసులు గ్రామం మీద విరుచుకుపడి లాఠీ చార్జీ చేసి తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగించారు. అయినప్పటికీ ఎవరూ చెప్పలేదు. దీంతో తన వల్లే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆయనే పోలీసులకి లొంగిపోయారు. పోలీసులు అరెస్ట్ చేసి టెక్కలి సబ్ జైలుకు తరలించారు. 1962లో మామిడిపల్లి దగ్గరి తోటలో పది రోజులు పాటు శిక్షణా తరగతులు నిర్వహించారు తరుణాచారి. ఈ శిక్షణా తరగతుల్లోనే పంచాది కృష్ణమూర్తి, నిర్మలకు పెళ్లి చేశారు. 1953లో అమానీ రైతుల పోరాటం పెద్ద ఎత్తున నిర్వహించారు. టెక్కలి రెవిన్యూ డివిజన్‌లో ర్యాలీలు, బహిరంగ సభలు నిర్వహించడంలో పద్మనాభంతో పాటు తరుణాచారి క్రియాశీలక పాత్ర పోషించారు. ఈ సందర్భంగా పద్మనాభం 13 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేశారు. ఆ ఏర్పాట్లన్నీ తరుణాచారి చూసేవారు. ఆ పోరాటం విజయవంతమైంది. 1958-59 కాలంలో పైడిగాం, చీపి, హంసరాలి ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలని పెద్ద ఎత్తున ఉద్యమాలు చేశారు. చీపి ప్రాజెక్టు నిర్మాణం జరిగితే 125 గ్రామాలు 8,500 ఎకరాలకు నీరు అందుతుందని, అదేవిధంగా పైడిగాం ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలని బేసి రామచంద్రపురంలో భారీ బహిరంగ సభ నిర్వహించారు. ఈ బహిరంగ సభకు ఏఐకేఎస్ అఖిలభారత నాయకులు చలసాని వాసుదేవరావు హాజరయ్యారు. 1964లో పార్టీలో సైద్ధాంతిక విభేదాలు వచ్చినప్పుడు తరుణాచారి సిపిఎం వైపు ఉన్నారు. తన తుది శ్వాస విడిచే వరకు కమ్యూనిస్టు ఆశయాలకు అనుగుణంగా జీవనం గడిపారు. 1985 మార్చి 13వ తేదీన తుది శ్వాస విడిచారు. ఆయన ఉద్యమ స్ఫూర్తి నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకమైనది, ఆచరణీయమైనది.

/ వ్యాసకర్త : సిపిఎం శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి /

మీ రచనలను పంపాల్సిన మెయిల్ :
editpageps@ gmail.com

తొమ్మిది వేల మంది ఉద్యోగులకు ఇంటి స్థలాలు

- మూడో విడత పట్టాల పంపిణీలో టిటిడి ఛైర్మన్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుపతిలోని వడమాలపేట, పాదిరేడు అరణ్యం వద్ద రెండు విడతల్లో 432 ఎకరాల్లో 5,221 మంది ఉద్యోగులకు ఇంటి స్థలాలు కేటాయించామని టిటిడి ఛైర్మన్ తెలిపారు. ప్రస్తుతం ఏర్పేడు మండలం పల్లం వద్ద ఉద్యోగులకు, సర్వీస్ పెన్షనర్లకు, ఫ్యామిలీ పెన్షనర్లకు కలిపి 4000 మందికి ఇంటి స్థలాలు కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. ఇంకా మిగిలిపోయిన ఉద్యోగులు, పెన్షనర్లు అందరికీ తప్పకుండా ఇంటి స్థలాలు కేటాయిస్తామన్నారు. అదేవిధంగా టిటిడిలోని కార్పొరేషన్, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, ఎఫ్ఎంఎస్ కార్మికులు, పారిశుద్ధ్య కార్మికులు తదితరులందరికీ రూ.ఐదు వేల నుండి రూ.20 వేల వరకు వేతనాలు పెంచినట్లు తెలియజేశారు. ఇలాంటి మంచి పనులు చేపట్టేందుకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్న టిటిడి ఇ.ఒ ఎవి.ధర్మారెడ్డికి, జెఇఒ వీరబ్రహ్మంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ధర్మారెడ్డి మాట్లాడుతూ.. వడమాలపేట వద్ద లేఅవుట్ పనుల కోసం రూ.150 కోట్లు వెచ్చించామన్నారు. ఏర్పేడు మండలం పల్లం గ్రామం వద్ద రూ.90 కోట్లు ఇచ్చామన్నారు. ఇప్పటివరకు దాదాపు రూ.240 కోట్లు టిటిడి ఖర్చు చేసిందని తెలిపారు. ఉద్యోగులు ఇప్పటివరకు రూ.85 కోట్లు టిటిడికి తిరిగి చెల్లించారని, మిగిలిన ఉద్యోగులందరూ సొమ్ము చెల్లించి రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని కోరారు.

కర'కట్టు'కథలేనా?

- 2019లో ఉన్నపళంగా పనులను రద్దు చేసిన ప్రభుత్వం
- ప్రమాదకర ప్రాంతాల్లో రక్షణ గోడల నిర్మాణానికి నిర్ణయం



ఆమదాలవలస మండలం కలివరంలో నాగావళి ఉధృతికి కోతకు గురైన గట్టు

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

కరకట్టల నిర్మాణాల విషయంలో ప్రభుత్వం ఉదాసీనత నదీతీర గ్రామాల ప్రజలను కష్టాలు పాల్జేస్తోంది. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత 2019లో కరకట్టల పనులను రద్దు చేసింది. వాటి స్థానంలో అత్యంత ప్రమాదరకరమైన ప్రాంతాల్లో వరద గట్లు నిర్మించాలని నిర్ణయించింది. వంశధార, నాగావళి నదీ తీర ప్రాంతాల్లో తీవ్ర కోతకు గురైన ప్రాంతాలను ప్రభుత్వ సూచనల మేరకు అధికారులు గుర్తించారు. రక్షణ గోడల నిర్మాణానికి అవసరమైన అంచనా వ్యయంతో ప్రభుత్వానికి 2020లోనే ప్రతిపాదనలు పంపారు. నాలుగేళ్లు అవుతున్నా నేటికీ ఆమోదం తెలపలేదు. పనులకు సంబంధించిన ఫైలుకు ఏదో ఒక కొర్రీ వేసి వెనక్కి పంపుతోంది. దీంతో, వంశధార, నాగావళి కరకట్టల కొత్త పనులకు ఒక్క అడుగూ ముందుకు పడడం లేదు.

వంశధార, నాగావళి నదుల వరదల నుంచి నదీ తీర గ్రామాల రక్షణకు గతంలో కరకట్టల పనులను ప్రారంభించినా ఫలితం లేకపోయింది. 2009-10 మధ్య కాలం వరకు కాస్తోకూస్తో పనులు జరిగినా ఆ తర్వాత నుంచి ఒక్క అడుగు ముందుకు పడడం లేదు. కరకట్టల నిర్మాణానికి పెద్ద ఎత్తున భూమిని సేకరించాల్సి ఉండడం, భూసేకరణకు అధికంగా నిధులు వెచ్చించాల్సి రావడంతో ప్రభుత్వం 2019లో ఉన్నపళంగా కరకట్టల పనులు రద్దు చేసింది. వరద ముప్పు తీవ్రంగా ఉన్న ప్రాంతాలను గుర్తించాలంటూ అధికారులను ఆదేశించింది. జిల్లాలో ఆ విధంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి అధికారులు 2020 ఫిబ్రవరిలోనే ప్రతిపాదనలు పంపారు.

ముంపు తీవ్రత అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి అందులో ముఖ్యమైన పనులకు ప్రాధాన్యమివ్వాలన్న ప్రభుత్వ ఆదేశాలతో నాగావళి కరకట్టలకు సంబంధించి అధికారులు తొలుత పది ప్రాంతాలను గుర్తించారు. నాగావళి నది పరివాహక ప్రాంతమైన ఆమదాలవలస మండలం తొగరం వద్ద రూ.13.14 కోట్లతో, పొందూరు గండ్రేడు వద్ద రూ.8.82 కోట్లు, ఆమదాలవలస బెలమాం వద్ద రూ.1.83 కోట్లు, బూర్జ మండలం అల్లెన నుంచి బూర్జ పాత కరకట్టల వరద గట్టు కోసం రూ.13.86 కోట్లతో మొత్తం రూ.37.65 కోట్లతో, వంశధార నది పరివాహక ప్రాంతంలో 22.77 కిలోమీటర్ల మేర కరకట్టలు నిర్మించేందుకు రూ.77.60 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. మూడేళ్లు గడుస్తున్నా ప్రభుత్వం నేటికీ ఆమోదం తెలపలేదు.

కరకట్టల పనుల పరిస్థితి ఇలా...

వంశధార నదిపై నిర్మించాల్సిన కరకట్టలను నాలుగు ప్యాకేజీలుగా విభజించారు. మొదటి ప్యాకేజీ పనులు 2007లో ప్రారంభించారు. ఇప్పటివరకు 7.55 శాతం పనులే పూర్తయ్యాయి. 2007లోనే మొదలైన ప్యాకేజీ-2 పనులు 5.66 శాతం మాత్రమే జరిగాయి. ప్యాకేజీ-3 పనులను కూడా 2007లో ప్రారంభించారు. 2.45 శాతం పనులు పూర్తి చేశారు. 2009లో ప్రారంభమైన ప్యాకేజీ-4 పనులు 21.32 శాతం మాత్రమే జరిగాయి. నాగావళి నదిపై నిర్మిస్తున్న కరకట్టల పరిస్థితి కూడా అలానే ఉంది. శ్రీకాకుళం జిల్లాలో నిర్మిస్తున్న కరకట్టలను నాగావళి-2 ప్యాకేజీ పనులుగా చేపట్టారు. హైదరాబాద్‌కు చెందిన గాయత్రి ప్రాజెక్ట్స్ సంస్థకు రూ.61.45 కోట్లకు పనులను అప్పగించారు. ఆ సంస్థ 2008లో పనులు ప్రారంభించింది. ఇప్పటికీ పనుల్లో పెద్దగా పురోగతి కనిపించడం లేదు. జిల్లా పరిధిలో 51.88 కిలోమీటర్ల పొడవున వరద కట్ట నిర్మించాల్సి ఉండగా, ఇప్పటివరకు 17.29 కిలోమీటర్ల మేర మాత్రమే పని పూర్తయింది. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత 25 శాతం కంటే తక్కువ జరిగిన పనులను తాత్కాలికంగా నిలిపివేయాలంటూ 2019 మే 29న ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో, అధికారులు ఎక్కడి పనులను అక్కడే నిలిపేశారు.

ఎన్నాళ్లీ ముంపు బాధలు ?

వర్షాకాలం వస్తే నదీ తీర గ్రామాలకు ఏటా ముంపు బాధలు తప్పడం లేదు. అల్పపీడన ప్రభావంతో గతేడాది ఆగస్టులో ఒడిశాలో కురిసిన వర్షాలకు వంశధారకు ఆకస్మిక వరద వచ్చింది. హిరమండలం వద్దనున్న గొట్టాబ్యారేజీ వద్ద గరిష్టంగా 77 వేల క్యూసెక్కులు నమోదైంది. వరద ఉధృతితో కొత్తూరు మండలం పెనుగోటివాడ, మాతల, నివగాం, సోమరాజపురం, ఆకులతంపర సమీపంలో పొలాలు ముంపునకు గురయ్యాయి. సుమారు 500 ఎకరాల్లో వరి, అరటి, చెరకు పంటలు దెబ్బతిన్నాయి. తుపాన్లు, వర్షాల సమయంలో వరద హెచ్చరికలు జారీ చేసి హడావుడి చేస్తున్న ప్రభుత్వం... ఆ తర్వాత రక్షణ చర్యలు విస్మరిస్తోంది. దీంతో, వరద వచ్చినప్పుడల్లా నదీ తీర గ్రామాల ప్రజలు ముంపు బారిన పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం నదీ తీర గ్రామాల వెంబడి కరకట్టలను నిర్మించాలని కోరుతున్నారు.

టిడిపిలో కమలం చిచ్చు

- విజయనగరం, అరకు పార్లమెంట్ స్థానాలను బిజెపికి వదిలేసిన అధిష్టానం
- నెల్లిమర్లలో ఉనికి కోల్పోతామంటూ ఆందోళన

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో విజయనగరం, పార్వతీపురం జిల్లాల టిడిపిలో కమలం చిచ్చురేపింది. పొత్తులో భాగంగా టిడిపి నెల్లిమర్ల నియోజకవర్గాన్ని జనసేనకు కేటాయించిన సంగతి తెలిసిందే. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ స్థానిక నాయకులు, కార్యకర్తలు నిర్విరామంగా వ్యతిరేకత ప్రదర్శిస్తునే ఉన్నారు. ఇది చల్లారకముందే బిజెపితో పొత్తు కుదుర్చుకోవడం, విజయనగరం, అరకు పార్లమెంట్ స్థానాలు బిజెపికి కేటాయిస్తున్నట్టు వెల్లడించడంతో ఈ రెండు జిల్లాల్లోనూ టిడిపి నాయకులు, కార్యకర్తలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. బిజెపితో పొత్తు పేరిట విజయనగరం పార్లమెంట్ పరిధిలోని ఆరు అసెంబ్లీ నియోజక వర్గాల టిడిపి కేడర్ బిజెపి అభ్యర్థికి ఓటు వేయాల్సి రావడంతో అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. నెల్లిమర్లలో అయితే, సైకిల్ గుర్తుకు ఓటేసే అవకాశమే లేని దుస్థితి ఉంది. ఈ నేపథ్యంలో జిల్లా నాయకులు మొదలుకుని, సామాన్య కార్యకర్తల వరకు తీవ్ర ఆవేదనతో అధిష్టాన వైఖరిని తప్పు పడుతున్నారు. బిజెపితో జతకడితే మొదటికే మోసం జరుగుతుందంటూ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థులు సైతం మదనపడుతున్నట్లు తెలిపారు. సాలూరు టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి, పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు మరో అడుగు ముందుకు వేసి 'అరకు పార్లమెంట్ బిజెపికి ఇవ్వకుండా మీరంతా సిఫార్సు చేయండి' అంటూ సోషల్ మీడియా ద్వారా పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఇంతలా మదన పడుతున్న టిడిపి శ్రేణులు, నాయకులు బిజెపికి ఎలా పనిచేస్తారన్నది విశ్లేషకుల ప్రశ్న. పార్లమెంట్ అభ్యర్థి వ్యక్తిగత చర్మిష్మా దాని పరిధిలోని అసెంబ్లీ అభ్యర్థులకు ఎంతో కొంత ఉపయోగపడవచ్చన్నది సర్వ సాధారణం. కానీ, అదే ఎంపీ అభ్యర్థి బిజెపి తరపున పోటీ చేయడంతో మొత్తం అసెంబ్లీ స్థానాల్లో ప్రతికూల పరిస్థితులు ఎదురయ్యే ప్రమాదం కనిపిస్తోందని పలువురు టిడిపి ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పదేళ్లపాటు కేంద్రంలో అధికారం వెలగబెట్టిన బిజెపి విభజన చట్టంలోని హామీలను అమలు చేయలేదు. ముఖ్యంగా రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వలేదు. విశాఖ రైల్వే జోన్, వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక నిధులు హామీ కూడా అమలు చేయలేదు. చివరకు విభజన హామీల్లో భాగంగా జిల్లాకు మంజూరు చేసిన గిరిజన యూనివర్సిటీకి కూడా తగిన నిధులు కేటాయించలేదు. దీంతో, ఆ వర్సిటీ ప్రస్తుతం అసౌకర్యాలు, సమస్యల నడుమ పరాయి పంచన నడుస్తోంది.

ఈ నేపథ్యంలో బిజెపి అభ్యర్థులకు ప్రజలు సహకరించే పరిస్థితి లేదని, ఆ ప్రభావం టిడిపి తరుపున పోటీ చేసే అభ్యర్థులపైనా పడనుందని, ఇంతనష్టం మనకి అవసరమా? అని టిడిపిలో చర్చ నడుస్తోంది. సొంతపార్టీకి ఒక్క ఓటు కూడా వేసుకునే అవకాశం లేకపోవడంతో నెల్లిమర్ల నియోజకవర్గం టిడిపి నాయకులు, కార్యకర్తలు అధిష్టానంపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

అప్రోచ్ రోడ్డు లేకుండానే వంతెన ప్రారంభమా ?

ఎమ్మెల్యే ఫాల్గుణను నిలదీసిన సిపిఎం సర్పంచ్ సునీత

ప్రజాశక్తి -డుంబ్రిగుడ

అప్రోచ్ రోడ్డు నిర్మించకుండా వంతెనను ప్రారంభించడం వల్ల ప్రయోజనమేంటని అరకు ఎమ్మెల్యే చెట్టి ఫాల్గుణను సిపిఎం సర్పంచ్ సునీత నిలదీశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా డుంబ్రిగుడ మండలం గసభ పంచాయతీ పరిధిలోని లోగిలిలో రూ.1.80 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన వంతెనను ఎమ్మెల్యే మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సిపిఎం సర్పంచ్ సునీత మాట్లాడుతూ అప్రోచ్ రోడ్డు లేకుండా అసంపూర్తిగా వంతెనను ప్రారంభించడం వల్ల వర్షాలు కురిస్తే రోడ్డు పాడయ్యే ప్రమాదం ఉందన్నారు. తక్షణమే ఇరువైపులా కనెక్టవిటీ రోడ్లు నిర్మించాలని కోరారు.. మండలంలో ప్రారంభించిన పలు పాఠశాల, అంగన్వాడి భవనాలు అసంపూర్తిగా ఉన్నాయని ఎమ్మెల్యేకు విన్నవించారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ, లోగిలి వంతెనకు కనెక్టివిటీ రోడ్డు నిర్మాణానికి రూ 40 లక్షలు మంజూరు చేశామని, మరో నెల రోజుల్లో వాటిని పూర్తిచేస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎంపిపి ఈశ్వరి ,జెడ్పిటిసి జానకమ్మ ,వైస్ ఎంపిపిలు ఆనందరావు, లలిత మండల అధ్యక్షుడు మల్లేశ్వరరావు, పశుసంవర్ధక శాఖ జిల్లా డైరెక్టర్ ఎం శ్రీరాములు, వైసిపి సీనియర్ నాయకులు సింహాచలం, కష్ణారావు, మాజీ మండల అధ్యక్షుడు గోపాల్ పాల్గొన్నారు.

రెండు నాటు తుపాకులు స్వాధీనం

- ఐదుగురు అరెస్టు

ప్రజాశక్తి- కార్వేటినగరం

అక్రమంగా దాచి ఉంచిన రెండు నాటు తుపాకులను స్వాధీనం చేసుకుని ఐదుగురు ముద్దాయిలను అరెస్టు చేసినట్లు నగరి డిఎస్‌పి కేఎస్.మూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిఎస్‌పి మాట్లాడుతూ.. చిత్తూరు ఎస్‌పి జాషువా ఆదేశాల మేరకు గ్రామాలను సందర్శించి నాటుసారా, తమిళనాడు, కర్ణాటకకు మద్యం అమ్మకాలు, అసాంఘీక కార్యక్రమాలపై నిఘా ఉంచినట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో భాగంగా వెదురుకుప్పం మండలం జక్కదొన్న సమీపంలోని నక్కలదిన్నె గ్రామంలో కొందరి వద్ద నాటు తుపాకులు ఉన్నట్లు సమాచారం అందడంతో గ్రామంలో తనిఖీలు చేపట్టారు. రెండు నాటు తుపాకులతో ఐదుగురు వ్యక్తులు వేటకు వెళ్లతున్నట్లు గుర్తించి వారిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు.

ఆరుగురు ఎర్రచందనం కూలీలు అరెస్టు

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

చంద్రగిరి సమీపంలోని భాకరాపేట అటవీప్రాంతంలోకి చొరబడుతున్న ఆరుగురు ఎర్రచందనం కూలీలను టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. టాస్క్ ఫోర్స్ ఎస్‌పి శ్రీనివాస్ ఆదేశాల మేరకు భాకరాపేట - అనంతపురం హైవే లో ఓ ప్రయివేటు కాలేజ్ ఎదురుగా ఉన్న అడవుల్లో కూంబింగ్ చేపట్టారు. కొంతమంది వ్యక్తులు అడవుల్లోకి చొరబడుతుండగా వారిని చుట్టుముట్టారు. పోలీసులను చూసి వారు పారిపోయే ప్రయత్నం చేశారు. వారిలో ఆరుగురిని పట్టుకోగలిగారు. సత్యసాయి జిల్లాకు చెందిన హరి, తిరుపతి రూరల్‌కు చెందిన మురగయ్య, తమిళనాడు కళ్లకురిచ్చికి చెందిన వెల్ మురుగన్, ఏలుమలై, మురుగన్ తంగవేల్, మహేంద్రన్ మురుగేషన్‌లను అరెస్ట్ చేశారు. తప్పించుకున్న మరో ఆరుగురు కోసం గాలింపు చర్యలు చేపట్టారు. పట్టుబడ్డ వారి నుంచి మూడు బస్తాల్లో గొడ్డళ్లు, రంపాలు స్వాధీనం చేసుకున్నారు.

భౌతిక స్వాధీనత నోటీసు

ICICI Bank | శాఖ కార్యాలయం: ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్, 4/10 మైత్రి టవర్, బొమ్మన్ హల్లి హోసూర్ మెయిన్ రోడ్డు, బెంగళూరు-560068

ఏదైతే
దిగువసంతకందారు ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారిగా, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటి ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువుతూ సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలతో రుణగ్రహీతలను సదరు నోటీసు స్వీకరించిన తేదీ నుండి 60 రోజులలోపట దిగువ పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించవలసిందిగా కోరుతూ డిమాండ్ నోటీసులు జారీచేయడమైనది.
రుణగ్రహీతలు మొత్తం తిరిగి చెల్లించుటలో విఫలం చెందిన కారణంగా, ప్రధానంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమేమనగా, దిగువ పేర్కొన్న తేదిల ప్రకారం సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదువుతూ సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతను/ఆమె అధికారాలు అధ్యాయనం చేస్తూ దిగువ వివరించిన ఆస్థి దిగువ సంతకందారుడు స్వాధీనపరుచుకొన్నాడు. ప్రత్యేకంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకాన్నీ హెచ్చరిండమేమనగా ఆస్థితో ఎలాంటి లావాదేవీలు జరుపరాదు మరియు ఏవైనా లావాదేవీలు జరుపదలచిన వారి ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ చార్జ్‌కు లోబడి ఉండవలెను.

క్ర. సం	రుణగ్రహీత పేరు/లోను ఖాతా సంఖ్య	ఆస్తి వివరణ/భౌతిక స్వాధీనతా తేది	డిమాండ్ నోటీసు తేదీ/ డిమాండ్ నోటీసులో మొత్తం (రూ.)	శాఖ పేరు
1.	వెంకట సుబ్రమణ్యం చిటిరాల/ చిటిరాల పద్మజ దేవి LBNEL00005396046/ LBNEL00005396048	(లోన్ డాక్యుమెంట్/ఆస్తి డాక్యుమెంట్‌లో వివరించిన ప్రకారం కవర్‌చేయబడిన ఆస్తి మొత్తం భాగం మరియు పార్శిళ్లు శ్రీ విద్య నిలయం మూడవ అంతస్తు, ఫ్లాట్ నం.టిఎఫ్-1 1482 చ.అ.లు. డో.నం.24, దుర్గాపురం వీధి, డో.నం.24 196, విజయవాడ 520010. ఉత్తరం : ఓపెన్ టు స్కై, దక్షిణం : ఓపెన్ టు స్కై, తూర్పు :ఓపెన్ టు స్కై మరియు లిఫ్ట్, పడమర : ఓపెన్ టు స్కై. / భౌతిక స్వాధీనతా తేది: 07.03.2024	30.11.2021 Rs. 55,15,142.00/-	విజయవాడ

పైన పేర్కొన్న రుణగ్రహీతలు(లు)/హామీదారులు(లు) మొత్తం తిరిగిచెల్లించుటకు ఒక 30 రోజుల నోటీసు ఇక్కడ ఇవ్వడమైనది, కావునా రూల్స్ 8 మరియు 9 ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 క్రింద నిబంధనల ప్రకారం, ఈ నోటీసు ప్రచురణ తేది నుండి 30 రోజుల గడువు తీరినాక తనఖా ఆస్తులు అమ్మబడును.

తేది : 13 మార్చి, 2024
ప్రదేశం: విజయవాడ
ఆధీకృత అధికారి
ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్

కేన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్

CanFinHomes Ltd (Sponsor: CANARA BANK) HOME LOANS ◆ DEPOSITS Translating Dreams into Reality
(CIN: L85110KA1987PLC008699)
76-14-95/11, 1వ అంతస్థు, ఆర్‌టిసి వర్క్‌షాప్ రోడ్, భవానీపురం, గొల్లపూడి, విజయవాడ-520012.
ఫోన్: 0866-2975223, 7625079223.
Email: gollapudi@canfinhomes.com

స్వాధీనత ప్రకటన (రూల్ 8(1))

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002లోని క్రింద **కేన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్** యొక్క అధీకృత అధికారిగా దిగువ సంతకందారునకు సంక్రమించిన అధికారములను వినియోగిస్తూ సదరు నోటీసు అందిన తేదీ నుండి 60 రోజులలోపు నోటీసులో పేర్కొనబడిన బకాయి **రూ.33,00,968/-** మరియు కాంట్రాక్చువల్ రేటు ప్రకారం భవిష్యవడ్డీ మరియు ఇతర అయిన ఖర్చులు, కాస్ట్స్, ఛార్జీలు మొ॥వి నోటీసు అందిన తేదీ నుండి 60 రోజులలోగా చెల్లించవలసిన **ఋణగ్రహీతలు: 1. శ్రీమతి కరిష్మ సోని, భర్త: షాబాజ్ ఖాన్,** ఫ్లాట్ నెం.202, 1వ అంతస్తు, నవ్య ఎన్‌క్లేవ్, ఇబ్రహీంపట్నం, కృష్ణా జిల్లా-521456. **2.శ్రీ పటాన్ షాబాజ్ ఖాన్, తండ్రి: మహబూబ్ ఖాన్,** ఫ్లాట్ నెం.202, 1వ అంతస్తు, నవ్య ఎన్‌క్లేవ్, ఇబ్రహీంపట్నం, కృష్ణా జిల్లా-521456. **హామీదారు: శ్రీ పటాన్ మహబూబ్ ఖాన్, తండ్రి: షేర్ ఖాన్,** డోర్ నెం.9-164, ఖాజీ నగర్, ఇబ్రహీంపట్నం మండలం, కృష్ణా జిల్లా-521456 గార్లను కోరుతూ **తేది.01.01.2024న డిమాండ్ నోటీసు** జారీచేశారు.

ఋణగ్రహీతలు సొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఋణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా ప్రకటించునది ఏమనగా సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 నందలి రూల్ 8తో కలిపి చదువుకొనవలసిన సదరు యాక్ట్ యొక్క సెక్షన్ 13(4) క్రింద తనకు సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ దిగువ సంతకందారు **తేది.12.03.2024న** దిగువ వివరించిన ఆస్తిని **స్వాధీనత** తీసుకొన్నారు.

ఋణగ్రహీతలు సెక్యూర్డు ఆస్తుల విమోచనం కొరకు గడువు లభ్యతపై సదరు చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8)లోని నిబంధనలు గమనించవలెను.

సాధారణ ప్రజానీకానికి మరియు ముఖ్యంగా ఋణగ్రహీతలకు ఇందుమూలముగా హెచ్చరించునది ఏమనగా సదరు ఆస్తితో ఎట్టి లావాదేవీలు జరుపరాదు మరియు సదరు ఆస్తికి సంబంధించిన ఎట్టి లావాదేవీలైన **రూ.33,00,968/-** మరియు వడ్డీ **కేన్‌ఫిన్ హోమ్స్ లిమిటెడ్** వారి ఛార్జీకి లోబడి ఉంటాయి.

స్థిరాస్తి వివరములు

కృష్ణా జిల్లా, ఇబ్రహీంపట్నం రెవిన్యూ డివిజన్, ఇబ్రహీంపట్నం గ్రామం ఏరియా, సర్వే నెం.92/1లో "నవ్య ఎన్‌క్లేవ్" అను పేరు గల అపార్ట్‌మెంట్ నందు 183-50 చ॥గ॥లు లేదా 153-43 చ॥మీ॥ల విస్తీర్ణంలో 1వ అంతస్తులో గల ఫ్లాట్ నెం.202 యావత్తు ఆస్తి. **హద్దులు: తూర్పు:** రావి వెంకట సువర్ణ గారి ఆస్తి, **దక్షిణం:** 21 అ॥ల వెడల్పు రోడ్, **పడమర:** 21 అ॥ల వెడల్పు రోడ్, **ఉత్తరం:** అట్లూరి ఉమేష్ బాబు గారి ఆస్తి.

"నవ్య ఎన్‌క్లేవ్" నందు 28 చ॥గ॥లు లేదా 23-41 చ॥మీ॥ల అవిభాజ్యపు అనిర్ధేష్యపు వాటాతో 1వ అంతస్తులో గల ఫ్లాట్ నెం.202, ప్లింత్ ఏరియా 821 చ॥అ॥లు మరియు కార్ పార్కింగ్ ఏరియా 80 చ॥అ॥లు, అన్ని సౌకర్యాలు మరియు ఈజుమెంటరీ హక్కులతో సహా. **హద్దులు: తూర్పు:** ఓపెన్ టు స్కై **దక్షిణం:** ఓపెన్ టు స్కై, **పడమర:** వరండా, **ఉత్తరం:** ఓపెన్ టు స్కై.

తేది : 12.03.2024
ప్రదేశం : విజయవాడ (గొల్లపూడి)
సం/- అధీకృత అధికారి
కేన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా - నరసరావుపేట మెయిన్ బ్రాంచి

यूनियन बैंक ऑफ इंडिया भारत सरकार का उपक्रम | యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భారత ప్రభుత్వ రంగ సంస్థ
నరసరావుపేట మెయిన్ బ్రాంచి
బ్యాంక్ స్ట్రీట్, అరండల్‌పేట, నరసరావుపేట, పల్నాడు జిల్లా-522601. ☎ 08647-225195, 222047

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియపరచు ప్రకటన (30 రోజుల ప్రకటన)

{సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 6(2)/8(6)}

టు: ఋణగ్రహీత(లు): శ్రీ రామిశెట్టి శ్రీనివాసరావు. హామీదారు(లు): 1) శ్రీమతి మామిడి నాగరాజ కుమారి, 2) శ్రీ రామిశెట్టి కోటేశ్వరరావు, 3) శ్రీ రామిశెట్టి సుబ్బారావు, 4) శ్రీ రామిశెట్టి జగన్నాథరావు.

సర్/మేడమ్,

విషయం : సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం బ్యాంకు బకాయి వసూలు కొరకు శ్రీ రామిశెట్టి శ్రీనివాసరావుకు చెందిన ఆస్తి అమ్మకం.

సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నరసరావుపేట-03811, బ్యాంక్ స్ట్రీట్, అరండల్‌పేట వారిచే** సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద **డిమాండ్ ప్రకటన తేది.05.09.2023** ద్వారా నాచే / బ్యాంక్‌చే డిమాండ్ చేసినప్పటికీ మీరు బకాయి మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో విఫలమైనారు. కావున సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 6/8 తో చదివే సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ అధీకృత అధికారిచే దిగువ తెలిపిన ఆస్తిని **తేది.10-01-2024 న స్వాధీనం చేసుకోవడం** జరిగింది.

ఆస్తిని స్వాధీనం చేసుకొన్నప్పటికీ మీరు బ్యాంక్‌కు బకాయి మొత్తాన్ని తిరిగి చెల్లించలేదు, అందువలన ఈ ప్రకటన తేది నుండి 30 రోజుల తర్వాత ఆన్‌లైన్ పద్ధతిలో బహిరంగ ఇ-వేలం ద్వారా దిగువ తెలిపిన ఆస్తులను విక్రయించుట తప్పనిసరి అయినది.

ఇ-వేలం తేది మరియు సమయం, ఆస్తి యొక్క రిజర్వ్‌ధర మరియు సర్వీస్ ప్రొవైడర్ వివరాలు అమ్మకం ప్రకటన ద్వారా తెలియజేయబడతాయి, అది విడిగా జారీ చేయబడుతుంది.

కావున మీరు బ్యాంక్‌కు చెల్లించవలసిన మొత్తాన్ని తదుపరి వడ్డీ, ఖర్చులు, ఛార్జీలు మరియు సేల్ నోటీసును ప్రచురించే తేదీకి ముందు బ్యాంక్ చేసిన ఖర్చులతో సహా కలిపి మీరు చెల్లిస్తే షెడ్యూల్‌లో పేర్కొన్న ఆస్తి అమ్మకానికి గాను ఎటువంటి తదుపరి చర్య తీసుకోబడదు. సదరు చట్టం యొక్క సెక్షన్ 13(8) పరిధిలో విడిపించుకునే హక్కు లభిస్తుంది.

షెడ్యూల్ ఆస్తులు

సెక్యూరిటీ యొక్క వివరములు: నరసరావుపేట యస్ఆర్ఓ నందు **13-08-1990** తేదీగల విక్రయ దస్తావేజు **నెం.383/1990 లోని ఆస్తి.** ఆంధ్రప్రదేశ్, పల్నాడు జిల్లా-522601, నరసరావుపేట, చిలకలూరిపేట రోడ్డు, డి.నెం.16-1-220, బ్లాక్ నెం.2/18, సర్వే నెం. టి.యస్.910 నందు 468 చ॥గ॥ విస్తీర్ణముగల రెసిడెన్షియల్ స్థలము మరియు సెమీ అర్బన్ భవనమునకు సంబంధించిన యావదాస్తి. దీనికి **హద్దులు: తూర్పు:** పి.వెంకటేశ్వరరావు మరియు వెండార్ యొక్క ఉమ్మడి గోడ 135.10 అ॥; **దక్షిణం:** సయ్యద్ మీరాబీ మరియు వెండార్ యొక్క ఉమ్మడి గోడ 31 అ॥; **పడమర:** యన్.రామచంద్రరావు యొక్క రైస్‌మిల్ మరియు ఇతరులు 135 అ॥; **ఉత్తరం:** చిలకలూరిపేట రోడ్డు 31 అ॥.

ప్రదేశము : నరసరావుపేట
తేది : 12.03.2024
సం/- ఛీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

ఇ-వేలం విక్రయ నోటీసు

ఈడెల్‌వీస్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్
సిఐఎన్: U67100MH2007PLC174759
రీటైల్ సెంట్రల్ మరియు నమోదిత కార్యాలయం: ఈడెల్‌వీస్ హౌజ్, ఒయఫ్‌యఫ్ సి.ఎస్.టి రోడ్ , కలిన, ముంబాయి 400098

సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 ("రూల్స్") యొక్క రూల్ 8(6)కి సంబంధించిన నిబంధనతో చదువుతూ సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002, క్రింద సెక్యూర్డ్ అసెట్స్ స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం విక్రయ నోటీసు.

ఈడెల్‌వీస్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఇకపై "ఇహెచ్‌ఎఫ్ఎల్/ అసైనర్"గా సూచిస్తారు) కు అసైన్ చేసిన **పిరమల్ క్యాపిటల్ అండ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్** (ఇకపై "పిహెచ్‌ఎఫ్ఎల్/ అసైనర్"గా సూచిస్తారు) ఆర్థిక సౌకర్యాలు అందించిన కాలమ్‌లో స్పష్టంగా పేర్కొన్న **ఇఎఆర్‌సి- ట్రస్ట్-ఎస్‌సి-477** యొక్క ట్రస్టీ హోదాలో పనిచేస్తున్న ఈడెల్‌వైజ్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్‌కి కేటాయించబడ్డాయి. ఈ అసైన్‌మెంట్‌కు అనుగుణంగా ఇఎఆర్‌సి అసైనర్‌కి చేరింది. మరియు సురక్షితమైన రుణదాతగా దాని హక్కులను వినియోగించుకుంటుంది.ఆ ఇఎఆర్‌సి, సెక్యూర్డ్ క్రెడిటర్ హోదాలో, క్రింద పేర్కొన్న స్థిరమైన సెక్యూర్డ్ ఆస్తులను సర్ఫేసీ చట్టం యొక్క 13(4) నిబంధనల క్రింద స్వాధీనం చేసుకోవడమైనది.
15 రోజుల నోటీసు దీని ద్వారా సాధారణ ప్రజలకు మరియు ప్రత్యేకించి రుణగ్రహీత మరియు హామీదారు(లు)కి ఇవ్వబడింది, క్రింద వివరించిన స్థిరమైన సెక్యూర్డ్ అసెట్స్, సెక్యూర్డ్ క్రెడిటార్‌కి అనుకూలంగా తనఖా పెట్టబడ్డాయి, దాని భౌతిక స్వాధీనాన్ని సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క అధీకృత అధికారి (ఎఒ) తీసుకున్నారు. **"ఎక్కడ ఉందో అలాగే" "ఉన్నది ఉన్నట్లే" మరియు "ఏదైనా ఉంది"** ఆధారంగా రుణగ్రహీత మరియు హామీదారు నుండి ఇఎఆర్‌సి ద్వారా స్వీకరించబడిన ఏదైనా డబ్బు కోసం తీసివేయబడిన తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులు /ఖర్చులతో పాటు ఇఎఆర్‌సి కారణంగా దిగువ పేర్కొన్న మొత్తాలను తిరిగి పొందడం కోసం. ప్రతి ఆస్తికి రిజర్వ్ ధర మరియు ఎర్నెస్ట్ మనీ డిపాజిట్ క్రింద పేర్కొనబడ్డాయి.

వేలానికి ఉంచిన సెక్యూర్డ్ అసెట్స్ వివరాలు:

క్ర. సం.	లోన్ ఎకౌంట్ నెం.	రుణగ్రహీత/సహ-రుణగ్రహీత/ హామీదారుల పేర్లు	ట్రస్ట్ పేరు	బ్యాంక్ పేరు మరియు శాఖ మరియు అకౌంట్ నంబరు మరియు ఐఎఫ్ఎస్‌సి కోడ్	12.03.2024 నాటికి మొత్తం బకాయి ఐఎన్ఆర్	రిజర్వ్ ధర (ఐఎన్ఆర్ లో)	ధరావత్తు (ఇఎమ్‌డి) ఐఎన్ఆర్ లో	వేలం యొక్క తేదీ మరియు సమయం	స్వాధీనతా విధానం
1	6600002157	1. శ్రీ.కిషన్ కాంత్ దత్ ("రుణగ్రహీత") 2) శ్రీమతి. రాజ్యలక్ష్మి మత్తి ("సహ-రుణగ్రహీత") 3. శ్రీ.మణిదత్తా ("సహ-రుణగ్రహీత"), 4. శ్రీ.శివ రామవరప్రసాద్ దత్తా ("సహ-రుణగ్రహీత")	ఇఎఆర్‌సి ట్రస్ట్ ఎస్‌సి 477	ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్ నారిమన్ పాయింట్ 000405135291, ICIC0000004	Rs. 1,24,76,442.66	Rs. 65,00,000/-	Rs. 6,50,000/-	30.03.2024 At 11:00AM	భౌతిక స్వాధీనత

తనఖా ఆస్తి వివరణ: అంశం నం.1 : ఆంధ్రప్రదేశ్, పిన్‌కోడ్ : 521105, కృష్ణాజిల్లా, కనుమోలు సబ్ రిజిస్ట్రీ, బాపులపాడు మండలం, పెరికీడు, ఆర్.ఎస్.నం.495/2 మరియు 3, ఆస్తి కొత్త డో.నం.2-44 కొలత 542 చ.గ.లు. లేదా 455.28 చ.మీ.లు. సైట్ లోపల ఒక ఆర్‌సిసి భవనం మరియు లెట్రిన్ మరియు బాత్రూమ్ మొదలైనవి మరియు విద్యుత్ బిల్ నం.683 క్రింది విధంగా ఉన్న **సరిహద్దులు : తూర్పు :** మచిలీపట్నం నుండి కల్లూరు రోడ్డు-49.0 అ.లు., **దక్షిణం :** 5 గజాల వెడల్పు ఉమ్మడి బజార్ (వీధి) 93.0 అ.లు., **పడమర :** బి షెడ్యూల్ లో 2వ అంశం-56.0 అ.లు., **ఉత్తరం :** 2 గ.లు. వెడల్పు ఉమ్మడి బజారు వీధి-93.0 అ.లు. పై **సరిహద్దుల** కొలిచే పరిధి 542 చ.గ.లు. లేదా 455.28 చ.మీ.లు.తో కలిపి కరెంటు సర్వీస్ కనెక్షన్ మరియు బోరు, మీటరు మరియు అన్నీ ఇతర సౌలభ్య హక్కులు మొదలైనవి., **అంశం నం.2 :** ఆంధ్రప్రదేశ్, పిన్‌కోడ్-521105, కృష్ణాజిల్లా, కనుమోలు సబ్ రిజిస్ట్రీ, పెరికీడు బాపులపాడు మండలం, ఆర్.ఎస్.నం.495/2 మరియు 3, ఆస్తి కొత్త డో.నం.2-44 క్రింది విధమైన **సరిహద్దులు : తూర్పు :** బి-షెడ్యూల్ లో 2వ అంశం-56 అ.లు., **దక్షిణం :** 5 గ.లు. వెడల్పు ఉమ్మడి బజార్ (వీధి)-77 అ.లు., **పడమర :** మేకతోటి ప్రసాద్‌కు చెందిన సైట్-62 అ.లు., **ఉత్తరం :** 2 గ.లు. వెడల్పు ఉమ్మడి బజార్ (వీధి)-74.0 అ.లు. పై సరిహద్దుల కొలిచే పరిధి 494 చ.గ.లు. లేదా 415.96 చ.మీ.లు. తో కలిపి కరెంటు సర్వీస్ కనెక్షన్ మరియు బోరు, మీటర్ మరియు అన్నీ ఇతర సౌలభ్య హక్కులు మొదలైనవి. **అంశం నం.3 :** ఆంధ్రప్రదేశ్-521105, కృష్ణాజిల్లా, కనుమోలు సబ్ రిజిస్ట్రీ, పెరికీడు బాపులపాడు మండలం, ఆర్.ఎస్.నం.495/2 మరియు 3, ఆస్తి కొత్త డో.నం.2-44. క్రింది విధమైన **సరిహద్దులు : తూర్పు :** 2 గ.లు. వెడల్పు ఉమ్మడి పాసేజ్ మార్గం కొంత మేరకు, **దక్షిణం :** ఎ-షెడ్యూల్ ఆస్తిలో 4వ అంశం, **పడమర :** యశం ప్రభాకరరావుకు చెందిన స్థలం, **ఉత్తరం :** సరిహద్దు నాగేశ్వరరావుకు చెందిన సైట్. పై సరిహద్దుల కొలిచే పరిధి 367 చ.గ.లు. లేదా 308.28 చ.మీ.లు.తో కలిపి కరెంటు సర్వీస్ కనెక్షన్ మరియు బోరు, మోటారు మరియు అన్నీ ఇతర సౌలభ్య హక్కులు మొదలైనవి.

వేలం ప్రక్రియకు సంబంధించిన ముఖ్యమైన సమాచారం:

1	అన్ని డిమాండ్/వేలం ప్రక్రియకు సంబంధించిన ముఖ్యమైన సమాచారం:డ్రాఫ్టులు (డిడి) పైన పేర్కొన్న విధంగా ట్రస్ట్ పేరుకు అనుకూలంగా డ్రా చేయబడతాయి మరియు ముంబైలో చెల్లించబడతాయి.	
2	ఇఎమ్‌డి సమర్పణ చివరి తేదీ	వేలం తేదీకి 1 రోజు ముందు స్వీకరించబడింది
3	బిడ్ల సమర్పణ కోసం స్థలం	ఈడల్వీజ్ హౌస్, ముంబై వద్ద
4	వేలం స్థలం (వేలం కోసం వెబ్‌సైట్)	ఇ-వేలం : (https://auction.edelweissarc.in)
5	టోల్ ఫ్రీ నంబరు	18002666540
6	ఆస్తి తనిఖీ తేదీ మరియు సమయం	ముందస్తు నియామకం ప్రకారం

విక్రయానికి సంబంధించిన వివరణాత్మక నిబంధనలు మరియు షరతుల కోసం, దయచేసి ఇఎఆర్‌సి వెబ్‌సైట్‌లో అందించిన లింక్‌ను https://auction.edelweissarc.in చూడండి.

ప్రదేశం : ముంబై
తేదీ: 12.03.2024
సం/- అధీకృత అధికారి
ఈడెల్‌వీస్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్., తరపున
Edelweiss Asset Reconstruction

మహీంద్రా రూరల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

కార్పొరేట్ ఆఫీస్: యూనిట్ నెం: 203, అమిత్ బిల్డింగ్, పిరమల్ అగస్త్య కార్పొరేట్ పార్క్, అగ్నిమాపక దళం స్టేషన్ ఎదురుగా కమని జంక్షన్, L.B.S. మెయిన్ రోడ్, కుర్లా (పశ్చిమ) ముంబై - 400 070
రీజనల్ కార్యాలయం: H.No 54-1/2D, 4వ అంతస్తు, శ్రీ సూర్య ప్రీమియర్, వెటర్నరీ కాలనీ, గుణదల, N.H-5వ రోడ్డు, విజయవాడ-520008

స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు) See rule 8(1)

సెక్యూరిటైజేషన్ మరియు రీకన్స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ మరియు ఎన్ఫోర్స్మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు - 2002 పరిధిలో ఈ క్రింది సంతకందారు మహీంద్రా రూరల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఇప్పటి నుండి MRHFL గా పరిగణించునది), కార్పొరేట్ ఆఫీస్: యూనిట్ నెం: 203, అమిత్ బిల్డింగ్, పిరమల్ అగస్త్య కార్పొరేట్ పార్క్, అగ్నిమాపక దళం స్టేషన్ ఎదురుగా కమని జంక్షన్, L.B.S. మెయిన్ రోడ్, కుర్లా (పశ్చిమ) ముంబై - 400 070 ఇండియా వద్ద మరియు రీజనల్ కార్యాలయం: H.No 54-1/2D, 4వ అంతస్తు, శ్రీ సూర్య ప్రీమియర్, వెటర్నరీ కాలనీ, గుణదల, N.H-5వ రోడ్డు, విజయవాడ-520008. వద్ద కలిగియున్న సంస్థ అధీకృత అధికారిగా మరియు సెక్యూరిటి ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్ మెంట్) రూల్స్ 2002 యొక్క 3వ రూలుతో కూడిన సదరు చట్టం 13 (12) విభాగం క్రింద సంక్రమించిన అధికారాలతో ఈ క్రింది ప్రతి ఖాతాకు ఎదురుగా సూచించిన మొత్తమును చెల్లించవలసినదిగా సంబంధిత రుణగ్రహీత/లును సదరు నోటిసు స్వీకరణ తేదీ నుండి 60 దినములలోగా చెల్లించవలసినదిగా ప్రతి ఖాతా ఎదురుగా తెలిపిన తేదీలలో డిమాండ్ నోటిసు/లు జారీ చేసినారు. రుణగ్రహీత/లు సదరు మొత్తమును తిరిగి చెల్లింపు చేయుటలో విఫలమైనారు. కనుక రుణగ్రహీత/లుకు మరియు యావన్మంది ప్రజానీకమునకు తెలియచేయునది ఏమనగా సదరు చెప్పిన నియమావళి యొక్క రూ.లు 8 తో కూడిన సదరు చట్టం 13 (4) విభాగం పరిధిలో అతనికి/ఆమెకు సంక్రమించిన అధికారాలతో దిగువ వివరించిన ఆస్తి/ఆస్తులను క్రింది సంతకందారు ప్రతి ఖాతా ఎదురుగా తెలిపిన తేదీన స్వాధీన పరచుకొనినారు. రుణగ్రహీత/లుకు ప్రత్యేకంగాను మరియు యావన్మంది ప్రజానీకమును హెచ్చరించునది ఏమనగా సదరు ఆస్తితో ఎలాంటి లావాదేవీలు జరుపరాదనియు మరియు అట్టి లావాదేవీలు ఏవైనను మహీంద్రా రూరల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారికి లోను అగ్రిమెంటు ప్రకారం చెల్లించవలసిన మొత్తము మరియు అందుపై వడ్డీ చెల్లింపునకు లోబడి మాత్రమే నిర్వర్తించవలెను. సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు సదరు చట్టం 13వ విభాగం (8)వ ఉప-విభాగం నియమావళి పరిధిలో తగిన సమయం లభించునని రుణగ్రహీతలకు సూచించటమైనది.

వ.నెం.1, అగ్రిమెంట్ నెం./ఫిన్ నెం. XRESNUZ00812964/1005011, **రుణగ్రహీత/ సహ-రుణగ్రహీత/ హామీదారు(లు)** తొమ్మండ్రు రాంబాబు తండ్రి సుబ్బారావు, సర్వే నెం:75/1, డోర్ నెం: 3-54/A, చర్చి దగ్గర, తోలుకోడు, విజయవాడ-నూజివీడు, ఆంధ్రప్రదేశ్-521230. తొమ్మండ్రు ఆదిలక్ష్మి భర్త రాంబాబు, సర్వే నెం:75/1, డోర్ నెం:3-54/A, చర్చి దగ్గర, తోలుకోడు, విజయవాడ-నూజివీడు, ఆంధ్రప్రదేశ్-521230. మందా చిన్నబాబు తండ్రి వెంకటేష్, డోర్ నెం: 3-18, టెంపుల్ దగ్గర, తోలుకోడు, విజయవాడ-నూజివీడు, ఆంధ్రప్రదేశ్, 521230. **డిమాండ్ నోటీసు తేదీ :** 09/11/2022, **డిమాండ్ నోటీసు ప్రకారం మొత్తం:** రూ.1,13,214/-, **స్వాధీన పరచుకున్న తేదీ :** 08/03/2024, **స్థిరాస్థి వివరణ:** డోర్ నెం: 3-54/A, తోలుకోడు గ్రామం, మైలవరం మండలం. వద్ద సర్వే నెం:75/1, 603 చ.అ.ల భూమి కొలతతో సంపూర్ణ ఆస్థి సరిహద్దులు **ఉత్తరం:** ఇంకొల్ల కోటయ్య గారి స్థలం, **దక్షిణం:** ఇంకొల్ల వాణి గారి ఇల్లు, **తూర్పు:** కొవ్వలి రాజు గారి ఇల్లు, **పడమర:** పంచాయితీ రోడ్డు

వ.నెం.2, అగ్రిమెంట్ నెం./ఫిన్ నెం. XRESVJW00739489/872518, **రుణగ్రహీత/ సహ-రుణగ్రహీత/ హామీదారు(లు)** మందా అజయ్‌బాబు తండ్రి అరుణ్ కుమార్, సర్వే నెం: 287/2, D.నెం: 32-135, చర్చి దగ్గర, కొండపల్లి, కృష్ణా, ఆంధ్రప్రదేశ్- 521228. మందా దీప్తి చైతన్య భర్త అజయ్‌బాబు, సర్వే నెం: 287/2, D.నెం: 32-135, చర్చి దగ్గర, కొండపల్లి, కృష్ణా, ఆంధ్రప్రదేశ్-521228. కంపా వెంకట్రావు తండ్రి వెంకటేశ్వర, D.నెం: 32-141 , ఖిల్లా రోడ్, కొండపల్లి, కృష్ణా, ఆంధ్రప్రదేశ్, 521456. **డిమాండ్ నోటీసు తేదీ :** 09/11/2022, **డిమాండ్ నోటీసు ప్రకారం మొత్తం:** రూ.1,47,580/-, **స్వాధీన పరచుకున్న తేదీ :** 08/03/2024, **స్థిరాస్థి వివరణ:** D.నెం: 32-135, చర్చి దగ్గర, కొండపల్లి గ్రామం, ఇబ్రహీంపట్నం మండలం, కృష్ణా జిల్లా. వద్ద సర్వే నెం: 287/2, 2736 చ.అ.ల భూమి కొలతతో సంపూర్ణ ఆస్థి సరిహద్దులు **ఉత్తరం:** గురివిందపల్లి భారతి గారి ఇల్లు, **దక్షిణం:** R & B రోడ్, **తూర్పు:** పంచాయతీ రోడ్డు, **పడమర:** మొగిలి బాబు రావు గారి ఇల్లు

వ.నెం.3, అగ్రిమెంట్ నెం./ఫిన్ నెం. XRESVJW00735636/908220, **రుణగ్రహీత/ సహ-రుణగ్రహీత/ హామీదారు(లు)** వల్లూరి విజయ కుమార్ తండ్రి రాములు, సర్వే నెం: 287/2, డోర్ నెం: 32-66, చర్చి దగ్గర, కొండపల్లి, కృష్ణా, ఆంధ్రప్రదేశ్-521228. వల్లూరి పార్వతి భర్త విజయకుమార్, సర్వే నెం: 287/2, డోర్ నెం: 32-66, చర్చి దగ్గర, కొండపల్లి, కృష్ణా, ఆంధ్రప్రదేశ్-521228. దాసి సరోజ్ కుమార్ తండ్రి పూర్ణ చంద్ర, డోర్ నెం: 22-198, చర్చి దగ్గర, కొండపల్లి, కృష్ణా, ఆంధ్రప్రదేశ్-521228. **డిమాండ్ నోటీసు తేదీ :** 09/11/2022, **డిమాండ్ నోటీసు ప్రకారం మొత్తం:** రూ.1,43,882/-, **స్వాధీన పరచుకున్న తేదీ :** 08/03/2024, **స్థిరాస్థి వివరణ:** డోర్ నెం: 32-66, కొండపల్లి గ్రామం, ఇబ్రహీంపట్నం మండలం, కృష్ణా జిల్లా. వద్ద సర్వే నెం: 287/2, 918 చ.అ.ల భూమి కొలతతో సంపూర్ణ ఆస్థి సరిహద్దులు **ఉత్తరం:** మార్గం, **దక్షిణం:** దుగ్గేలు భాస్కర్ రావు గారి ఇల్లు, **తూర్పు:** గరిక లక్ష్మి గారి ఇల్లు, **పడమర:** మార్గం

వ.నెం.4, అగ్రిమెంట్ నెం./ఫిన్ నెం. XRESVJW00816447/1004577, **రుణగ్రహీత/ సహ-రుణగ్రహీత/ హామీదారు(లు)** గండికోట దుర్గారావు తండ్రి నేతాజీ, సర్వే నెం:287/2, D.నెం:34-9, చర్చి దగ్గర, కొండపల్లి, కృష్ణా, ఆంధ్రప్రదేశ్ 521228. గండికోట లక్ష్మి భర్త దుర్గారావు, సర్వే నెం: 287/2, D.నెం:34-9, చర్చి దగ్గర, కొండపల్లి, కృష్ణా, ఆంధ్రప్రదేశ్-521228. కోరా భగత్ తండ్రి పడలం, D.నెం : 33-418/2, చర్చి దగ్గర, కొండపల్లి, కృష్ణా, ఆంధ్రప్రదేశ్-521228. **డిమాండ్ నోటీసు తేదీ :** 09/11/2022, **డిమాండ్ నోటీసు ప్రకారం మొత్తం:** రూ.1,72,897/-, **స్వాధీన పరచుకున్న తేదీ :** 08/03/2024, **స్థిరాస్థి వివరణ:** D.నెం:34-9, చర్చి దగ్గర, కొండపల్లి గ్రామం, ఇబ్రహీంపట్నం మండలం, కృష్ణా జిల్లా. వద్ద సర్వే నెం:287/2, 1440 చ.అ.ల. భూమి కొలతతో సంపూర్ణ ఆస్థి సరిహద్దులు **ఉత్తరం:** గండికొండ దుర్గారావు గారి స్థలం, **దక్షిణం:** కూర బాస్కరరావు గారి ఇల్లు, **తూర్పు:** వీటీపీఎస్ కాలనీ, **పడమర:** మార్గం

వ.నెం.5, అగ్రిమెంట్ నెం./ఫిన్ నెం. XRESVJW00930306/1193064, **రుణగ్రహీత/ సహ-రుణగ్రహీత/ హామీదారు(లు)** బండి సురేష్ తండ్రి నాగేశ్వరరావు, సర్వే నెం.153/2, డోర్ నెం.2-173, చర్చి, ఇబ్రహీంపట్నం, ఆంధ్రప్రదేశ్ 521241. బండి జయనాగ కుమారి భర్త సురేష్, సర్వే నెం.153/2, డోర్ నెం.2-173, చర్చి, ఇబ్రహీంపట్నం, ఆంధ్రప్రదేశ్-521241. జూపూడి శివ కృష్ణ తండ్రి నాగేశ్వరరావు, డోర్ నెం.7-33A, చర్చి, గుంటుపల్లి, కృష్ణా, ఆంధ్రప్రదేశ్-521241. **డిమాండ్ నోటీసు తేదీ :** 09/11/2022, **డిమాండ్ నోటీసు ప్రకారం మొత్తం:** రూ.1,58,819/-, **స్వాధీన పరచుకున్న తేదీ :** 08/03/2024, **స్థిరాస్థి వివరణ:** డోర్ నెం.2-173, గుంటుపల్లి గ్రామం, ఇబ్రహీంపట్నం మండలం, కృష్ణా జిల్లా. వద్ద సర్వే నెం.153/2, 621 చ.అ.ల భూమి కొలతతో సంపూర్ణ ఆస్థి సరిహద్దులు **ఉత్తరం:** పట్టేటి నాగభూషణం గారి ఇల్లు, **దక్షిణం:** తురక ఏసుబాబు గారి ఇల్లు, **తూర్పు:** రోడ్డు, **పడమర:** సానపూడి కోటేశ్వరి గారి ఇల్లు

వ.నెం.6, అగ్రిమెంట్ నెం./ఫిన్ నెం. XRESVJW01025165/1323049, **రుణగ్రహీత/ సహ-రుణగ్రహీత/ హామీదారు(లు)** బోగి మరియదాసు తండ్రి శాంసన్, సర్వే నెం:287/2, డోర్ నెం:36-19/1, చర్చి దగ్గర, ఇబ్రహీంపట్నం, ఆంధ్రప్రదేశ్-521228. బోగి ప్రమీల భర్త మరియదాసు, సర్వే నెం: 287/2, డోర్ నెం:36-19/1, చర్చి దగ్గర, ఇబ్రహీంపట్నం, ఆంధ్రప్రదేశ్-521228. బోగి ప్రసాద్ తండ్రి మండలయ్య, డోర్ నెం: 4-28/3-7 /11, Csi చర్చి దగ్గర, విజయవాడ, కృష్ణా, ఆంధ్రప్రదేశ్-520001. **డిమాండ్ నోటీసు తేదీ :** 09/11/2022, **డిమాండ్ నోటీసు ప్రకారం మొత్తం:** రూ.1,06,888/-, **స్వాధీన పరచుకున్న తేదీ :** 08/03/2024, **స్థిరాస్థి వివరణ:** డోర్ నెం:36-19/1, చర్చి దగ్గర, ఇబ్రహీంపట్నం. వద్ద సర్వే నెం:287/2, 630 చ.అ.ల భూమి కొలతతో సంపూర్ణ ఆస్థి సరిహద్దులు **ఉత్తరం:** రహదారి, **దక్షిణం:** ఎం.తీతమ్మ గారి ఇల్లు, **తూర్పు:** రోడ్డు, **పడమర:** సొంత భూమి

వ.నెం.7, అగ్రిమెంట్ నెం./ఫిన్ నెం. XRESVJW01033655/1335562, **రుణగ్రహీత/ సహ-రుణగ్రహీత/ హామీదారు(లు)** గుడిసె శ్రీను తండ్రి లక్ష్మీపతి, సర్వే నెం: 21/1B, D.నెం:3-189, చర్చి దగ్గర, ఇబ్రహీంపట్నం, ఆంధ్రప్రదేశ్-521456. గుడిసె కొండల రావు తండ్రి శ్రీను, సర్వే నెం:21/1B, D.నెం: 3-189, చర్చి దగ్గర, ఇబ్రహీంపట్నం, ఆంధ్రప్రదేశ్-521456. **డిమాండ్ నోటీసు తేదీ :** 09/11/2022, **డిమాండ్ నోటీసు ప్రకారం మొత్తం :** రూ.1,24,444/-, **స్వాధీన పరచుకున్న తేదీ :** 08/03/2024, **స్థిరాస్థి వివరణ:** D.నెం:3-189, చర్చి దగ్గర, ఇబ్రహీంపట్నం. వద్ద సర్వే నెం: 21/1B, 801చ.అ.ల భూమి కొలతతో సంపూర్ణ ఆస్థి సరిహద్దులు **ఉత్తరం:** అలమల కొండలు గారి ఇల్లు, **దక్షిణం:** డ్రైనేజ్ మరియు హైవే, **తూర్పు:** మేడ రామ స్వామి గారి ఇల్లు, **పడమర:** బోల్ల రామ రావు గారి భూమి

వ.నెం.8, అగ్రిమెంట్ నెం./ఫిన్ నెం. XRESTIU00944611/1191839, **రుణగ్రహీత/ సహ-రుణగ్రహీత/ హామీదారు(లు)** కొండేటి సాగర్ తండ్రి వసంతరావు, సర్వే నెం: 202/2, సమీప డోర్ నెం:3-179, చర్చి దగ్గర, A.కొండూరు, ఆంధ్రప్రదేశ్- 521227. కొండేటి సీతారత్నం భర్త సాగర్, సర్వే నెం: 202/2, సమీప డోర్ నెం:3-179, చర్చి దగ్గర, A.కొండూరు, ఆంధ్రప్రదేశ్-521227. పాలపాటి సునీల్ తండ్రి సంజీవరావు, డోర్ నెం: 3-177 /9, చర్చి దగ్గర, చీమలపాడు, విజయవాడ-తిరువూరు, ఆంధ్రప్రదేశ్-521227. **డిమాండ్ నోటీసు తేదీ :** 09/11/2022, **డిమాండ్ నోటీసు ప్రకారం మొత్తం:** రూ.2,10,381/-, **స్వాధీన పరచుకున్న తేదీ :** 09/03/2024, **స్థిరాస్థి వివరణ:** సమీప డోర్ నెం:3-179, చర్చి దగ్గర, ఎ.కొండూరు. వద్ద సర్వే నెం:202/2, 146 చ.మీ. భూమి కొలతతో సంపూర్ణ ఆస్థి సరిహద్దులు **ఉత్తరం:** మార్గం, **దక్షిణం:** కొండేటి ప్రభాకర్ గారి ఖాళీ స్థలం, **తూర్పు:** కొండేటి ఇస్మాయిల్ గారి ఇల్లు, **పడమర:** కొండేటి రంగా గారి ఇల్లు

వ.నెం.9, అగ్రిమెంట్ నెం./ఫిన్ నెం. XRESTIU00958324/1219304, **రుణగ్రహీత/ సహ-రుణగ్రహీత/ హామీదారు(లు)** బుర్రి ప్రతాప్ తండ్రి వెంకటరత్నం, సర్వే నెం: 121/1, సమీప డోర్ నెం:5-48, స్కూల్ దగ్గర, తోలుకోడు, మైలవరం, ఆంధ్రప్రదేశ్-521230. బుర్రి వాణి భర్త ప్రతాప్, సర్వే నెం:121/1, సమీప డోర్ నెం:5-48, స్కూల్ దగ్గర, తోలుకోడు, మైలవరం, ఆంధ్రప్రదేశ్-521230. ప్రత్తిపాటి లక్ష్మయ్య తండ్రి మురళి, డోర్ నెం:8-4/1 , స్కూల్ దగ్గర, వెల్వడం, విజయవాడ-తిరువూరు, ఆంధ్రప్రదేశ్-521230. **డిమాండ్ నోటీసు తేదీ :** 09/11/2022, **డిమాండ్ నోటీసు ప్రకారం మొత్తం:** రూ.2,32,525/-, **స్వాధీన పరచుకున్న తేదీ :** 08/03/2024, **స్థిరాస్థి వివరణ:** సమీప డోర్ నెం:5-48, స్కూల్ దగ్గర, తోలుకోడు. వద్ద సర్వే నెం:121/1, 125 చ.మీ. భూమి కొలతతో సంపూర్ణ ఆస్థి సరిహద్దులు **ఉత్తరం:** పంచాయతీ రోడ్డు, **దక్షిణం:** మసీదు, **తూర్పు:** పంచాయతీ రోడ్డు, **పడమర:** కోసూరి ఏడుకొండలు గారి ఇల్లు

వ.నెం.10, అగ్రిమెంట్ నెం./ఫిన్ నెం. XRESTIU00994156/1275908, **రుణగ్రహీత/ సహ-రుణగ్రహీత/ హామీదారు(లు)** పంబి కాళీకృష్ణ తండ్రి లక్ష్మయ్య, సర్వే నెం: 202/2, సమీప డోర్ నెం:3-31/A, చర్చి దగ్గర, A.కొండూరు, ఆంధ్రప్రదేశ్ -521227. పంబి రాధ భర్త లక్ష్మయ్య, సర్వే నెం: 202/2, సమీప డోర్ నెం:3-31/A, చర్చి దగ్గర, A.కొండూరు, ఆంధ్రప్రదేశ్-521227. ములగపాటి రాజారావు తండ్రి జాన్ రాములు, డోర్ నెం: 3-176, చర్చి దగ్గర, చీమలపాడు, కృష్ణా, ఆంధ్రప్రదేశ్-521227. **డిమాండ్ నోటీసు తేదీ :** 09/11/2022, **డిమాండ్ నోటీసు ప్రకారం మొత్తం:** రూ.1,51,768/-, **స్వాధీన పరచుకున్న తేదీ :** 09/03/2024, **స్థిరాస్థి వివరణ:** సమీప డోర్ నెం: 3-31/A, చీమలపాడు, ఎ.కొండూరు. వద్ద సర్వే నెం:202/2, 684 చ.అ.ల భూమి కొలతతో సంపూర్ణ ఆస్థి సరిహద్దులు **ఉత్తరం:** మారేడు శ్రీను గారి ఇల్లు, **దక్షిణం:** పాగం సత్యనారాయణ గారి ఇల్లు, **తూర్పు:** రోడ్డు, **పడమర:** మారేడు వెంకట్రావు గారి ఇల్లు

వ.నెం.11, అగ్రిమెంట్ నెం./ఫిన్ నెం. XRESTIU01007429/1296026, **రుణగ్రహీత/ సహ-రుణగ్రహీత/ హామీదారు(లు)** ములగపాటి బాబూరావు తండ్రి సోమయ్య, సర్వే నెం: 202/2, సమీప డోర్ నెం:3-124, చర్చి దగ్గర, A.కొండూరు, ఆంధ్రప్రదేశ్-521227. పిట్టల నాంచారమ్మ భర్త బాబూరావు, సర్వే నెం: 202/2, సమీప డోర్ నెం:3-124, చర్చి దగ్గర, A.కొండూరు, ఆంధ్రప్రదేశ్-521227. సోమ చైతన్యకిరణ్ తండ్రి మోహనరావు, డోర్ నెం:3-135, చర్చి దగ్గర, చీమలపాడు, కృష్ణా, ఆంధ్రప్రదేశ్-521227. **డిమాండ్ నోటీసు తేదీ :** 09/11/2022, **డిమాండ్ నోటీసు ప్రకారం మొత్తం:** రూ.1,13,295/-, **స్వాధీన పరచుకున్న తేదీ :** 09/03/2024, **స్థిరాస్థి వివరణ:** సమీప డోర్ నెం:3-124, చర్చి దగ్గర, ఎ.కొండూరు. వద్ద సర్వే నెం:202/2, 143 చ.మీ. భూమి కొలతతో సంపూర్ణ ఆస్థి సరిహద్దులు **ఉత్తరం:** R & B రోడ్, **దక్షిణం:** పంబ బాబురావు ఇంటికి దారి, **తూర్పు:** దియాల మంగయ్య గారి స్థలం, **పడమర:** పంచాయతీ రోడ్డు

వ.నెం.12, అగ్రిమెంట్ నెం./ఫిన్ నెం. XRESTIU01022015/1306705, **రుణగ్రహీత/ సహ-రుణగ్రహీత/ హామీదారు(లు)** ముల్లంగి ప్రసాద్ తండ్రి అశోక్, సర్వే నెం: 263/8, సమీప డోర్ నెం:5-58, టెంపుల్ దగ్గర, మైలవరం, ఆంధ్రప్రదేశ్-521230. ముల్లంగి అశోక్ తండ్రి ప్రసాద్, సర్వే నెం: 263/8, సమీప డోర్ నెం:5-58, టెంపుల్ దగ్గర, మైలవరం, ఆంధ్రప్రదేశ్-521230. మర్రి వెంకటేష్ తండ్రి ముత్తయ్య, డోర్ నెం:5-60, టెంపుల్ దగ్గర, మొరుసుమిల్లి, కృష్ణా, ఆంధ్రప్రదేశ్-521230. **డిమాండ్ నోటీసు తేదీ :** 09/11/2022, **డిమాండ్ నోటీసు ప్రకారం మొత్తం:** రూ.1,37,350/-, **స్వాధీన పరచుకున్న తేదీ :** 09/03/2024, **స్థిరాస్థి వివరణ:** సమీప డోర్ నెం:5-58 దగ్గర, టెంపుల్ దగ్గర, మొరుసుమెల్లి గ్రామం, మైలవరం మండలం. వద్ద సర్వే నెం: 263/8, 2106 చ.అ.ల భూమి కొలతతో సంపూర్ణ ఆస్థి సరిహద్దులు **ఉత్తరం:** రహదారి, **దక్షిణం:** వడ్లపూడి శాంసన్ గారి ఇల్లు, **తూర్పు:** రోడ్డు, **పడమర:** జర్రిపోతుల ఆదమ్ గారి ఇల్లు

స్థలం : విజయవాడ
తేదీ : 13-03-2024
సం /- అధీకృత అధికారి
M/S. మహీంద్రా రూరల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

'పెద్దన్న' పాత్రతోనే తంటా

- వీడిపోతున్న మిత్రపక్షాలు
- పొత్తుల కోసం బిజెపి వెంపర్లాట



న్యూఢిల్లీ : లోక్‌సభ ఎన్నికల్లో సీట్ల సర్దుబాటుకు సంబంధించి భాగస్వామ్య పక్షాలతో బిజెపి జరుపుతున్న చర్చలు ఓ అడుగు ముందుకు...రెండు అడుగులు వెనక్కి అనే తరహాలో సాగుతున్నాయి. తాజాగా హర్యానాలో మిత్రపక్షమైన జన్‌నాయక్ జనతా పార్టీ (జెజెపి)తో చర్చలు విఫలం కావడంతో ఖట్టర్ ప్రభుత్వం రాజీనామా చేయాల్సి వచ్చింది. స్వతంత్ర సభ్యుల మద్దతుతో ప్రస్తుతానికి బిజెపి తన ప్రభుత్వాన్ని నిలబెట్టుకోగలిగింది. అధికార కూటమిలో పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నప్పటికీ బిజెపి నేతలు ప్రతిపక్ష ఇండియా వేదికను వేలెత్తి చూపుతున్నారు. ఇండియా వేదికలో భాగస్వామ్య పక్షాల మధ్య లుకలుకలు తలెత్తాయని చెప్పుకుంటూ సంబరపడిపోతున్నారు.

హర్యానాలో అధికార బిజెపి, జెజెపి సంకీర్ణ ప్రభుత్వంలో విభేదాలు తలెత్తడంతో మనోహర్ లాల్ ఖట్టర్ సర్కారు పతనమైంది. లోక్‌సభ ఎన్నికల్లో తనకు ప్రతిష్టాత్మక రోహ్‌తక్ సహా రెండు స్థానాలు కేటాయించాలని జెజెపి కోరగా బీజేపీ అందుకు అంగీకరించలేదు. దీంతో కూటమి విచ్ఛిన్నమైంది. లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీఏకి 400 స్థానాలు లభిస్తాయని బీరాలు పలుకుతున్న ప్రధాని మోడీకి ఈ పరిణామం ఎదురు దెబ్బేనని చెప్పాలి.

విపక్షాలతో చేతులు కలిపి...

లక్ష్య సాధన కోసం ఇప్పటి వరకూ విపక్షాలుగా ఉన్న రాష్ట్రంలోని తెలుగుదేశం, బిజూ జనతాదళ్ (ఒడిషా) పార్టీలకు కమలదళం స్నేహహస్తం అందించింది. ఒడిషాలో నవీన్ పట్నాయక్ నేతృత్వంలోని బిజూ జనతాదళ్ పార్టీ ప్రభుత్వాన్ని బిజెపి ఎప్పటి నుండో విమర్శిస్తూ వస్తోంది. ఆ రాష్ట్రంలో ఎలాగైనా ప్రతిపక్ష స్థానాన్ని సొంతం చేసుకోవాలని పావులు కదుపుతోంది. అయితే ఇప్పుడు పార్టీ రాష్ట్ర నేతల అభిప్రాయాలను బేఖాతరు చేస్తూ ఒడిషాలో ప్రధాన ప్రత్యర్థిగా ఉన్న బిజెడితో చేతులు కలిపేందుకు మోడీ-షా ద్వయం ప్రయత్నిస్తోంది.

రాష్ట్రంలో 2018లో తెలుగుదేశం పార్టీ బిజెపితో తెగతెంపులు చేసుకుంది. అప్పటి నుండీ టిడిపి అధినేత చంద్రబాబును విమర్శించే ఏ అవకాశాన్నీ బిజెపి నాయకులు వదులుకోలేదు. ఆయనను అవినీతిపరుడని, నైతికత లేని వ్యక్తి అని, అవకాశవాది అని నిందించారు. అవినీతి ఆరోపణలపై చంద్రబాబును జగన్మోహన రెడ్డి ప్రభుత్వం అరెస్ట్ చేసినప్పుడు బిజెపి సహకరించిందన్న ఊహాగానాలు కూడా వినవచ్చాయి. అయితే తాజాగా ఆ రాష్ట్రంలో సీను మారిపోయింది. జగన్మోహన రెడ్డిని వదిలేసి చంద్రబాబును భాగస్వామిగా బిజెపి ఎంచుకుంది. లోక్‌సభ, శాసనసభ ఎన్నికల్లో తెలుగుదేశంతో సీట్ల సర్దుబాటు కుదుర్చుకుంది.

అక్కున చేరిన నితీష్

బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్‌పై రెండు సంవత్సరాల పాటు తీవ్ర విమర్శలు గుప్పించిన బిజెపి పెద్దలు ఇటీవలే ఆయనను అక్కున చేర్చుకున్నారు. ఇండియా కూటమి ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన నితీష్‌తో చేయి కలిపేందుకు ఏ మాత్రం వెనుకాడలేదు. నితీష్ నేతృత్వంలోని ఐక్య జనతాదళ్‌ను చీల్చి, ఆయన ప్రభుత్వాన్ని కూలదోసిన విషయాన్ని మరిచిపోయారు. బీహార్‌లో ఆటవిక రాజ్యం నడుస్తోందంటూ చేసిన ఆరోపణలనూ విస్మరించారు. ఏ మాత్రం రెండో ఆలోచన లేకుండా నితీష్‌ను ఎన్డీఏలో చేర్చుకుంది.

నాడు వదిలేసిన వారికే స్నేహహస్తం

నిజం చెప్పాలంటే ప్రతిపక్ష పార్టీల కంటే బిజెపినే నూతన భాగస్వాముల ఎంపికలో ముందు నిలిచింది. అయితే వాటిని గౌరవించే విషయంలో మాత్రం దారుణంగా వ్యవహరించింది. 2017లో జరిగిన ఉత్తరప్రదేశ్ శాసనసభ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన తర్వాత తన ఒబిసి భాగస్వాములైన ఓం ప్రకాష్ రాజ్‌భర్, స్వామి ప్రసాద్ మౌర్యలను కరివేపాకులా తీసిపారేసింది. ఇప్పుడు మళ్లీ ఎన్నికలు వచ్చే సరికి రాజ్‌భర్‌తో మరోసారి చేయి కలిపింది. మౌర్యను ప్రసన్నం చేసుకునే ప్రయత్నం చేస్తోంది.

దూరమవుతున్న మిత్రపక్షాలు

ఎన్డీఏలో బీజేపీ పోషిస్తున్న పెద్దన్న పాత్ర కారణంగా మిత్రపక్షాలు ఒక్కొక్కటిగా ఆ పార్టీకి దూరమవుతున్నాయి. శివసేన, శిరోమణి అకాలీదళ్ (బాదల్), ఒకప్పుడు ఐక్య జనతాదళ్ ఈ కోవలోకే వస్తాయి. మిత్రులు దూరమవుతున్నప్పటికీ బీజేపీ తన నిరంకుశ పోకడలు విడనాడడం లేదు. పైగా వాటిని భయపెట్టేందుకు కేంద్ర దర్యాప్తు సంస్థలను ప్రయోగిస్తోంది. ఆయా పార్టీలను చీల్చే ప్రయత్నం చేస్తోంది. రాజకీయంగా సంక్షోభాలు ఏర్పడినప్పటికీ ధనబలం, మందబలంతో వాటిని ఎదుర్కోగలనని ధీమాగా ఉంది.

మోడీ నేతృత్వంలోని బిజెపి కార్యకలాపాలలో సిద్ధాంతాలు, విలువలకు చోటే ఉండదు. చిన్న చిన్న పార్టీలే అయినప్పటికీ కీలక రాష్ట్రాల్లో ప్రముఖ పాత్ర పోషిస్తున్న పక్షాలను కమలదళం దువ్వుతుంటుంది. ఆ తర్వాత ఆయా పార్టీలతో బీజేపీ వ్యవహరించే తీరుకు హర్యానా ఉదంతమే తాజా ఉదాహరణ. మహారాష్ట్రలో సైతం బీజేపీ, మిత్రపక్షాల మధ్య సీట్ల సర్దుబాటుపై జరుగుతున్న చర్చలు ఓ కొలిక్కి రావడం లేదు. బీజేపీ 30-32 స్థానాలలో పోటీకి దిగుతోందని, షిండే వర్గానికి 11-12 సీట్లు, అజిత్ పవార్ వర్గానికి 4-5 సీట్లు ఇవ్వబోతోందని వార్తలు వస్తున్నాయి. ఆరు స్థానాలపై మాత్రం మూడు పార్టీల మధ్య అంగీకారం కుదరడం లేదు.

బిజెపి తనకున్న వనరుల కారణంగా భాగస్వామ్య పక్షాలను సమకూర్చుకోగలుగుతోంది. అయితే వాటి స్వతంత్ర డిమాండ్ల విషయంలో అలసత్వాన్ని ప్రదర్శి స్తోంది. దీంతో కొన్ని రాష్ట్రాల్లో సంబంధాలు పుటుక్కుమని తెగిపోతున్నాయి. భాగస్వామ్య పక్షానికే వెన్నుపోటు పొడిచిన ఉదంతాలు బిజెపి చరిత్రలో మనకు కన్పిస్తాయి.

లైసెన్స్ లేని ఆయుధాలు అప్పగించాలి

- ఎస్‌పి తుహిన్ సిన్హా

పాడేరు : అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు, చింతపల్లి, రంపచోడవరం, చింతూరు పోలీస్ సబ్‌డివిజన్ పరిధిలోని గిరిజనులు, గిరిజనేతరులు ఎవరైనా కలెక్టర్ అనుమతి లేకుండా డబుల్, సింగిల్ బ్యారెల్ తుపాకులు, తపంచాలు కలిగి ఉంటే వాటిని వారం రోజుల్లోగా తమ పరిధిలోని పోలీస్‌స్టేషన్లలో స్వచ్ఛంద అప్పగించాలని అల్లూరి జిల్లా ఎస్‌పి తుహిన్ సిన్హా సూచించారు. నాటు తుపాకులు, తపంచాలు సేకరించడం, కలిగి ఉండడం, అమ్మడం, కొనడం ఏదైనా చట్టరీత్యా నేరమన్నారు.

గిరి పుత్రులకు గుణాత్మక విద్య అందించండి

- ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి అభిషేక్
- తొలివిడతలో 61మంది సిఆర్‌టిల రెగ్యులరైజేషన్
- స్కూల్ అసిస్టెంట్లుగా నియామక పత్రాలు అందజేత

ప్రజాశక్తి -పాడేరు

గిరిపుత్రులకు గుణాత్మకమైన విద్యను అందించాలని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ సూచించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులోని ఐటిడిఎ సమావేశ మందిరంలో 61 మంది సిఆర్‌టిలకు రెగ్యులరైజ్ చేస్తూ స్కూల్ అసిస్టెంట్లుగా నియామక ఉత్తర్వులను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ 2023 రెగ్యులరైజేషన్ చట్టం 30, జిఒ 114 సమర్ధవంతంగా అమలు చేసి, సిఆర్‌టిలను , రాష్ట్ర ప్రభుత్వం రెగ్యులర్ చేసిందన్నారు. 16 మంది సిఆర్‌టిలకు రెగ్యులర్ చేయడానికి సర్వీసులో కొంత వ్యత్యాసం ఉందని, అందరినీ రెగ్యులర్ చేయడానికి ప్రయత్నిస్తున్నామన్నారు. రెగ్యులర్ అయిన సిఆర్‌టిలు ఎవరికీ ఎటువంటి డబ్బులు ఇవ్వొద్దని, ఎవరైనా అక్రమ వసూళ్లకు పాల్పడితే క్రమశిక్షణా చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. మొదటి విడతలో 61 మందిని రెగ్యులర్ చేసామని, రెండవ విడతలో మరో వంద మంది ంగ్యులర్ అయ్యే అవకాశం ఉందన్నారు. అర్హతల మేరకు అందరినీ రెగ్యులర్ చేస్తామన్నారు. రెగ్యులరైన సిఆర్‌టిల వివరాలు నిధి పోర్టల్‌లో పెట్టామన్నారు. నియామక ఉత్తర్వులు పొందిన వారంతా గిరి విద్యార్థులకు మెరుగైన విద్యాబోధనతోపాటు వారి ఆరోగ్యంపైనా ప్రత్యేకదృష్టి పెట్టి, ఉన్నతులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని సూచించారు. సమావేశంలో గిరిజన సంక్షేమశాఖ ఉప సంచాలకులు ఐ. కొండలరావు పాల్గొన్నారు.

అభివృద్ధిని ఓర్వలేక తప్పుడు ప్రచారం : అమర్‌నాథ్

ప్రజాశక్తి - రాజానగరం (తూర్పుగోదావరి జిల్లా)

వైసిపి ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఐటి శాఖ మంత్రి అమర్‌నాథ్ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలంలోని కలవచర్లలో ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పనా సంస్థకు సంబంధించిన రూ.20.65 కోట్లతో నూతన పారిశ్రామిక వాడ పనులకు ఆయన మంగళవారం భూమి పూజ చేశారు. తొలుత వైసిపి జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఎంఎల్‌ఎ జక్కంపూడి రాజా అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో మంత్రి అమర్నాథ్ మాట్లాడారు. కలవచర్లలో సుమారు ఐదు వేలు ఇండస్ట్రీస్ వస్తాయన్నారు. దీని వల్ల పరిసర గ్రామాల్లో యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు వస్తాయన్నారు. అభివృద్ధిని చూసి ఓటు వేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అడుగుతుంటే, పొత్తు ఉన్నాయని కాబట్టి ఓటు వేయాలంటూ చంద్రబాబు అడగడం సిగ్గుచేటన్నారు. రానున్న ఎన్నికల్లో అసెంబ్లీ నియోజకవర్గంలో గ్లాస్ గుర్తు ఓటు వేయాలని, పార్లమెంటు నియోజకవర్గంలో పువ్వు గుర్తుకు ఓటు వేయాలని మాట్లాడే వారిని తరిమి కొట్టాలన్నారు. జోనల్ మేనేజర్ రమణారెడ్డి మాట్లాడుతూ ఈ పారిశ్రామిక వాడ సుమారు 104 ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్నామనానరు. ఐదు వేల మందికి ప్లాట్స్ కేటాయిస్తామన్నారు. రోడ్లు, డ్రెయినేజీ ఇతర సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరు శ్రీనివాస్, జడ్‌పిటిసి సభ్యులు వాసంశెట్టి పెద్ద, మండల కన్వీనర్ దూలం పెద్ద, ఎంపిపి గుర్రాల జ్యోత్స్న, పాల్గొన్నారు.

బిజెపితో జెజెపి కటీఫ్

- ఖట్టర్ రాజీనామా...నాయబ్ సైనీ ప్రమాణస్వీకారం
- హర్యానాలో నాటకీయ పరిణామాలు



చండీగఢ్: లోక్‌సభ ఎన్నికల వేళ ఎన్‌డిఎకు మరో మిత్రపక్షం దూరమైంది. హర్యానాలో బిజెపితో కలిసి అధికారాన్ని పంచుకుంటున్న జననాయక్ జనతా పార్టీ (జెజెపి) ఆ పార్టీకి గుడ్‌బై చెప్పడంతో హర్యానాలో మంగళవారం అనూహ్య నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. అధికార కూటమి భాగస్వామ్య పక్షాలైన బిజెపి, జెజెపి మధ్య తలెత్తిన విభేదాల కారణంగా మనోహర్ లాల్ ఖట్టర్ ప్రభుత్వం రాజీనామా చేసింది. కురుక్షేత్ర ఎంపీ, రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు నాయబ్ సైనీని బిజెపి శాసనసభాపక్ష నేతగా ఎన్నుకుంది. ఆయన వెంటనే రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయను కలిసి ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం ఇవ్వాలని కోరారు. సాయంత్రం సైనీ నేతృత్వంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో సైనీ చేత గవర్నర్ దత్తాత్రేయ ప్రమాణస్వీకారం చేయించారు. ఆయనతో పాటు మరో ఐదుగురు ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. వీరిలో ఓ స్వతంత్ర ఎమ్మెల్యే కూడా ఉన్నారు. మొత్తంమీద స్వతంత్ర ఎమ్మెల్యేల మద్దతుతో కమలదళం తన ప్రభుత్వాన్ని కాపాడుకుంది.

బిజెపి, జెజెపికి చెందిన ఉప ముఖ్యమంత్రి దుష్యంత్ చౌతాలా మధ్య సంబంధాలు బెడిసికొట్టడంతో సంకీర్ణ ప్రభుత్వ మనుగడ ప్రమాదంలో పడింది. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఈ రెండు పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు కుదరకపోవడమే ఈ పరిణామాలకు కారణమని తెలుస్తోంది. స్వతంత్రుల మద్దతుతో మరోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు ఖట్టర్ చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. అధిష్టానం ఆదేశాలతో బిజెపి నాయకులు అర్జున్ ముండా, తరుణ్ చుగ్ హుటాహుటిన హర్యానా వెళ్లారు. ఆ తర్వాత బిజెపి శాసనసభాపక్షం సమావేశమై సైనీని నేతగా ఎన్నుకుంది. అంతకుముందు ఈ రెండు పార్టీలు వేర్వేరుగా తమ తమ ఎమ్మెల్యేలతో సమావేశాలు నిర్వహించాయి. ఖట్టర్ తన నివాసంలో మంత్రులతో సమావేశమయ్యారు. ఆ తర్వాత వారితో సహా రాజ్‌భవన్‌కు వెళ్లి రాజీనామా సమర్పించారు.

90 మంది ఎమ్మెల్యేలు ఉన్న హర్యానా శాసనసభలో బిజెపికి 41 మంది సభ్యులు ఉన్నారు. జెజెపికి 10 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. శాసనసభకు ఎన్నికైన ఏడుగురు స్వతంత్రుల్లో ఆరుగురు బిజెపికి మద్దతు ఇస్తున్నారు. దీంతో జెజెపి మద్దతు లేకపోయినా స్వతంత్రుల సాయంతో బిజెపి తన ప్రభుత్వాన్ని కాపాడుకోగలిగింది. ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్‌కు 30 మంది, ఇండియన్ నేషనల్ లోక్‌దళ్, హర్యానా లోక్‌హిత్ పార్టీలకు ఒక్కో సభ్యుడు ఉన్నారు. బిజెపి శాసనసభా పక్ష నాయకుడిగా ఎన్నికైన తర్వాత సైనీ ఎక్స్‌లో స్పందించారు. ప్రధాని మోడీ, హోం మంత్రి అమిత్ షా, బిజెపి అధ్యక్షుడు నడ్డా, మాజీ ముఖ్యమంత్రి ఖట్టర్, పార్టీ ఎమ్మెల్యేలు, మద్దతు ఇచ్చిన స్వతంత్రులకు ధన్యవాదాలు తెలిపారు.

మరోవైపు భవిష్యత్ కార్యాచరణను నిర్ణయించేందుకు జెజెపి బుధవారం హిస్సార్‌లో ర్యాలీ నిర్వహిస్తోంది. తద్వారా తన బలాన్ని ప్రదర్శించేందుకు సిద్ధమైంది. బిజెపి తన నైతిక పరాజయాన్ని అంగీకరించిందని, ప్రజలు కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తున్నారని మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ నేత భూపేందర్ సింగ్ హూడా వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని ఆయన డిమాండ్ చేశారు.

సీట్ల సర్దుబాటులో ప్రతిష్టంభన

లోక్‌సభ ఎన్నికల్లో సీట్ల సర్దుబాటుకు సంబంధించి బిజెపి, జెజెపి మధ్య జరిగిన చర్చల్లో ప్రతిష్టంభన ఏర్పడింది. రాష్ట్రంలో పది లోక్‌సభ స్థానాలు ఉండగా జెజెపి రెండు సీట్లను కోరింది. ఇందుకు బిజెపి ససేమిరా అంది. హిస్సార్, భివానీ–మహేంద్రఘర్ లోక్‌సభ స్థానాల కోసం జెజెపి పట్టుబట్టింది. అయితే మొత్తం 10 సీట్లలోనూ తానే పోటీ చేస్తానని బీజేపీ తెగేసి చెప్పింది. 2019లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాకపోవడంతో బీజేపీ, జేజేపీ కలిపి సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీతో పొత్తు పెట్టుకునే ప్రశ్నే లేదని జేజేపీ నేత దుష్యంత్ చౌతాలా స్పష్టం చేశారు. ఆయన సోమవారం ఢిల్లీ వెళ్లి బీజేపీ అధ్యక్షుడు నడ్డాతో సమావేశమయ్యారు. తన పార్టీ వైఖరిని తెలియజేశారు. దానికి కొద్ది గంటల ముందే దుష్యంత్, మోడీ ఓ కార్యక్రమంలో వేదికను పంచుకోవడం గమనార్హం. దుష్యంత్, అమిత్ షా మధ్య మంగళవారం ఉదయం సమావేశం జరగాల్సి ఉన్నప్పటికీ జరగలేదు.

అర్థం చేసుకోవడం కష్టం

- మోడీ ప్రభుత్వ నిర్ణయంపై మాజీ ఇసి లవాసా

న్యూఢిల్లీ : ఎన్నికల కమిషనర్ల ఎంపిక కమిటీ నుండి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని తప్పిస్తూ నరేంద్ర మోడీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని అర్థం చేసుకోవడం కష్టమేనని మాజీ ఎన్నికల కమిషనర్ అశోక్ లవాసా వ్యాఖ్యానించారు. ఎన్నికల కమిషనర్ల నియామకం విషయంలో సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ ఇసిలో ఖాళీల భర్తీ కోసం ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని ఆయన తప్పుపట్టారు. గతంలో ఎన్నికల కమిషనర్ల నియామకం జరిపినప్పుడు ప్రధానితో ప్రధాన న్యాయమూర్తి ఏ సందర్భంలోనూ విభేదించలేదని గుర్తు చేశారు. 'ప్రభుత్వం మొదట్లో ఎన్నికల కమిషనర్లకు, ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు క్యాబినెట్ కార్యదర్శి హోదా ఇచ్చింది. ఆ తర్వాత వారికి సుప్రీంకోర్టు న్యాయమూర్తి హోదాను పునరుద్ధరించింది. అయితే వారి తొలగింపు ప్రక్రియలో తేడా చూపించింది. ఇలా ఎందుకు చేస్తోందో అర్థం కావడం లేదు' అని ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రికకు రాసిన వ్యాసంలో లవాసా వ్యాఖ్యానించారు.

పోఖ్రాన్‌లో 'భారత్ శక్తి' సైనిక విన్యాసాలు

- గర్జించిన యుద్ధవిమానాలు, యుద్ధట్యాంకులు

జైపూర్ : రాజస్థాన్‌లోని పోఖ్రాన్‌లో 'భారత్ శక్తి' పేరిట మంగళవారం జరిగిన విన్యాసాలు చూసేవారిని అబ్బురపరిచాయి. భారత్ అమ్ముల పొదిలోని ఎల్‌సిఎ తేజాస్, ఎఎల్‌హెచ్ ఎంకె–4 వంటి యుద్ధవిమానాలు, అర్జున్, కె–9 వజ్ర, ధనుష్ వంటి యుద్ధట్యాంకులను ఇక్కడ ప్రదర్శించింది. వీటితో చేసిన విన్యాసాలు ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. శరంగ్ ఆర్టిలరీ గన్ సిస్టమ్, పినాకా శాటిలైట్ సిస్టమ్, డ్రోన్‌ల సమూహం భారత సైనిక శక్తి చాటి చెప్పాయి. ఈ సైనిక విన్యాసాలను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఇతర ఉన్నతాధికారులు ప్రత్యక్షంగా వీక్షించారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీ మాట్లాడుతూ భారత సైన్యం గగనతలంలోనూ, భూమిపై ప్రదర్శించిన పరాక్రమాన్ని 'న్యూ ఇండియా'గా వర్ణించారు.

హైకోర్టుకు ఎందుకెళ్లలేదు ?

- అనర్హత వేటుకు గురైన హిమాచల్ ప్రదేశ్ ఎమ్మెల్యేలకు సుప్రీం ప్రశ్న

న్యూఢిల్లీ : తమపై పడిన అనర్హత వేటుకు వ్యతిరేకంగా హైకోర్టుకు ఎందుకెళ్లలేదని హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలను సుప్రీంకోర్టు మంగళవారం ప్రశ్నించింది. ఇటీవల జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్‌కు పాల్పడినందుకు ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై హిమాచల్ ప్రదేశ్ స్పీకర్ కుల్దీప్ సింగ్ పఠనియా ఫిబ్రవరి 29న అనర్హత వేటు వేశారు. దీనిపై ఎమ్మెల్యేలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటీషన్‌ను జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం మంగళవారం విచారించింది. అనర్హత వేటుకు వ్యతిరేకంగా హైకోర్టుకు ఎందుకెళ్లలేదని ఎమ్మెల్యేలను ప్రశ్నించింది. దీనికి ఎమ్మెల్యేల తరుపున న్యాయవాది సమాధానం ఇస్తూ '18 గంటల్లోనే ఎమ్మెల్యేలపై అనర్హత వేటు అసాధారణమైనది' అని తెలిపారు. తమ సీనియర్ న్యాయవాదుల్లో ఒకరైన హరీశ్ సాల్వే నేటి విచారణకు రాలేదని, విచారణను వాయిదా వేయాలని కోరారు. దీంతో ధర్మాసనం తదుపరి విచారణను ఈ నెల 18కి వాయిదా వేసింది.

హపూర్ మూకదాడి కేసులో 10 మందికి జీవిత ఖైదు

లక్నో : దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన హపూర్ 2018 మూకదాడి కేసులో మొత్తం 10 మంది నిందితులను స్థానిక కోర్టు మంగళవారం దోషులుగా నిర్ధారించింది. 10 మందికీ జీవిత ఖైదు విధించింది. హపూర్ అదనపు జిల్లా జడ్జి (పోస్కో) శ్వేతా దీక్షిత్ ఈ మేరకు తీర్పు చెప్పారు. దోషులు రాకేష్, హరిఓమ్, యుధిష్ఠిర్, రింకూ, కరణ్‌పాల్, మనీష్, లలిత్, సోను, కప్తాన్, మంగేరామ్‌లకు ఒక్కొక్కరికీ రూ. 58 వేల జరిమానాను కూడా విధించినట్లు ప్రభుత్వ న్యాయవాది విజయ్ చౌహాన్ మీడియాకు తెలిపారు. వీరంతా ధౌలానా జిల్లాలోని బజైదా గ్రామానికి చెందినవారు. 2018 జూన్‌లో ఉత్తరప్రదేశ్‌లోని హపూర్‌కు సమీపంలో గోవధకు పాల్పడుతున్నారనే ఆరోపణలతో బజైదా గ్రామానికి చెందిన 45 ఏళ్ల ఖసిం ఖురేషి, 62 ఏళ్ల సమాయదీన్‌పై అదే గ్రామస్థులు మూకదాడికి పాల్పడ్డారు. దారుణంగా కొట్టారు. ఈ దాడిలో ఖురేషి మరణించగా, సమాయదీన్ తీవ్రగాయాలతో బయటపడ్డాడు. ఈ కేసును నీరుగార్చడానికి ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఎంతగానో ప్రయత్నించింది. మూకదాడికి బదులుగా మోటార్ సైకిల్ ప్రమాదంలో ఖురేషి మరణించినట్లుగా పోలీసులు తప్పుడు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. దీంతో సమాయదీన్ సుప్రీంకోర్టును ఆశ్రయించాల్సి వచ్చింది. బాధితుడి ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేయాలని, ఈ కేసు విచారణను మీరట్ జోన్ ఐజి పర్యవేక్షించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది.

పాక్‌తో చర్చలకు తలుపులు తెరిచే ఉన్నాయి : భారత్

న్యూఢిల్లీ : పాకిస్థాన్ తో చర్చలకు భారత్ తలుపులు ఎప్పుడూ మూయలేదని విదేశాంగ శాఖ మంత్రి ఎస్. జైశంకర్ తెలిపారు. అయితే ఒకవేళ ఇరు దేశాలు చర్చలు జరపాల్సి వస్తే.. ప్రధానమైన అంశం ఉగ్రవాదమని స్పష్టం చేశారు. ఇటీవల జపాన్, దక్షిణ కొరియా పర్యటన అనంతరం భారత్‌కు చేరుకున్న ఆయన.. ఒక జాతీయ వార్తా సంస్థ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారత్–పాక్ సంబంధాలు, చైనాతో సరిహద్దు వివాదం, రష్యాతో స్నేహం..తదితర అంశాలపై మాట్లాడారు. "పాకిస్థాన్‌తో చర్చలకు తలుపులు మేం ఎప్పుడూ మూయలేదు. పెద్ద సంఖ్యలో ఉగ్రవాద కేంద్రాలు ఉన్న దేశంతో చర్చించాల్సి వస్తే.. ముఖ్యంగా దాని గురించే మాట్లాడాలి. ఇతరత్రా సమస్యలు ఉన్నా కూడా ప్రధానంగా ఉగ్రవాదంపైనే చర్చ ఉంటుంది" అని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో పాక్ సైన్యంతో భేటీ అయ్యే పరిస్థితులు లేవని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. భారత్–చైనా సంబంధాల గురించి మాట్లాడుతూ.. నాలుగేళ్లుగా ఇరు దేశాల మధ్య సరిహద్దు వివాదంపై చర్చలు జరుగుతున్నా ఎలాంటి ఫలితం వెలువడలేదన్నారు. "వాస్తవాధీన రేఖ వద్ద పెద్ద సంఖ్యలో బలగాలు మోహరించడం భారత్‌కు అవసరం. అదే సమయంలో సరిహద్దు వివాదంపై న్యాయమైన పరిష్కారానికి కట్టుబడి ఉన్నాం. గతంలో చేసుకున్న ఒప్పందాలను భారత్ గౌరవిస్తుంది. ఎల్ఏసీ వద్ద ఎలాంటి మార్పులు చేయకుండా ఉన్న పరిస్థితిని కొనసాగించేందుకు అంగీకరిస్తాం. అదే ఇరు పక్షాలకు మంచిదని భావిస్తున్నా. ఈ వివాదానికి సహేతుకమైన పరిష్కారం త్వరలోనే లభిస్తుంది" అని జైశంకర్ తెలిపారు.

తమిళనాడులో 2 స్థానాల్లో సిపిఎం పోటీ

ప్రజాశక్తి–న్యూఢిల్లీ బ్యూరో

లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా తమిళనాడులోని రెండు నియోజకవర్గాల్లో సిపిఎం పోటీ చేయనుంది. మదురై, దిండిగల్‌లో ఆ పార్టీ పోటీ చేయనుంది. ఇండియా ఫోరంలో భాగంగా డిఎంకెతో సిపిఎం పొత్తు పెట్టుకుంది. సిపిఎం గతసారి కోయంబత్తూరు, మదురైలో పోటీ చేసి రెండు స్థానాల్లో విజయం సాధించింది. ఈసారి కోయంబత్తూరు స్థానంలో కాకుండా దిండిగల్ నుంచి పోటీ చేయాలని సిపిఎం నిర్ణయం తీసుకుంది. మదురైలో యథాతథంగా పోటీ చేస్తుంది.

తొలిసారి 'తేజాస్'కు ప్రమాదం

న్యూఢిల్లీ : భారత వాయు సేనకు చెందిన ఒక తేజాస్ తేలిక పాటి యుద్ధవిమానం (ఎల్‌సిఎ) మంగళవారం రాజస్థాన్‌లో కూలిపోయింది. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన తేజాస్ ఇలా కూలిపోవడం ఇదే మొదటిసారి. 2001 జనవరి 4న తేజాస్ తొలిసారిగా గాల్లోకి ఎగిరింది. అప్పటి నుంచి ఈ 23 ఏళ్ల కాలంలో తేజాస్ ఒక్కసారి కూడా ప్రమాదానికి గురికాలేదు. మంగళవారం జైసల్మేర్‌కు సమీపంలో ఒక శిక్షణ కార్యక్రమంలో తేజాస్ కూలిపోయింది. ముందుగానే అప్రమత్తత కావడంతో పైలట్ సురక్షితంగా బయటపడినట్లు అధికారులు తెలిపారు. ప్రమాదం జరగడానికి గల కారణాలను గుర్తించేందుకు అధికారులు విచారణకు ఆదేశించారు. 2001లోనే విజయవంతంగా అన్ని పరీక్షలను పూర్తి చేసుకున్న తేజాస్ యుద్ధవిమానం 2016లో భారత సైన్యంలోకి ప్రవేశించింది. ప్రభుత్వ రంగ సంస్థ హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఎఎల్)తో ఈ తేజాస్‌ను ఉత్పత్తి చేస్తోంది.

ఉదయనిధి స్టాలిన్‌కు బీహార్ కోర్టు సమన్లు

పాట్నా : తమిళనాడు క్రీడా మంత్రి, డిఎంకె నాయకుడు ఉదయనిధి స్టాలిన్‌కు బీహార్‌లోని ఒక కోర్టు సమన్లు జారీ చేసింది. హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉదయనిధి వ్యాఖ్యలు ఉన్నాయని న్యాయవాది ధర్నింధర్ పాండే వేసిన పిటీషన్‌ను విచారణను స్వీకరించిన బీహార్‌లోని ఆరా కోర్టు మంగళవారం విచారణను ప్రారంభించింది. చీఫ్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ మనోరంజన్ కుమార్ ఝా సమన్లు జారీ చేశారు. తదుపరి విచారణను ఏప్రిల్ 1కు వాయిదా వేశారు. గత ఏడాది సెప్టెంబర్ 2న చెన్నైలో జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ సనాతన ధర్మంపై ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలపై పలుచోట్ల కేసులు నమోదయ్యాయి.

43 మందితో కాంగ్రెస్ రెండో జాబితా

- ఐదు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి అభ్యర్థుల ప్రకటన
- పేదల కోసం లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పోటీ చేస్తుంది : కెసి వేణుగోపాల్

ప్రజాశక్తి–న్యూఢిల్లీ బ్యూరో

లోక్‌సభ ఎన్నికల బరిలో నిలిచే 43 మంది అభ్యర్థులతో కాంగ్రెస్ రెండో జాబితా విడుదల చేసింది. ఇందులో అస్సాం (12), గుజరాత్ (7), మధ్యప్రదేశ్ (10), రాజస్థాన్ (10), ఉత్తరాఖండ్ (3), డమన్ అండ్ డయ్యూ (1) రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి అభ్యర్థుల పేర్లను ప్రకటించింది. ఈ జాబితాలో 10 జనరల్, 13 ఒబిసి, 10 ఎస్‌సి, 9 ఎస్‌టి, 1 మైనార్టీ అభ్యర్థికి అవకాశం కల్పించారు. మంగళవారం ఎఐసిసి ప్రధాన కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) కెసి వేణుగోపాల్ రెండో జాబితాను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సోమవారం జరిగిన కాంగ్రెస్ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ (సిఇసి)లో మహారాష్ట్ర, గుజరాత్, అస్సాం, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌కు సంబంధించిన రాష్ట్రాల అభ్యర్థుల ఎంపికపై చర్చించి నిర్ణయం చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీది ప్రజల అజెండా అన్నారు. పేదల కోసం కాంగ్రెస్ లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తుందని వివరించారు. పేదలు, యువకులు, సామాజిక న్యాయం కోసం పోరాడుతుందన్నారు. కర్ణాటక, తెలంగాణలో ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నామని వివరించారు. తాము అధికారంలోకి వస్తే పేద ప్రజల ప్రయోజనాల కోసం పని చేస్తామని హామీ ఇచ్చారు. ఈ ఎన్నికల్లో వకులు, సామాజిక న్యాయం దిశగా కాంగ్రెస్ అభ్యర్థుల ప్రకటన ఉందన్నారు. ఇప్పటి వరకు విడుదల చేసిన రెండు జాబితాల్లో ఇదే సిద్ధాంతాన్ని అమలు చేశామని తెలిపారు.

రెండో జాబితాలో కీలక అభ్యర్థులు

రెండో జాబితాలో కాంగ్రెస్ పాలిత మాజీ ముఖ్యమంత్రుల కుమారులకు అవకాశం దక్కింది. మధ్యప్రదేశ్ మాజీ సిఎం కమల్‌నాథ్ కుమారుడు నకుల్ నాథ్ (సిట్టింగ్ ఎంపి) మరోసారి చింద్వార నుంచి బరిలో నిలుస్తున్నారు. జలోర్ నుంచి రాజస్థాన్ మాజీ సిఎం అశోక్ గెహ్లాట్ కుమారుడు వైభవ్ గెహ్లాట్, జోర్హాట్ నుంచి తరుణ్ గగోయి కుమారుడు గౌరవ్ గగోయి (సిట్టింగ్ ఎంపి)లకు మరోసారి అవకాశం కల్పించారు. ఇటీవల బిజెపి నుంచి కాంగ్రెస్‌లో చేరిన రామ్‌సింగ్ కాస్వాన్ కుమారుడు రాహుల్ కాస్వాన్‌ను రాజస్థాన్‌లోని చురు నుంచి పార్టీ బరిలో దింపింది. వీరితో పాటు పెద్ద సంఖ్యలో యువకులకు కాంగ్రెస్ అవకాశం కల్పించింది.

సిఎఎ అమలును వ్యతిరేకిస్తూ పిటిషన్

ప్రజాశక్తి–న్యూఢిల్లీ బ్యూరో

పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ)కు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. సిఎఎ అమలు చేయకుండా స్టే విధించాలని డివైఎఫ్ఐ పిటిషన్ దాఖలు చేసింది. ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయుఎంఎల్) కూడా సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. సిఎఎ వల్ల నిర్దిష్ట మతాలకు మాత్రమే పౌరసత్వం దక్కుతుందని, ఈ చట్టం ప్రాథమికంగా రాజ్యాంగ విరుద్ధమని పిటిషన్‌లో పేర్కొంది.

దరఖాస్తుల దాఖలుకు కొత్త పోర్టల్

పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ)–2019 కింద పౌరసత్వానికి దరఖాస్తు చేసుకునే వారి కోసం కేంద్ర ప్రభుత్వం మంగళవారం కొత్త పోర్టల్‌ను ప్రారంభించింది. పోర్టల్‌తో పాటూ మొబైల్ యాప్ 'సిఎఎ–2019'ని కూడా ప్రభుత్వం ప్రారంభించనుంది. దరఖాస్తుదారులు ఆరు రకాల డాక్యుమెంట్లను అందచేయాలని నిబంధనలు పేర్కొంటున్నాయి. భారత్‌లోకి ప్రవేశించిన తేదీని కూడా నిర్దిష్టంగా పేర్కొనాల్సి వుంటుంది. పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్‌ల నుండి భారత్‌లోకి ప్రవేశించిన హిందూ, సిక్కు, బౌద్ధులు, పార్శీలు, క్రైస్తవులు, జైన మతాలకు చెందిన వారికి పౌరసత్వం కల్పించేందుకు ఈ చట్టం ఉద్దేశించబడింది.

స్కూళ్లలో ప్రధాని ప్రసంగాన్ని ప్రసారం చేయండి

- వికసిత్ భారత్ పోస్టర్లను ఏర్పాటు చేయండి
- మోడీ ప్రభుత్వ హుకుం
- విద్యావేత్తల విమర్శ



న్యూఢిల్లీ : సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నాయి. మరో రెండు మూడు రోజులలో ఎన్నికల షెడ్యూలు కూడా విడుదల కాబోతోంది. ఆ వెంటనే ప్రవర్తనా నియమావళి అమలులోకి వస్తుంది. కోడ్ అమలులోకి వచ్చే లోగా ఓటర్లను ఆకర్షించేందుకు అధికారిక కార్యక్రమాలను ఉపయోగించుకోవాలని నరేంద్ర మోడీ ప్రభుత్వం భావిస్తోంది. ప్రధాని మోడీ బుధవారం గుజరాత్, అసోం రాష్ట్రాలలో సెమీకండక్టర్ ఫ్యాబ్‌ల ఏర్పాటుకు శంకుస్థాపన చేయబోతున్నారు. ఆ సందర్భంగా ఏర్పాటు చేసే అధికారిక కార్యక్రమాలలో ప్రసంగిస్తారు. స్క్రీన్లు ఏర్పాటు చేసి ప్రధాని ప్రసంగాన్ని ప్రత్యక్ష ప్రసారం చేయాల్సిందిగా దేశంలోని ఉన్నత విద్యా సంస్థలకు (హెచ్ఈఐలు) కేంద్రం హుకుం జారీ చేసింది. తొలిసారి ఓటు హక్కు వినియోగించుకోబోతున్న యువతను బీజేపీ వైపు ఆకర్షించేందుకు అధికార కార్యక్రమాన్ని ఉపయోగించుకుంటున్నారని 'టెలిగ్రాఫ్' పత్రిక తెలిపింది.


గుజరాత్‌లోని ధొలేరా, సనంద్, అసోంలోని మోరిగాన్‌లో సెమీకండక్టర్ ఫ్యాబ్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. వీటికి ప్రధాని భూమిపూజ చేయడం తప్పేమీ కాదు కానీ ఆయన ప్రసంగాన్ని దేశవ్యాప్తంగా ఉన్నత విద్యా సంస్థల్లో ప్రసారం చేయాలని అనుకోవడం 'ప్రచార కార్యక్రమం' మినహా మరొకటి కాదని విద్యావేత్తలు అంటున్నారు. ఇది ఉన్నత విద్యా సంస్థల వ్యవహారాలలో జోక్యం చేసుకోవడమే అవుతుందని విమర్శిస్తున్నారు. కార్యక్రమాలు జరిగే ప్రదేశాలలో మోడీ చిత్రాలతో కూడిన వికసిత్ భారత్ పోస్టర్లను ఏర్పాటు చేయాలని విద్యా శాఖ హెచ్ఈఐలను ఆదేశించింది. తన ఆదేశాలను పాటించిందీ లేనిదీ కార్యక్రమం పూర్తయిన తర్వాత నివేదిక రూపంలో తెలియజేయాలని కూడా సూచించింది. దేశంలోని రాష్ట్ర స్థాయి యూనివర్సిటీలు, ప్రైవేటు వర్సిటీలు సహా అన్ని యూనివర్సిటీలలో ఈ కార్యక్రమాన్ని ఏ విధంగా ప్రసారం చేయాలో కూడా మంత్రిత్వ శాఖ, యూజీసీ సూచించాయి. 'కార్యక్రమ నిర్వహణకు సంబంధించి ఐదు పోస్టర్ల డిజైన్లను పంపుతున్నాం. విద్యార్థులకు ఈ కార్యక్రమానికి సంబంధించిన సమాచారాన్ని అందించండి. వికసిత్ భారత్ విజన్ దిశగా ఈ కార్యక్రమంలో విద్యార్థులు భాగస్వాములయ్యేలా చూడండి' అని హెచ్ఈఐలకు రాసిన లేఖలో యూజీసీ కార్యదర్శి మనీష్ జోషి వివరించారు.

విద్యావేత్తల విమర్శ

ఇది లోక్‌సభ ఎన్నికలకు ముందు నిర్వహించే ప్రచార కార్యక్రమం మాత్రమేనని మిరండా హౌస్ కళాశాల ఉపాధ్యాయుడు అబా దేవ్ హబీబ్ వ్యాఖ్యానించారు. రాజకీయ ఉద్దేశంతో ఇలాంటి ఆదేశాలు జారీ చేయడం సరికాదని ఢిల్లీ యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు అశోక్ అగర్వాల్ చెప్పారు. రాజకీయ ఉద్దేశాలతో ఏర్పాటు చేసిన కార్యక్రమం కోసం సమయాన్ని వెచ్చించాలని విద్యా సంస్థలను బలవంతం చేయడం తప్పుడు చర్య అని అన్నారు. ఉన్నత విద్యా సంస్థలు స్వయం ప్రతిపత్తి కలిగినవని, ఇలాంటి ఆదేశాలను బేఖాతరు చేసే అధికారం వాటికి ఉన్నదని, అయితే తమపై వేధింపులకు పాల్పడతారన్న భయంతో ఆ సంస్థలు అలా చేయడానికి సాహసించవని ఆయన తెలిపారు.

ఇది మొదటిసారి కాదు

ప్రభుత్వ ప్రచార కార్యక్రమాలకు విద్యా సంస్థలను వాడుకోవడం ఇది మొదటిసారి కాదు. యూనివర్సిటీలు, కాలేజీల ఆవరణల్లో మోడీ ప్రభుత్వ 'బేటీ బచావ్ బేటీ పఢావ్' లోగోలను ఏర్పాటు చేయాలని గతంలో యూజీసీ ఆదేశించింది. మోడీ నేపథ్యంలో సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేయాలని గత సంవత్సరం డిసెంబరులో హుకుం జారీ చేసింది. ఆర్ఎస్ఎస్ నేత దత్తాజీ దిదోల్కర్ జయంతి ఉత్సవాలలో విద్యార్థులు పాల్గొనేలా చూడాలని కొద్ది రోజుల క్రితం మహారాష్ట్రలోని ఉన్నత విద్యా సంస్థలన్నింటికీ సూచనలు చేసింది.



వాతావరణాన్ని కాపాడండి

స్వీడిష్ పార్లమెంట్ వద్ద కార్యకర్తల ఆందోళన

స్టాక్‌హోం : ముదురుతున్న వాతావరణ సంక్షోభం నేపథ్యంలో చేపట్టాల్సిన మార్పులకు సంబంధించి సత్వరమే చర్యలు చేపట్టాలని కోరుతూ స్వీడిష్ వాతావరణ కార్యకర్త గ్రెటా థన్‌బెర్గ్‌తో సహా పలువురు కార్యకర్తలు స్వీడిష్ పార్లమెంట్ వద్ద సోమవారం బైఠాయించారు. ప్రత్యేకంగా ఒక సంస్థకు చెందిన వారిగా కన్నా యువతే ప్రధానంగా ఈ ఆందోళనలో పాల్గొన్నారు. స్టాక్‌హోంలోని ప్రభుత్వ భవనాల సముదాయం ప్రధాన ప్రవేశమార్గం వెలుపల వారు కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. రాజకీయ నేతలు లోపలకు వెళ్ళి తమ విధులు నిర్వర్తించనీయకుండా అడ్డుకున్నారు. వేడెక్కుతున్న భూగోళం, మానవాళికి ముప్పుగా పరిణమిస్తున్న వాతావరణ మార్పులు వేటినీ కూడా స్వీడిష్ ప్రభుత్వం అత్యవసర పరిస్థితిగా చూడడం లేదని 21ఏళ్ల వాతావరణ కార్యకర్త గ్రెటా థన్‌బెర్గ్ విమర్శించారు. తాము చాలా చేస్తున్నామని, సరైన దిశలోనే ముందుకు సాగుతున్నామని పైకి కనిపించేలా చేస్తూ లోపల మాత్రం అందుకు పూర్తి విరుద్ధంగా వ్యవహరిస్తోందని అన్నారు. ఇప్పటికీ ఒప్పందంలో పేర్కొన్న కుదిరిన పర్యావరణ లక్ష్యాల సాధనకు ఏ విధంగా ముందుకు సాగాలన్నదానిపై స్వీడిష్ ప్రభుత్వం వద్ద నిర్దిష్ట ప్రణాళికలేవీ లేవని ఆమె విమర్శించారు.

ఇసి పనితీరుపై నీలినీడలు



- ప్రశ్నార్థకం అవుతున్న పారదర్శకత

న్యూఢిల్లీ : లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో ఎన్నికల కమిషనర్ అరుణ్ గోయల్ తన పదవికి రాజీనామా చేయడంతో ఎన్నికల కమిషన్ (ఇసి) పనితీరుపై నీలినీడలు అలముకున్నాయి. దాని పారదర్శకత రానురానూ ప్రశ్నార్థకం అవుతోంది. గోయల్ రాజీనామాతో ఇప్పుడు ఇసిలో కేవలం ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ మాత్రమే ఉన్నారు. గత నెలలో పదవీ విరమణ చేసిన అనూప్ పాండే స్థానంలో ఇప్పటి వరకూ ఎవరినీ నియమించలేదు. ఈ వారంలోనే ప్రధాని నేతృత్వంలోని ఎంపిక కమిటీ సమావేశమై ఖాళీగా ఉన్న రెండు పదవులను భర్తీ చేసే అవకాశం ఉంది.

ప్రజాస్వామిక వ్యవస్థలో ఎన్నికల కమిషన్ నిర్వహించే పాత్రకు ఎంతో ప్రాధాన్యత ఉంది. లోక్‌సభ, రాజ్యసభ, రాష్ట్రాల శాసనసభలకు ఈ సంస్థ ఆధ్వర్యంలోనే ఎన్నికలు జరుగుతాయి. రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి పదవులకు కూడా ఎన్నికల కమిషనే ఎన్నికలు నిర్వహిస్తుంది. వివిధ రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రవర్తనా నియమావళికి కట్టుబడి ఉండేలా ఈసీ చర్యలు తీసుకుంటుంది. అయితే ఇటీవలి కాలంలో దేశంలో స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించడం అసాధ్యంగా మారింది. ప్రజాస్వామ్యానికి తావే లేకుండా పోతోంది. నియంతృత్వం రాజ్యమేలుతోంది. ఈ నేపథ్యంలో ఎన్నికల కమిషన్ స్వతంత్రత, పారదర్శకత, పనితీరు ప్రశ్నార్థకంగా మారింది.

ఇబిలపై పిల్లిమొగ్గలు

ఎన్నికల బాండ్ల (ఇబి) పథకంపై సుప్రీంకోర్టు గత నెలలో సంచలన తీర్పు ఇచ్చిన తర్వాత మూడు రోజుల వరకూ ఇసి పెదవి విప్పలేదు. ఆ తర్వాత కోర్టు ఆదేశాలను అమలు చేస్తామని సిఇసి రాజీవ్ కుమార్ ముక్తసరిగా చెప్పారు. సుప్రీంకోర్టు తాజా ఆదేశాల మేరకు ఈసీ ఈ నెల 15వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోగా ఎన్నికల బాండ్ల వివరాలను తన వెబ్‌సైట్‌లో పెట్టాల్సి ఉంటుంది. వాస్తవానికి ఎన్నికల బాండ్ల పథకంపై ఈసీ మొదటి నుండి పిల్లిమొగ్గలు వేస్తోంది. ఈ పథకం ప్రారంభం కావడానికి ముందు దానిని వ్యతిరేకిస్తూ న్యాయ శాఖకు లేఖ రాసింది. అయితే 2021లో హఠాత్తుగా తన వైఖరిని మార్చుకుంది. ఎన్నికల బాండ్ల జారీపై స్టే విధించాలన్న అభ్యర్థనను సుప్రీంకోర్టులో వ్యతిరేకించింది.

ఈవీఎంలు, వీవీపాట్లపై...

ఎన్నికల్లో ఈవీఎంలు, వీవీపాట్లను ఉపయోగించడంపై పలు అనుమానాలు, సందేహాలు వ్యక్తమవుతున్నాయి. 2019 ఎన్నికల్లో ఈవీఎంలు, వీవీపాట్ల మధ్య వచ్చిన వ్యత్యాసాలకు సంబంధించి ఎన్నికల కమిషన్ కేంద్రానికి ఎలాంటి వివరణలు ఇవ్వలేదు. గత నాలుగు సంవత్సరాలుగా ఈసీ నుండి సమాధానం కోసం ఎదురు చూస్తున్నామని కేంద్ర ప్రభుత్వం గత జూలైలో పార్లమెంటుకు తెలియజేసింది. ఈవీఎంలను నూటికి నూరు శాతం పరిశీలించడం తిరోగమనమే అవుతుందని, అది తిరిగి పేపర్ బ్యాలెట్ పద్ధతికి దారితీస్తుందని గత సెప్టెంబరులో సుప్రీంకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో ఈసీ తెలిపింది.

ప్రధాని నిర్ణయం మేరకే...

అరుణ్ గోయల్ రాజీనామా అనేక ప్రశ్నలు లేవనెత్తింది. అయితే ఆయన నియామకం వివాదరహితమైనదేమీ కాదు. ఐఏఎస్ పదవికి రాజీనామా చేసిన మరునాడే 2022 నవంబర్ 10న ఆయన ఈసీగా నియమితులయ్యారు. ఈ హడావిడి ప్రక్రియను సుప్రీంకోర్టు తప్పు పట్టింది కూడా. ఈసీలో ఇప్పుడు ఖాళీగా ఉన్న ఎన్నికల కమిషనర్ల పదవులను నూతన చట్టం ప్రకారం భర్తీ చేస్తారు. ఈసీలు, సీఈసీల నియామక ప్రక్రియ నుండి ప్రధాన న్యాయమూర్తిని తప్పించిన విషయం తెలిసిందే. దీంతో ప్రధాని అభీష్టం మేరకే నియామకాలు జరిగిపోతాయి. ఎంపిక కమిటీలో ప్రతిపక్ష నేత సభ్యుడుగా ఉన్నప్పటికీ ఆయన మాట చెల్లుబాటు కాదు.

అసమ్మతి తెలిపితే అంతే

ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా నియమితులు కావడానికి కొద్ది నెలల ముందు అంటే 2020 ఆగస్టులో ఎన్నికల కమిషనర్ అశోక్ లవాసా తన పదవికి రాజీనామా చేశారు. 2019 లోక్‌సభ ఎన్నికల ప్రచారం సందర్భంగా మోడీ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించారని లవాసా అభిప్రాయపడ్డారు. ఈసీలో మిగిలిన ఇద్దరు సభ్యులు దీనితో ఏకీభవించకపోవడంతో కమిషన్ ఆదేశాలలో తన అసమ్మతిని నమోదు చేయాలని లవాసా పట్టుబట్టారు.

ఈ ఉదంతం జరిగిన తర్వాత కొన్ని వారాలకు లవాసా మొబైల్ ఫోన్ పెగాసస్ స్పైవేర్‌కు లక్ష్యంగా మారింది. 2019లో లవాసా భార్య, కుమారుడు, సోదరిపై కూడా దర్యాప్తు సంస్థలు నిఘా పెట్టాయి. ప్రధాన ఎన్నికల కమిషనర్ అయ్యే అవకాశాలు ఉన్నప్పటికీ లవాసా 2020లో కమిషన్‌కు రాజీనామా చేసి ఆసియన్ అభివృద్ధి బ్యాంక్‌లో ఉపాధ్యక్షుడుగా చేరారు. ప్రస్తుతం ఆయన అక్కడే పనిచేస్తున్నారు. తన రాజీనామాకు ముందు ఆయన ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రికలో ఓ వ్యాసం రాస్తూ 'ఇది హుందాగా వ్యవహరించినందుకు లభించిన మూల్యం' అని వ్యాఖ్యానించారు.





మీ కోసం

వామును దోరగా వేయించి, పొడిచేసి ప్రతిరోజూ భోజనంలో వేడి అన్నంతో కలిపి మొదటి రెండు ముద్దలు తింటే కడుపుబ్బరం తగ్గుతుంది.

జీవన సౌరభం

చదువు పాఠం నేర్పి పరీక్ష పెడుతుంది.. జీవితం పరీక్ష పెట్టి పాఠం నేర్పుతుంది.

JEEVANA జీవన the family

అవ్వా కావాలి, బువ్వా కావాలి



అనగా అనగా పుణ్యగిరి అనే ఊరు ఉంది. ఆ ఊళ్ళో శంకరం, రత్న దంపతులు నివసిస్తున్నారు. వారికి ఇద్దరు పిల్లలు. కొడుకు పేరు హరి, కూతురి పేరు మానస. ఒకసారి ఊళ్లో జరిగే జాతరకు పిల్లలు ఇద్దరినీ తీసుకు వెళ్ళింది రత్న. దారి పొడవునా బూరలు, ఆట వస్తువులు, బొమ్మలు కొనమని పేచీ పెట్టాడు హరి. మానస మాత్రం పేచీ పెట్టకుండా బుద్ధిగా దుకాణాల్లో అమ్మే వస్తువులన్నీ ఆసక్తిగా చూసింది. హరికి కారు బొమ్మ, మానసకి పాప బొమ్మ కొనిచ్చింది రత్న. 'నాకు రెండూ కావాలి' అని ఏడుపు మొదలుపెట్టాడు హరి. 'ఒకటి నీకు ఒకటి చెల్లికి. అవ్వా కావాలి, బువ్వా కావాలి అంటే కుదరదు' అని మందలించింది రత్న.

'అమ్మా అవ్వా కావాలి, బువ్వా కావాలి అంటే ఏంటో చెప్పవా?' అని అడిగింది మానస.


పూర్వం పేదరాశి పెద్దమ్మ అనే పూటకూళ్లవ్వ ఉండేది. పెద్దమ్మ మనవడి పేరు రుద్రాంశ్. అవ్వని అంటిపెట్టుకుని ఉండేవాడు. వాడంటే పెద్దమ్మకి ప్రాణం. ఒకరోజు మధ్యాహ్నం వంట పూర్తి చేసుకుని భోజనాలు వడ్డించడానికి సిద్ధపడుతోంది పెద్దమ్మ. అదే సమయంలో 'అవ్వా నాకు ఆకలి వేస్తోంది బువ్వ కావాలి' అని ఏడవ సాగాడు.

'ఏడవకురా నాయనా! ఒక్క క్షణం.. ఉప్పు, నెయ్యి అన్నం కలిపి తెస్తాను' అని చెప్పి గబగబా కలిపి తెచ్చి 'తిను' అంది పెద్దమ్మ. 'నాకు తినడం రాదు. నువ్వు తినిపించు' అన్నాడు గోముగా. 'నీకు తినిపించే తీరిక లేదు. వీళ్ళందరికీ భోజనాలు పెట్టాలి. ఆకలితో ఉన్నారు. నీ చేత్తో నువ్వు తింటేనే బలం. తింటూ ఉంటే అదే వస్తుంది' అంది పెద్దమ్మ. 'అబ్బా, నాకు ఆకలేస్తోంది తినిపించవే!' అని రాగం తీశాడు రుద్రాంశ్.

'ఒరేయ్ అల్లరోడా.. అవ్వా కావాలి, బువ్వా కావాలి అంటే కుదరదు. తొందరగా తింటే తాయిలం ఇస్తాను' అంది పెద్దమ్మ. 'గబగబ లొట్టలేసుకుంటూ తినేశాడు రుద్రాంశ్'. 'అప్పటి నుంచి ఈ సామెత వాడుకలోకి వచ్చింది' అని చెప్పింది తల్లి.

'అంటే రెండిటిలో ఏదో ఒకటి మాత్రమే తీసుకోమని దాని అర్థం అన్నమాట' అంది మానస. 'సామెత నీకు అర్థమయ్యింది' అన్నాడు తండ్రి శంకరం. 'నాకూ అర్థమయ్యింది' అన్నాడు హరి ఏడుస్తూ.

- కాశీ విశ్వనాథం పట్రాయుడు
9494524445



నీడను కనిపెట్టండి

పిల్లలూ ఇక్కడ పై వరుసలో ఉన్న బొమ్మల నీడలు, కింది వరుసలో గజిబిజిగా ఉన్నాయి. ఏ బొమ్మకు ఏది సరైన నీడో జత చేయండి చూద్దాం.

నేను గీసిన బొమ్మ



ఎ.రాజేష్,
ఆరో తరగతి,
పెద్ద గొట్టి ముక్కల,
మెదక్ జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఒత్తిడిని జయించు.. విజయం సాధించు

పరీక్షల సమయంలో సాధారణంగా విద్యార్థులు ఒత్తిడికి గురౌతుంటారు. ప్రశాంతంగా ఉండాలి. తద్వారానే మంచిగా పరీక్షలు రాసి మంచి మార్కులు సాధించే అవకాశం ఉంటుంది. ఏడాదిపాటు చదివిన అంశాలే కాబట్టి ప్రతిరోజూ అన్ని సబ్జెక్టులకు సంబంధించిన పాఠాలను చదువుకుంటూ వెళ్లటం ఉత్తమం. తద్వారా గతంలో చదివిన విషయాలను మళ్లీ ఒకసారి గమనంలోకి తెచ్చుకోవటానికి అవకాశం ఉంటుంది. ప్రణాళికాబద్ధంగా కృషిచేస్తే మంచి మార్కులతో విజయం సాధించటం సులభమే అవుతుంది.



- ఎస్.పి.మనోహర్ కుమార్
యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి,
సెల్ : 94907 62412

రాష్ట్రవ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు ఈనెల 18 నుంచి ప్రారంభం కానున్నాయి. ఏడాదిలో కష్టపడి చదివింది ఎలాంటి తప్పిదాలకు తావీయకుండా 3.15 గంటల సమయంలో (పిఎస్, ఎన్ఎస్ పరీక్షలు 2 గంటలు మాత్రమే) పరీక్షల్లో సమర్థవంతంగా రాయగలిగినప్పుడే చక్కని ఫలితం చేజిక్కుతుంది. పరీక్షలు రాసేటప్పుడు దొర్లే చిన్నా చితకా పొరపాట్లు ఫలితాల్లో విద్యార్థుల అంచనాలను తలకిందులు చేస్తుంటాయి. ఒక మార్కు తగ్గినా పరీక్ష తప్పొచ్చు. వస్తాయన్న మార్కులు సాధించలేకపోవచ్చు. ఇలాంటి తప్పిదాల కారణంగా ప్రతిభావంతులు సైతం ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశం కోల్పోతుంటారు. మరికొన్ని రోజులు మాత్రమే పరీక్షలకు సమయం ఉంది కాబట్టి ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలి. సాధారణ పరీక్షల్లో జరిగే తప్పుల వల్ల నష్టం ఏమీ లేకుండా ఉండొచ్చు. కానీ, పబ్లిక్ పరీక్షల్లో అవే పొరపాట్లు పునరావృతమైతే జరిగే నష్టం అపారం. ఈ నేపథ్యంలో పరీక్షల్లో ఎక్కువ శాతం మంది విద్యార్థులు చేసే సాధారణ తప్పిదాలు ఏమిటో తెలుసుకుందాం.

ఒత్తిడికి దూరంగా ఉండాలి

- ఆశించిన రీతిలో అధిక మార్కులు సాధించాలంటే, పరీక్షల సమయంలో ఎలాంటి ఒత్తిడికి గురికాకూడదు. చదివినదంతా తక్కువ సమయంలో రివిజన్ చేసుకోవాలి.
- గ్రాపులు, పటాలు, బొమ్మలను పెన్సిలుతోనే గీయాలి.
- స్కెచ్ పెన్నులు వాడకూడదు.
- ఒఎంఆర్ షీట్‌పై బార్‌కోడ్ ఉంటుంది కాబట్టి ఎలాంటి అనవసరమైన రాతలు రాయకుండా, నలపకుండా, చెమట చుక్కలు పడకుండా జాగ్రత్త వహించాలి.
- పరీక్షా సమయంలో సెల్‌ఫోన్, టివి, కంప్యూటర్ల వైపు దృష్టి మరలకుండా చూసుకోవాలి.
- నిర్దేశించుకున్న సమయం ప్రకారం సిలబస్ రివిజన్ పూర్తిచేయాలి.
  ప్రతిరోజూ సమయానికి నిద్రపోవాలి, ఆరోగ్యంపట్ల జాగ్రత్త తీసుకోవాలి.

జవాబులు ఇలా రాయాలి

ప్రశ్నాపత్రంలోని ప్రశ్నలు విద్యార్థుల పరిశీలన, విశ్లేషణ, అవగాహన శక్తిని వెలికితీసేలా ఉంటాయి. అందుకే ప్రశ్నాపత్రాన్ని చదవడానికే పావుగంట సమయం ఇచ్చారు. సుమారు 75 శాతం మంది ప్రశ్నా పత్రాన్ని తీసుకున్న 5 నిమిషాల్లోనే జవాబులు రాయటం మొదలెడుతున్నారు. ఇది సరికాదు. ముందుగా ప్రశ్నలను బాగా చదివాకే సమాధానాలు రాయటం ప్రారంభించాలి. సమాధాన పత్రాలతో కూడిన బుక్‌లెట్ ఇవ్వగానే ముందుగా ప్రతి పేజీకి ఎడమవైపు 2-2.5సెంటీమీటర్లు ఉండేలా మార్జిన్ వదలాలి.

తెలుగు, హిందీని తేలికగా తీసేయొద్దు

తెలుగు, హిందీ, ఆంగ్లంలో వ్యాకరణ, అక్షర దోషాలు లేకుండా జాగ్రత్త పడటం చాలా ముఖ్యం. తెలుగు మన మాతృభాషే కదాని తేలికగా తీసుకోకూడదు. మంచి మార్కులు సాధించడం కోసం పద్యభాగం, గద్యభాగంలోని అన్ని అంశాలను పున:శ్చరణ చేయాలి. ప్రతిపదార్థం , వ్యాకరణాంశాలు రివిజన్ చేయాలి.

ఇంగ్లీషులోనూ మంచి మార్కులు సాధించొచ్చు

గ్రామీణ విద్యార్థులు కూడా మంచి మార్కులు ఇంగ్లీషు సబ్జెక్టులో సాధించొచ్చు. సెక్షన్ ఎ లో రీడింగ్ కాంప్రెహెన్షన్ స్టడీస్కిల్స్, సెక్షన్ బిలో గ్రామర్, ఒకాబలరీలలో మంచి మార్కులు సాధించొచ్చు. సెక్షన్ సిలో క్రియేటివ్ ఎక్స్‌ప్రెషన్ స్వంతంగా రాయడం ద్వారా మంచి మార్కులు సాధించొచ్చు. .

నాలుగు సబ్జెక్టుల్లో బొమ్మలూ కీలకమే

గణితం, భౌతిక, జీవ, సాంఘిక శాస్త్రాల్లో సమాధానాలు రాసేటప్పుడు మొదట 2 మార్కులవి, తర్వాత ఒక మార్కువి రాయాలి. చివరగా 4 మార్కుల సమాధానాలు రాస్తే మంచిది. భౌతికశాస్త్రంలోని సమస్యల (ప్రాబ్లెమ్స్)లో ప్రమాణాలను రాయడం మరిచిపోరాదు. ఉదాహరణకు సెంటీ మీటరు, గ్రాము, జౌలు, వాట్స్ తదితరాలు. జీవశాస్త్రంలో ప్రయోగాలకు చెందిన జవాబులను రాసేటప్పుడు సంబంధిత బొమ్మలను కూడా తప్పక వేయాలి.

గణితంలో ముఖ్యమైన నిర్వచనాలు , సూత్రాలు రివిజన్ చేయాలి. టెక్స్ట్‌బుక్ చాప్టర్ చివరలో ఉండే సమస్యలను మరొక్కసారి రివిజన్ చేసుకోవాలి. గ్రాఫ్ వంటి ప్రశ్నలు తప్పనిసరిగా రాయాలి. త్రికోణమితి, బహుపదులు, వాస్తవ సంఖ్యలు, సాంఖ్యాక శాస్త్రం సమితులు వంటి చాప్టర్లు మరింతగా రివిజన్ చేయడం ద్వారా మంచి మార్కులు పొందొచ్చు.

సాంఘిక శాస్త్రంలోని మ్యాప్ పాయింట్‌కు మంచి ప్రాధాన్యత ఇవ్వాలి. పైచార్టు, మ్యాప్ రీడింగ్ ప్రశ్నలను తప్పనిసరిగా రాయాలి. సమకాలీన అంశాలలో మూస ధోరణులకు ప్రాధాన్యం తగ్గించి, సొంత అవగాహనతో నిత్య జీవిత ఉదాహరణలు అన్వయిస్తూ రాయాలి. ఒక మార్కు ప్రశ్నలు తప్పనిసరిగా రాయాలి. కాలపట్టికను జాగ్రత్తగా అర్థంచేసుకొని జవాబులు రాస్తే మంచి మార్కులు పొందొచ్చు. ఎక్కువ మంది ఇక్కడే తప్పులు చేస్తుంటారు. జాగ్రత్తగా చూసుకోవాలి. పేపరు దిద్దేవారు మార్కులు వేయటానికి ఇది అవసరం. లేకపోతే ఒక్కోసారి జవాబుకు వేసిన మార్కులు కనిపించక లెక్కవేయడం మరిచిపోతుంటారు. ప్రశ్నాపత్రంలో బాగా వచ్చిన ఏ ప్రశ్నకైనా ముందుగా జవాబు రాయొచ్చు. ఆ ప్రశ్న నంబరును ఎడమవైపు మార్జిన్‌లో తప్పక వేయాలి. ప్రశ్నల నంబర్లు తప్పుగా వేయడం, మరిచిపోవడం చేసేవారు 1 శాతం వరకూ ఉంటారు. ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- ఎర్ర సిరా ఉండే (బాల్)పెన్ను వాడకూడదు.
- నీలం బ్లూ, నలుపు సిరా ఉండే వాటినే ఉపయోగించాలి.
- పెద్ద అక్షరాలతో, మరీ ఎక్కువ మార్జిన్ వదిలి భారీగా పేజీలు నింపడం వల్ల ప్రయోజనం శూన్యం.
- దిద్దేటప్పుడు ఉపాధ్యాయులు అసహనానికి లోనయ్యే అవకాశం ఉంది.
- ప్రతి పుటకు 20-25 వాక్యాలు రాస్తే మేలు.
- జవాబులను వ్యాసంలా కాక బుల్లెట్ పాయింట్ల రూపంలో రాయాలి. దానివల్ల మూల్యాంకనం చేసే వారికి సులభంగా అర్థమవుతుంది.



- ఇలా రాసేవారు 50 శాతానికి మించడం లేదు.
- రాయాల్సినవన్నీ పూర్తయ్యాకే ఐచ్ఛిక (ఛాయిస్) ప్రశ్నలు రాయడానికి ప్రయత్నించాలి. లేకుంటే సమయం సరిపోక ఇబ్బంది తలెత్తే అవకాశముంది.
- పేజీ చివర కొంత ప్రదేశం మిగిలిందని ఇంకో జవాబు రాయటం, పదాన్ని విడకొట్టి రాయటం చేస్తున్నారు. ఇలా చేయకూడదు
- బిట్ పేపర్‌లో కొట్టివేతలు, దిద్దివేతలు ఉండరాదు.
- బ్రాకెట్‌లో ఒకటి రాసి, మళ్లీ కొట్టివేసి బయట రాస్తున్నారు. ఇలా చేయటం సరికాదు.
- సాధ్యమైనంతవరకు 10-15 నిమిషాలు ముందే పరీక్ష రాయటం పూర్తిచేయాలి.
- రాసిన జవాబులు, ప్రశ్నల నంబర్లను మరోసారి పరిశీలించుకోవాలి.

ఆత్మ విశ్వాసంతో పరీక్షలు రాయండి. విజయాన్ని సాధించండి.

'మారుతినగర్ సుబ్రహ్మణ్యం' ఫస్ట్‌లుక్ విడుదల



రావు రమేష్ కథానాయకుడిగా పీబీఆర్ సినిమాస్ పతాకంపై తెరకెక్కుతున్న చిత్రం 'మారుతినగర్ సుబ్రహ్మణం'. ఇంద్రజ కథానాయిక. లక్ష్మణ్ కార్య దర్శకుడు. ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్‌లుక్‌ను రావు రమేష్ ఓ వీడియో ద్వారా విడుదల చేశారు. ఆ వీడియో చివర్లో క్యూఆర్ ఇచ్చారు. అది స్కాన్ చేస్తే ఫస్ట్ లుక్ విడుదల అవుతుంది. ఈ వీడియోలో రావు రమేష్ సందేశం ఉంది. 'మారుతినగర్ సుబ్రహ్మణ్యం' సినిమా భలే గమ్మత్తుగా ఉంటుంది. అయితే ఈ సినిమా పోస్టర్ ఎవరు ఆవిష్కరిస్తే బాగుంటుందని అనుకున్నా. నటుడిగా నాకు ఈ స్థాయిని, ఈ స్థానాన్ని ఇచ్చిన తెలుగు ప్రేక్షకులే ఆవిష్కరిస్తే సమంజసమని మేమంతా నమ్మాం. మీరు చేయాల్సిందల్లా ఒక్కటే... వీడియో చివర్లో వచ్చే క్యూఆర్ కోడ్‌ని మీ చేతులతో స్కాన్ చేయండి. నా పోస్టర్ ఆవిష్కరించండి.ప్రోత్సహించండి' అని విజ్ఞప్తిచేశారు.

కేటీఆర్‌చే లిరికల్ సాంగ్ విడుదల



చైతన్యరావు, భూమి శెట్టి జంటగా నటించిన చిత్రం 'షరతులు వర్తిస్తాయి'. కుమారస్వామి దర్శకుడు. స్టార్ లైట్ స్టూడియోస్ బ్యానర్‌పై నాగార్జున సామల, శ్రీష్ కుమార్ గుండా, డాక్టర్ కృష్ణకాంత్ చిత్తజల్లు నిర్మించారు. ఈనెల 15న ఈ సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా 'తురుమై వచ్చేయ్...' అనే లిరికల్ సాంగ్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విడుదల చేశారు. హీరో చైతన్యకృష్ణ మాట్లాడుతూ 'తురుమై వచ్చేయ్...' పాటను ఎంతో హుందాగా తెరకెక్కించామన్నారు.



సందీప్ కొత్త సినిమా

టాలీవుడ్ యంగ్ హీరో సందీప్ కిషన్ దర్శకుడు త్రినాధరావు నక్కినతో తన తరువాతి సినిమాను చేయబోతున్నారు. తాజాగా దీనికి సంబంధించిన ప్రకటన విడుదలైంది. 'ఎస్‌కె-30' వర్కింగ్ టైటిల్‌తో వస్తున్న ఈ సినిమాని ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్, హాస్య మూవీస్ బ్యానర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ప్రసన్న కుమార్ బెజవాడ కథని అందిస్తున్నారు. కామెడీ అండ్ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా రాబోతున్న ఈ సినిమా పూర్తి వివరాలు త్వరలోనే ప్రకటించనున్నారు.

సల్మాన్‌తో మురుగదాస్



దక్షిణాది అగ్ర దర్శకుడు ఏఆర్ మురుగదాస్ చాలా రోజుల తర్వాత కొత్త సినిమాను ప్రకటించారు. బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్ హీరోగా ఒక చిత్రం నిర్మిస్తున్నట్లు ఆయన తాజాగా వెల్లడించారు. ఈ యాక్షన్ చిత్రం కోసం మురుగదాస్ చాలా కాలంగా స్క్రీన్‌ప్లేపై వర్క్ చేస్తున్నారు. ఈ చిత్రానికి నిర్మాతగా సాజిద్ నడియాద్వాలా ఉన్నారు. 2025 రంజాన్‌లో ఈ చిత్రాన్ని విడుదల చేస్తామని ప్రకటించారు.

త్వరలో కొత్త సినిమా షూటింగ్



త్వరలోనే కొత్త సినిమాకు షూటింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్నామని బెస్ట్ ప్రొడ్యూసర్ అవార్డు గ్రహీత రాజా సాగి సత్యనారాయణరాజు (కుర్రపల్లి బాబు) తెలిపారు. ఈ సినిమాకు సంబంధించిన తారాగణం, ఇతర వివరాలు త్వరలోనే ప్రకటిస్తామని పేర్కొన్నారు. ఇప్పటికే కథ సిద్ధం చేశామన్నారు. సమాజానికి మంచి జరిగాలనే ఉద్దేశ్యంతో కొత్త కథతో త్వరలో సినిమా తీయటానికి ఏర్పాట్లు చేస్తున్నానన్నారు. ఈ క్రమంలోనే గతేడాది తాను నిర్మించిన 'ఒక్కడే వీరుడు (అల్లూరి సీతారామరాజు) బయోపిక్‌కు ఇంటర్నేషనల్ ఫిల్మ్‌ఫెస్టివల్‌లో బెస్ట్ బయోఫిక్‌కు ఎంపికయ్యిందన్నారు. తనకు బెస్ట్ బయోపిక్ ప్రొడ్యూసర్ అవార్డును అతిథులు అందజేశారన్నారు. సినిమా చూసిన వారంతా తనకు ఎంతో ప్రశంసలు అందజేశారనానరు. తాను పొందిన అవార్డు షీల్డులను ఆయన ప్రదర్శించారు. గతంలో నాలుగు సినిమాల్లో కూడా తాను నటించానన్నారు. కొత్త సినిమా కోసం ఇప్పటికే షూటింగ్ స్పాట్స్ ఎంపిక చేశామన్నారు.



మలయాళ సినిమాలో అనుష్క

అనుష్కశెట్టి గత ఏడాది 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి'. చిత్రంలో కనిపించారు. తాజాగా ఆమె ఓ మలయాళ చిత్రంలో నటిస్తున్నట్లు ప్రకటించారు. రోజిన్ థామస్ దర్శకత్వంలో 'కథనార్ : ది వైల్డ్ సోర్సెరర్' అనే టైటిల్‌తో ఈ చిత్రం రానుంది. అనుష్క చేస్తున్న తొలి మలయాళ చిత్రమిది. సోమవారం సెట్స్ మీదకెళ్లింది. ఈ చిత్రం షూటింగ్ మొదలై చాలా కాలం అయినా అనుష్క సోమవారం సెట్‌లో అడుగుపెట్టింది. ఈ విషయాన్ని దర్శకుడు రోజిన్ థామస్ సోషల్ మీడియా వేదికగా ఫొటోలు షేర్ చేసి చెప్పారు.

పెర్రీ దెబ్బకు ముంబయి ధమాల్

- ఏడు వికెట్ల తేడాతో బెంగళూరు గెలుపు
- ప్లే-ఆఫ్ బెర్తులు భర్తీ
- ఫైనల్‌కు ఢిల్లీ క్యాపిటల్స్



ఎలేసా పెర్రి
4-0-15-6

న్యూఢిల్లీ: ఢిల్లీ క్యాపిటల్స్ మహిళలతో జరిగిన మ్యాచ్‌లో అనూహ్య ఓటమిపాలైన బెంగళూరు జట్టు మంగళవారం ముంబయి ఇండియన్స్‌పై ఘన విజయం సాధించింది. దీంతో ప్లే-ఆఫ్ చేరింది. నేడు ఢిల్లీ-గుజరాత్ జట్ల మధ్య నామమాత్రపు ఆఖరి లీగ్ పోటీ జరగనుంది. మంగళవారం ముంబయి ఇండియన్స్‌తో జరిగిన పోరులో బెంగళూరు ఏడు వికెట్ల తేడాతో గెలిచింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ముంబయి కేవలం 113పరుగులకే ఆలౌట్ కాగా.. ఆ లక్ష్యాన్ని బెంగళూరు జట్టు 15ఓవర్లలో కేవలం 3వికెట్లు కోల్పోయి 115పరుగులు చేసి గెలిచింది. ఎలేసా పెర్రి(40నాటౌట్), రీచా ఘోష్(36నాటౌట్) బెంగళూరు గెలుపులో కీలకపాత్ర పోషించారు.

టాస్ గెలిచిన బెంగళూరు కెప్టెన్ స్మృతి మంధాన తొలిగా బౌలింగ్ ఎంచుకోగా.. బ్యాటింగ్‌కు దిగిన ముంబయిని కేవలం 113పరుగులకే కట్టడి చేసింది. ఓపెనర్లు మాథ్యూస్(26), సజన(30) టాప్ స్కోరర్స్. బెంగళూరు బౌలర్ ఎలేసా పెర్రి ఆరు వికెట్లు కూల్చి ముంబయిని కట్టడి చేయడంలో సఫలమైంది. తొలుత ముంబయి ఇండియన్స్‌కు శుభారంభం దక్కింది. మాథ్యూస్-సజన కలిసి తొలి వికెట్‌కు 43పరుగులు జతచేశారు. ఆ తర్వాత బ్రంట్(10) కూడా రాణించడంతో ముంబయి జట్టు 8.4ఓవర్లలో 2వికెట్ల నష్టానికి 65పరుగులు పటిష్టంగా ఉంది. ఆ దశలో పెర్రీ చెలరేగి బౌలింగ్ చేసి ముంబయి బ్యాటర్లను కట్టడి చేసింది. కెప్టెన్ హర్మన్ ప్రీత్(0), కెర్ర్(2), అమన్‌జ్యోత్(6), ఖాజి(4) త్వరగా పెవీలియన్‌కు చేరాడు. చివర్లో ప్రియాంక (19నాటౌట్) రాణించడంతో ఆమాత్రమైనా స్కోర్ చేసింది. బెంగళూరు బౌలర్లు కెర్ర్‌కు ఆరు, మోలినెక్స్, డివైన్, శోభన, శ్రేయాంకకు ఒక్కో వికెట్ దక్కాయి. ఈ మ్యాచ్‌లో నెగ్గితే బెంగళూరు నేరుగా ప్లే-ఆఫ్స్‌కు చేరనుంది. ఛేదనలో మంధాన(11), మోలినెక్స్(11), డివైన్(4) నిరాశపరిచినా.. మరో వికెట్ పడకుండా పెర్రీ-రీచా మ్యాచ్‌ను ముగించారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ ఎలేసా పెర్రికి లభించింది. మరో మ్యాచ్ మిగిలి ఉండగానే ఢిల్లీ జట్టు ఫైనల్‌కు చేరింది.

రిషబ్ పంత్‌కు గ్రీన్ సిగ్నల్: బిసిసిఐ



ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఊరట లభించింది. ఆ జట్టు కెప్టెన్ రిషబ్ పంత్ ఈ సీజన్ ఐపిఎల్ ఆడేందుకు బిసిసిఐ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 2022లో కారు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పంత్ 14నెలల తర్వాత పూర్తి ఫిట్‌నెస్ సాధించాడని బిసిసిఐ ఓ ప్రకటనలో వెల్లడించింది. బ్యాటర్‌గానే కాకుండా వికెట్‌కీపర్‌గానూ ఫిట్‌గా ఉన్నాడని పేర్కొంది. బిసిసిఐ తాజా ప్రకటనతో ఢిల్లీ క్యాపిటల్స్ అభిమానులకు పెద్ద ఊరట లభించింది. ఇటీవలే సర్జరీ చేయించుకున్న రాజస్థాన్ రాయల్స్ బౌలర్ ప్రసిద్ధ్ కృష్ణ ఐపిఎల్ 2024 సీజన్ మొత్తానికి దూరంగా ఉండనున్నట్లు బిసిసిఐ వెల్లడించింది. అలాగే చీలిమండ సర్జరీ చేయించుకున్న గుజరాత్ టైటాన్స్ పేసర్ మొహమ్మద్ షమీ కూడా సీజన్ మొత్తానికి అందుబాటులో ఉండడని అధికారికంగా కన్ఫర్మ్ చేసింది. కాగా, ఐపిఎల్ 2024 సీజన్ మార్చి 22 నుంచి ప్రారంభంకానుంది.

రెండోరౌండ్‌కు సింధు

ప్రణయ్, ఆకర్షి ఔట్..

ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ టోర్నీ

లండన్: ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత షట్లర్లకు మిశ్రమ ఫలితాలు దక్కాయి. మంగళవారం నుంచి ప్రారంభమైన టోర్నమెంట్‌లోమహిళల సింగిల్స్‌లో పివి సింధు రెండోరౌండ్‌కు చేరగా.. ఆకర్షి కశ్యప్ ఓటమిపాలైంది. అలాగే పురుషుల సింగిల్స్‌లో 7వ సీడ్ హెచ్ఎస్ ప్రణయ్ అనూహ్యంగా తొలిరౌండ్‌లోనే పరాజయాన్ని చవిచూశాడు. మహిళల సింగిల్స్‌లో పివి సింధు 21-10తో తొలి గేమ్‌ను చేజిక్కించుకున్న తర్వాత జర్మనీకి చెందిన యొన్నే లీ గాయంతో టోర్నమెంట్‌నుంచి నిష్క్రమించింది. మరో సింగిల్స్ పోటీలో ఆకర్షి కశ్యప్ 16-21, 11-21తో పై-యు-పో(చైనీస్ తైపీ) చేతిలో వరుససెట్లలో ఓడింది. ఇక పురుషుల సింగిల్స్‌లో స్టార్ ఆటగాడు ప్రణయ్ 14-21తో తొలి గేమ్‌ను చేజిక్కించుకున్నా.. ఆ తర్వాత రెండు సెట్లను 13-21, 13-21తో ఓటమిపాలయ్యాడు. నేడు జరిగే ఇతర పోటీల్లో కిదాంబి శ్రీకాంత్, మహిళల డబుల్స్‌లో త్రీసా జోలీ-గాయత్రి తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.

జైస్వాల్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మంత్' అవార్డు

దుబాయ్: ఇంగ్లండ్‌తో జరిగిన ఐదు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌లో దుమ్మురేపిన టీమిండియా యువ సంచలనం యశస్వి జైస్వాల్ మరో ఘనత సాధించాడు ఐసిసి ప్రతి నెలా ప్రకటించే అవార్డుకు ఎంపికయ్యాడు. ఫిబ్రవరి నెలకుగానూ 'ప్లేయర్ ఆఫ్ ది మంత్' అవార్డును జైస్వాల్ గెలుచుకున్నాడు. ఇటీవల ఇంగ్లండ్‌తో జరిగిన ఐదు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌లో 22ఏళ్ల జైస్వాల్ రెండు డబుల్ సెంచలు, మరో రెండు అర్ధసెంచరీల సాయంతో 712పరుగులతో సత్తా చాటాడు. అలాగే టెస్ట్‌లో అత్యధికంగా సిక్సర్లు(12) కొట్టిన తొలి ఆటగానిగా రికార్డు నెలకొల్పి ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచాడు. జైస్వాల్ రాణించడంతో భారతజట్టు తొలి టెస్ట్ ఓడినా.. సిరీస్‌ను 4-1తో చేజిక్కించుకోవడం విశేషం. మహిళల విభాగంలో ఆసీస్ క్రికెటర్ అనాబెల్ సథర్‌లాండ్ ఈ పురస్కారం దక్కించుకుంది. ఇటీవల దక్షిణాఫ్రికాతో జరిగిన ఏకైక టెస్టులో సథర్‌లాండ్ డబుల్ సెంచరీతో సత్తా చాటింది. ఓటింగ్‌లో కేన్ విలియమ్సన్, శ్రీలంక ఓపెనర్ పథుమ్ నిస్సంకలను వెనక్కి నెట్టి మరీ యశస్వి ఈ పురస్కారాన్ని గెలుచుకున్నాడు.

ముషీర్ ఖాన్ సెంచరీ

విదర్భ లక్ష్యం 538పరుగులు

ముంబయి: వాంఖడే స్టేడియంలో జరుగుతున్న రంజీట్రోఫీ ఫైనల్లో ముంబయి జట్టు విదర్భకు భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. రెండో ఇన్నింగ్స్‌లో ముంబయి జట్టు 418పరుగులకు ఆలౌట్ కావడంతో.. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యతతో కలిపి విదర్భ ముందు 538పరుగుల లక్ష్యాన్ని ఉంచింది. ఓవర్‌నైట్ స్కోర్ 2వికెట్ల నష్టానికి 141పరుగులతో మంగళవారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ముంబయి జట్టును ముషీర్ ఖాన్(136) సెంచరీతో ఆదుకున్నాడు. కెప్టెన్ రహానే(95) తృటిలో సెంచరీ మిస్ చేసుకున్నా.. సామ్స్ ములానీ(50) అర్ధసెంచరీతో రాణించాడు. దీంతో ముంబయి జట్టు రెండో ఇన్నింగ్స్‌లో భారీస్కోర్‌ను నమోదు చేసింది. విదర్భ బౌలర్లు హర్ష్ దూబేకు ఐదు, యశ్ ఠాకూర్‌కు మూడు వికెట్లు దక్కాయి. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ముంబయి జట్టు మూడోరోజు ఆట నిలిచే సమయానికి వికెట్లేమీ నష్టపోకుండా 10 పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో ముంబయి 224పరుగులు చేయగా.. విదర్భ 105పరుగులకే కుప్పకూలిన సంగతి తెలిసిందే.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68